జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967, 7989694528

రంగారెడ్డి | మంగళవారం 18 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 194 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI | http://www.prajajyothinews.com | Mail: prajajyothidaily@gmail.com

# ప్రతి కుటుంబానికి ఇళ్లు



- 2029 కల్లా హామీలు నెరవేరుస్తాం
- ఒకప్పుడు అనంతపురం కరువు జిల్లా.. ఇప్పుడు 26 జిల్లాల్లో 5వ స్థానం
- త్రిభాషా సూత్రంపై రాద్ధాంతం వద్దు
- పతి నియోజవర్గానికీ విజన్ డాక్యుమెంట్
- పైలట్ ప్రాజెక్టుగా కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలు
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజెంటేషన్

**అమరావతి**

ప్రతి కుటుంబానికి కనీస సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత. ప్రతి కుటుంబానికి ఇళ్లు, పారిశుధ్య సౌకర్యం, నీటి సరఫరా, ఎల్పీజీ గ్యాస్ కనెక్షన్, డిజిటల్ కనెక్టవిటీ, ఎలక్ట్రిసిటీ, సోలార్ రూఫ్ టాప్, రహదారుల అనుసంధానం, డ్రైనేజీ నెట్వర్క్, వేస్ట్ టు వెల్త్, స్ట్రీట్ లైటింగ్, సోషల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటు చేస్తాం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సోమవారం జరిగిన శాసనసభ సమావేశంలో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల-2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. స్వర్ణాంధ్ర విజన్ - 2047 సాధనలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని, వాటిని అమలు చేసి నియోజకవర్గ అభివద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా ముందు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలకు విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేసినట్టు చెప్పారు. నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్‌ను సఫలీకతం చేసుకునేందుకు ఎమ్మెల్యేలకు అవకాశం కల్పిస్తున్నామని, దీనికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని తెలిపారు. మండల, మున్సిపాలిటీ విజన్ యాక్షన్ ప్లాన్‌ను గ్రామ, - మిగతా 3లో



## నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది

- ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదు
- బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ వారిని దోచుకుంటుంది
- పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారు
- కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే

## ఎస్సీ వర్గీకరణ బిల్లుకు
# కేబినెట్ ఆమోదం



- వైఎస్ఆర్ కడపగా జిల్లా పేరు మార్చాలని నిర్ణయం
- కేబినెట్‌లో కీలక నిర్ణయం.. వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం
- పలు కీలక నిర్ణయాలు తీసుకున్న చంద్రబాబు కేబినెట్
- కేబినెట్ భేటీ ముగిశాక చంద్రబాబుతో పవన్ ప్రత్యేక సమావేశం


**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సోమవారం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. మంత్రులతో మాట్లాడిన అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. జిల్లా యూనిట్‌గా చేయాలని కొంతమంది మంత్రులు కోరారు. అలా చేస్తే న్యాయ పరమైన చిక్కులు వస్తాయని అధికారులు తెలిపారు. - మిగతా 3లో

## 'అంత మాట అంటారా?.. పిల్ల చేష్టలు వద్దు'



- పబ్లిక్‌లో ఏది పడితే అది మాట్లాడాతానంటే ఇక్కడ కుదరదు
- చీఫ్ మినిస్టర్ రాష్ట్రంలో అత్యద్భుతంగా పరిపాలన సాగిస్తున్నారు
- అటువంటి నాయకుడ్ని ఔరంగజేబుతో పోలుస్తారా?
- ఇది కచ్చితంగా ఖండించాల్సిన అంశమే



## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం

- సోమవారం, మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనం
- బుధవారం, గురువారం రూ. 300 ప్రత్యేక దర్శనం
- సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు టీటీడీ నిర్ణయం

**అమరావతి**

తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించింది. ఈ మేరకు టీటీడీ అధికారులు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. తెలంగాణ నేతల సిఫార్సు లేఖలపై సోమవారం, మంగళవారం వీఐపీ బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆదివారం, సోమవారం మాత్రమే లేఖలు స్వీకరిస్తామని తెలిపారు. బుధవారం, గురువారం రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలకు (ఏ రోజుకు ఆ రోజే) లేఖలు అనుమతిస్తామని స్పష్టం చేశారు. ఆయా రోజుల్లో ప్రజాప్రతినిధులకు సంబంధించి ఒక లేఖ - మిగతా 3లో

# అమరావతికి రీ లాంఛ్

- ఆంధ్రుల కలల రాజధానికి కొత్త రెక్కలు వచ్చేశాయ్
- ఇప్పుడు ఎలాంటి ఆటంకాలు లేవ్. అడ్డంకులు అసలే లేవు
- రోడ్ మ్యాప్ క్లియర్ గా ఉంది. టార్గెట్ కనిపిస్తూనే ఉంది
- అందాల్సిన నిధులు వస్తూనే ఉన్నాయి. చేయాల్సిన పనులు ఖరారయ్యాయ్



**విజయవాడ**

ఏపీ కలల రాజధాని అమరావతి స్వయం సమృద్ధి ప్రాజెక్టుగా ఘనంగా రీలాంఛ్ కాబోతోంది. ఒక్కసారి పనులు మొదలు పెట్టి మూడేళ్లలో పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం పట్టుదలగా ఉంది.ప్రధాని చేతుల మీదుగా రీలాంఛ్ కు రెడీ అవుతోంది. అవును ఆంధ్రుల కలల రాజధానికి కొత్త రెక్కలు వచ్చేశాయ్. ఇప్పుడు ఎలాంటి ఆటంకాలు లేవ్. అడ్డంకులు అసలే లేవు. గ్రహణాలన్నీ వీడిపోయాయ్. రోడ్ మ్యాప్ క్లియర్ గా ఉంది. టార్గెట్ కనిపిస్తూనే ఉంది. అందాల్సిన నిధులు వస్తూనే ఉన్నాయి. చేయాల్సిన పనులు ఖరారయ్యాయ్. కలల్ని సాకారం చేస్తూ అద్భుతమైన, అందమైన రాజధాని అమరావతి సాక్షాత్కారం చేసుకునేందుకు రీస్టార్ట్ అవుతోందిఅమరావతికి ఇప్పుడు అన్నీ మంచి శకునాలే కనిపిస్తున్నాయి. 2028 నాటికి రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. అన్ని పనులను మరికొద్ది రోజుల్లోనే ఒకేసారి మొదలు పెట్టి రాజధాని నిర్మాణ - మిగతా 3లో



## కులం గురించి మాట్లాడితే సహించేది లేదు

- ఎవరైనా కుల వివక్ష గురించి మాట్లాడితే సహించేదిలేదన్న నితిన్ గడ్కరీ
- కుల మతాలు, భాష తదితరాల ఆధారంగా సమాజంలో ఎవరిపైనా వివక్ష చూపరాదని సూచన
- కులం, మతం, భాష ఆధారంగా ఎవరూ గొప్పవారు కాలేరన్న గడ్కరీ

# బాపట్ల జిల్లా పర్యటనకు వైఎస్ జగన్



**తాడేపల్లి**

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తల్లి పిచ్చమ్మ పార్థీవదేహానికి నివాళులు అర్పించనున్నారు. వైవీ సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు.

**వైఎస్ జగన్ దిగ్భ్రాంతి**

గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తల్లి యర్రం పిచ్చమ్మ(85)సోమవారం కన్నుమూశారు. పిచ్చమ్మ మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పిచ్చమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. మాతృమూర్తి మృతి వార్త తెలియడంతో వైవీ సుబ్బారెడ్డి హుటాహుటిన ఢిల్లీ నుంచి ఒంగోలుకు బయలుదేరారు. పార్లమెంట్ సమావేశాల కోసం సుబ్బారెడ్డి నిన్ననే ఢిల్లీకి వెళ్లారు. నేడు ఒంగోలులోనే సుబ్బారెడ్డి మాతృమూర్తి పిచ్చమ్మ పార్థివదేహం ఉండనుంది. రేపు ఉదయం 10:30 గంటలకు మేదరమెట్లలో ఆమె అంత్యక్రియల జరగనున్నాయి. రేపు బాపట్ల జిల్లా పర్యటనలో భాగంగా మేదరమెట్లలో పిచ్చమ్మ పార్థివదేహానికి వైఎస్ జగన్ నివాళులు అర్పిస్తారు.

## వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది?

- హైస్పీడ్ రైలు సగటు వేగం ఎందుకు తక్కువగా ఉంది
- ప్రభుత్వ ప్రణాళిక.. రైలు వేగంతో నడిపేందుకు ఏం చర్యలు తీసుకున్నారు



- రైలు వేగం ఇంజిన్‌పై మాత్రమే ఆధారపడి ఉండదు
- రైలు నడిచే ట్రాక్‌పై సైతం ఆధారపడి ఉంటుంది
- రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్

# బంగారం ధర పెరుగుతుందా... తగ్గుతుందా...



**ముంబై :** బంగారం ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రానున్న రెండు, మూడు నెలల్లో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నా యి. ఈ క్రమంలో బంగారం ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. ఇంత ధర ఉంటే పెళ్లిళ్ల సమయంలో ఎలా కొనాలంటూ తలలు పట్టుకుంటున్నారు. భారతీయ సంప్రదాయంలో బంగారు ఆభరణాలకు ఉన్న ప్రాముఖ్యత గురించి తెలిసిందే. ముఖ్యంగా పెళ్లిళ్లలో వధూవరులకు బంగారు ఆభరణాలను కచ్చితంగా అలంకరిస్తారు. పెళ్లి కూతురికి అయితే ఎక్కువ మొత్తంగా బంగారు ఆభరణాలు అవసరం. కానీ, ప్రస్తుతం ఉన్న ధరలు చూస్తుంటే.. పెళ్లి పెట్టుకున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మన దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.90,000కు మించిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం 3,000 డాలర్లను తాకింది. ఇంత భారీగా పెరిగినా.. త్వరలోనే ధరలు తగ్గుతాయనే ఆశ ఉండేది. కానీ, ప్రస్తుతం ఏమీ చెప్పలేని పరిస్థితి నెలకొంది. ధర ఇప్పట్లో తగ్గదేమో అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పైగా పెళ్లిళ్ల సీజన్ వచ్చేసింది. రోజురోజుకూ ధర పెరగడం చూసి పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న వధూవరుల తల్లితండ్రులు ఆందోళన చెందుతున్నారు. ధర పెరిగి కొనేవాళ్లు కరవయ్యారని, ఆభరణాల వర్తకులు ఆందోళన చెందుతున్నారు. రెండు నెలల క్రితం వరకూ ధర ఇంకా పెరగకపోవచ్చని నిపుణులు అంచనా వేశారు. కానీ డొనాల్డ్ ట్రంప్, అమెరిక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత టారిఫ్‌లు పెంచడంతో అభివృద్ధి చెందుతున్న దేశాల కరెన్సీలు బలహీనపడ్డాయి.కొన్ని దేశాల్లో ద్రవ్యోల్బణం పెరిగింది. దీంతో ఎంతో భద్రమైన ఆస్తిగా భావించే బంగారానికి డిమాండ్ పెరగడంతో ధర పెరిగింది. 2008లో ప్రపంచ ఆర్థిక సంక్షోభం సందర్భంగా ఔన్సు బంగారం ధర 1,000 డాలర్లకు చేరింది. నాలుగేళ్ల క్రితం కొవిడ్ ముప్పు ముంచుకొచ్చినప్పుడు 2,000 డాలర్లు పలికింది. మళ్లీ ఇప్పుడు 3,000 డాలర్లకు చేరుకుంది. ఆర్థిక సంక్షోభం ముంచుకొచ్చినప్పుడు బంగారం ధర రికార్డు స్థాయికి చేరుతున్నట్లు స్పష్టమవుతోంది. దీనికి తోడు గత కొంతకాలంగా వివిధ దేశాల్లోని కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కొని నిల్వ చేస్తున్నాయి. 2022 నుంచి ఏటా 1,000 టన్నులకు పైగా బంగారాన్ని కేంద్ర బ్యాంకులే కొనుగోలు చేశాయి. ఇందులో భారత రిజర్వు బ్యాంకు ముందుంటోంది. చైనాలో రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతిని అక్కడి మదుపర్లు ఇటీవల పసిడిని ఎక్కువగా కొంటున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర 3,000 డాలర్ల దగ్గర ఎన్నాళ్లు ఉంటుంది, ఇంకా పెరుగుతుందా, లేక తగ్గుతుందా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్నగా మారింది.వర్తకులు, పెట్టుబడి నిపుణులు ఎవరూ దీనికి సమాధానం చెప్పలేకపోతున్నారు. అమెరికా టారిఫ్‌లు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇతర ప్రతికూల పరిస్థితులు కొనసాగినంత కాలం ధర తగ్గదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధర భారీగా పెరగడంతో ఆభరణాల వ్యాపారం తగ్గింది. బంగారు ఆభరణాల అమ్మకాలు 70 శాతం తగ్గినట్లు సమాచారం. పాత బంగారం ఇచ్చి కొత్త ఆభరణాలు తీసుకోవడం పెరిగిందని, ఎంతో తప్పనిసరి అయితే తప్పించి కొత్త ఆభరణాలు కొనుగోలు చేయడం తెలుస్తోంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల కారణంగా బంగారం ధర తగ్గే సూచనలైతే కనిపించడం లేదని నిపుణులు అంటున్నారు.

# పందెం గెలిచిన బాలు.. ఇక కృష్ణయ్య బాధ్యత తనదే



మడుగులో నీటికోసం దిగిన తనను మొసలి అమాంతం పట్టుకుని లోపలి ఈడ్చుకెళ్ళిపోతూ తనను హరించేస్తున్న తరుణంలో కన్నీటి పర్యంతమవుతూనే సర్వ శక్తులు ఒడ్డుతూ పోరాడుతోంది. మరోవైపు మొసలికి స్థానబలం ఎక్కువగా ఉండే మడుగులో దాన్ని ఓడించడం గజేంద్రుడికి సాధ్యం కావడం లేదు... దీంతో మొసలితో పోరాడలేక.. దాన్ని ఓడించలేక.. తనను తానూ కాపాడుకోలేక ఆ గజరాజు, మకరాన్ని గెలవడం తనవల్ల కాదు అని అర్థం చేసుకుని తనను రక్షించేది ఈ భూలోకంలో శ్రీహరి ఒక్కడేనని అర్థం చేసుకుని విష్ణుమూర్తిని ప్రార్థించింది. ఈ విధంగా మ్రెక్కింది.

కలఁ డందురు దీనులయెడఁ,
గలఁ డందురు పరమయోగి గణములపాలం
గలఁ డందు రన్ని దిశలను,
గలఁడు గలం డనెడువాఁడు గలఁడో లేఁడో

అని ప్రార్థించగా ఆ క్షణాన శ్రీదేవితో పాలసముద్రంలో శేషతల్పం మీద పయనిస్తున్న శ్రీహరి ఒక్క క్షణం ఆలస్యం చేయకుండా ఉన్న ఫలాన భూలోకానివచ్చి సుదర్శన చక్రంతో మొసలి కంఠాన్ని ఖండించి గజేంద్రుడిని కాపాడాడు. అప్పట్నుంచి గజేంద్రుడు శ్రీ హరి సేవలో ఉంటూ పునీతుడైనాడు. ఇక దక్షిణభారత దేశంలోనే ప్రముఖమైన గురువాయూర్ కృష్ణ మందిరంలో సోమవారం మొదలైన ప్రత్యేక ఉత్సవాలకు రంగం సిద్ధం చేసారు. గురువాయూర్ అంటేనే ఏనుగులకు ప్రసిద్ధి.. సువిశాలమైన కృష్ణ మందిరంలో అంతెత్తున గజరాజులు ఆలయ ప్రాంగణంలో తిరుగుతూ ఉంటాయి. అయితే ఈ ఉత్సవాల సందర్భంగా కృష్ణయ్యను మోసే బాధ్యత కూడా ఆ గజరాజులదే.. కృష్ణయ్య సదరు గజరాజుపై అధిరోహించి ఊరేగింపుగా వెళ్తారు. అయితే ఆలయంలో అన్నీ ఉత్తమోత్తమ జాతికి చెందిన గజరాజులే .. అందులో ఎవరికీ ఈ మహాద్భాగ్యం దక్కుతుంది.. అందుకే ఏటా మాదిరిగానే ఆలయంలో ఒక పోటీ పెట్టారు. దేవి, దేవదాస్, చెంతమరాక్షన్, నందన్.. బాలు అనే కరిరాజుల మధ్య పరుగుపందెం నిర్వహించారు. మొత్తం 12 ఏనుగులను ఈ పోటీకి పరిశీలించగా అందులో బాలుతో బాటు ఐదు ఏనుగులను మాత్రమే ఫైనల్ పోటీకి నిలిపారు. ముందుగా వాటిని స్వచ్ఛమైన నీటిలో స్నానం చేయించి వాటి కంఠాన గణగణమని మోగే గంటలను అలంకరించి ముందుగా దేనికి సంబంధించిన మావటి దాను ముందుగా ఉరుకుతుంటే వారివెనుకనే కరిరాజులు పరుగెత్తాయి. ఈ పందెం చూసేవాళ్లకు కన్నులపంట కాగా వినేవాళ్లకు వీనులవిందు అవుతుంది. ఈ పందెంలో బాలు అనే గజరాజు విజయం సాధించాడు. విజయం తర్వాత, బాలు ఒలింపిక్ పతకం సాధించిన విజేత మాదిరి అందర్నీ విజయగర్వంతో పరికించి చూసి.. తొండం అభివాదం చేసాడు. తరువాత తూర్పు గోపురం గుండా ఆలయంలోకి ప్రవేశించి, గురువాయురప్పన్‌కు భక్తితో ఏడు ప్రదక్షిణాలు చేసాడు. ఆ తరువాత ఈ ఉత్సవాల్లో స్వామిని మోసే బాధ్యత ఈ బాలుకు మాత్రమే దక్కుతుందన్నమాట.. ఈ సందర్భంగా నిర్వహించే పోటీలకు ముందు గజరాజులు వెటర్నరీ డాక్టర్లు ఫిట్నెస్ పరీక్షలు చేస్తారు. అన్నీ బాగున్నాయి అనుకున్నప్పుడే కాసిన్ని ఏనుగులను రంగంలోకి దించి పూర్తి భద్రతనడుమ ఈ పరుగుపందెం నిర్వహిస్తారు. జనం అల్లరికి ఏనుగులు బెదిరిపోయి జనంలోకి వెళ్లే ఇంకేదైనా అవాంఛనీయ సంఘటన జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ ఈ పోటీలు నిర్వహిస్తారు..

# వందే భారత్ స్పీడ్ వేగం ఎందుకు తగ్గుతోంది?



భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకంగా వందే భారత్ రైళ్లను తీసుకువచ్చింది. అత్యాధునిక సౌకర్యాలతో పాటు హైస్పీడ్ రైళ్లను పెద్ద ఎత్తున తీసుకువస్తున్నది. అయితే, ప్రస్తుతం ఈ రైళ్ల వేగంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సెమీహైస్పీడ్ రైళ్లను గతంలో ప్రకటించిన వేగంతో నడపడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో వందే భారత్ రైళ్ల వేగంపై వస్తున్న ప్రశ్నలకు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమాధానం ఇచ్చారు. రైలు వేగం తగ్గడానికి గల కారణాలను వెల్లడించారు. పార్లమెంట్‌లో పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. హైస్పీడ్ రైలు సగటు వేగం ఎందుకు తక్కువగా ఉందని.. ప్రభుత్వ ప్రణాళిక.. రైలు వేగంతో నడిపేందుకు ఏం చర్యలు తీసుకున్నారు.. పూర్తిస్థాయి వేగంతో నడిపేందుకు ఎంత సమయం పడుతుందని పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. రైలు వేగం ఇంజిన్‌పై మాత్రమే ఆధారపడి ఉండదని రైల్వే మంత్రి పేర్కొన్నారు. రైలు నడిచే ట్రాక్‌పై సైతం ఆధారపడి ఉంటుందని.. రైల్వేలైన్లను మెరుగుపరిచే పని నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. 2014 సంవత్సరంలో రైళ్లు గంటకు 110 కిలోమీటర్లు.. అంతకంటే ఎక్కువ వేగంతో 31వేలకుపైగా కిలో మీటర్ల ట్రాక్‌లో మాత్రమే నడవగలమని చెప్పారు. ప్రస్తుతం 80వేల కిలోమీటర్లకు పెంచామన్నారు. ప్రస్తుతం అంత పరిధిలో మాత్రమే పూర్తిస్థాయి వేగంతో నడవగలవమన్నారు. చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో తయారైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ గరిష్ఠంగా 160 కిలోమీటర్ల వేగంతో నడిచే సామర్థ్యం ఉంది. కొంతకాలం కిందట ట్రయల్స్‌లో భాగంగా రైలును దాదాపు 180 కిలోమీటర్ల వేగంతోనూ దూసుకెళ్లింది. అయితే, ఇటీవల హైస్పీడ్ రైళ్ల వేగంగాపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 136 వందే భారత్ రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. భారత్‌లో అత్యధిక వేగంతో నడిచే రైళ్లలో వందే భారత్ ఒకటి. వందే భారత్ రైళ్లకు ప్రస్తుతం ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తున్నది. కొన్ని చోట్ల మినహా మిగతా అన్ని రైట్లలో ఆక్యుపెన్సీ భారీగానే ఉన్నది.

## ‘అంత మాట అంటారా?.. పిల్ల చేష్టలు వద్దు’



**ముంబై:** మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ను ఔరంగజేబుతో పోలుస్తూ ఇటీవల ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఆ రాష్ట్ర బీజేపీ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రధానంగా మహారాష్ట్ర ప్రెసిడెంట్ హర్షవర్ధన్ సప్కాల్.. ఫడ్నవీస్‌ను ఔరంగజేబుతో పోల్చారు. దీనిపై మహారాష్ట్ర శాసనమండలిలో బీజేపీ మండిపడింది. సప్కాల్ పై కఠినమైన చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ శాసనమండలిలో డిమాండ్ చేసింది. ఆదివారం ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ లో సప్కాల్ మాట్లాడుతూ.. ‘ ఔరంగజేబు ఒక క్రూరమైన పాలకుడిగా మనకు తెలుసు. ప్రస్తుత మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్ కు కూడా ఔరంగజేబు లక్షణాలే ఉన్నాయి. ఎప్పుడూ మతపరమైన అంశాలకు మాత్రమే ప్రాధాన్యం ఇస్తారు తప్ప.. రాష్ట్రానికి చేసేందేమీ లేదు. రాష్ట్రంలోని హత్యకు గురైన సర్పంచ్ సంతోష్ దేశ్ ముఖ్ తరహా అంశాలకే ఆయన ప్రాధాన్యం ఉంటుంది. మరి ఆయన్ను ఔరంగజేబు పాలనతో పోల్చడంతో తప్పేంటి’ అని ఆరోపించారు.

**పిల్ల చేష్టలు వద్దు.. : బీజేపీ స్ట్రాంగ్ రియాక్షన్**

పబ్లిక్ లో ఏది పడితే అది మాట్లాడాతానంటే ఇక్కడ కుదరంటూ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సప్కాల్ ను హెచ్చరించింది బీజేపీ. దీనిపై బీజేపీ నాయకుడు ప్రవీణ్ దరేకర్ మాట్లాడుతూ.. ‘ చీఫ్ మినిష్టర్ రాష్ట్రంలో అత్యద్భుతంగా పరిపాలన సాగిస్తున్నారు. అటువంటి నాయకుడ్ని ఔరంగజేబుతో పోలుస్తారా?, ఇది కచ్చితంగా ఖండించాల్సిన అంశమే. ఇది మహారాష్ట్రకే అవమానం. సప్కాల్ పై కేసు ఫైల్ చేయాల్సిందే. ఆయనపై కఠిన చర్యలు తీసుకుంటే వేరే వాళ్లు ఈ తరహా వ్యాఖ్యలు చేయరు. సప్కాల్ పై చర్యలు ఒక ఉదాహరణ కావాలి’ అని ప్రవీణ్ దరేకర్ డిమాండ్ చేశారు.

## నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోంది



కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై మరోసారి విరుచుకుపడ్డారు. ముడి చమురు ధరలు తగ్గుముఖం పట్టినప్పటికీ దాని ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రస్తుతం ముడి చమురు ధరలు 42 నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయని అన్నారు. ఈ మేరకు పలు మీడియా సంస్థలు వెల్లడించిన నివేదికలను ఆయన ఉటంకించారు. బీజేపీ ప్రభుత్వం ఇంకెన్నాళ్లు ప్రజల నుంచి వసూళ్లకు పాల్పడుతూ వారిని దోచుకుంటుందని మల్లికార్జున్ ఖర్గే ప్రశ్నించారు. ముడి చమురు ధరలు నిరంతరం తగ్గుతూనే ఉన్నాయని, పెట్రోల్, డీజిల్ ధరలు మాత్రం తగ్గట్లేదని విమర్శించారు. మే 2014 నుంచి సుమారు 34 శాతం వరకు ముడి చమురు ధరలు తగ్గాయని చెప్పారు. పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం రూ.36 లక్షల కోట్ల పన్ను వసూలు చేసిందని ఆరోపించారు. పెరుగుతున్న ద్రవ్యోల్బణం కారణంగా ప్రజలు కన్నీరు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇంకా ఈ దోపిడీ ఎంతకాలం కొనసాగుతుందని ఖర్గే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో అమల్లోకి తేనున్న లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన అంశంపై మాట్లాడుతూ.. కేంద్రం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని అన్నారు. దేశ వనరులు, పాలనలో అన్ని రాష్ట్రాలకు సమన్యాయం ఉండాలన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేయడంవల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని, ఉత్తరాదిలో ఆ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. దాంతో దేశంలో సమన్యాయం లేకుండా పోతుందని వ్యాఖ్యానించారు. అలాంటివి జరగకుండా సామాజిక సమానత్వం కోసం అందరు కలిసికట్టుగా పోరాడాలని మల్లికార్జున్ ఖర్గే పిలుపునిచ్చారు.

## కులం గురించి మాట్లాడితే సహించేది లేదు

కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత నితిన్ గడ్కరీ కుల వివక్షపై కీలక వ్యాఖ్యలు చేశారు. నాగపూర్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎవరైనా కుల వివక్ష గురించి మాట్లాడితే సహించేది లేదన్నారు. కుల మతాలు, భాష తదితరాల ఆధారంగా సమాజంలో ఎవరిపైనా వివక్ష చూపరాదని అన్నారు. ఎవరైనా కులం, మతం, భాష ఆధారంగా గొప్పవారు కాలేరని, వారికి ఉన్న గుణాలతోనే గొప్ప వారు అవుతారని నితిన్ గడ్కరీ అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తి కులమతాలు, భాష, లింగ వివక్షకు అతీతంగా ఎదిగినప్పుడే గొప్ప వారు కాగలరని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పిన మాటలు అందరికీ స్ఫూర్తిదాయకమని గడ్కరీ పేర్కొన్నారు.

## రాజ్‌నాథ్ సింగ్‌తో
## అమెరికా ఇంటెల్ చీఫ్ తులసీ గబ్బర్డ్ భేటీ



**న్యూఢిల్లీ:** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బర్డ్ సోమవారంనాడు సమావేశమయ్యిరు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారం బలోపేతంపై చర్చించారు. ఒక రక్షణ ఒప్పందపైన కూడా చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. తులసి గబ్బర్డ్‌తో సమావేశమైన విషయాన్ని సామాజిక మాధ్యం ‘ఎక్స్’లో రాజ్‌నాథ్ సింగ్ షేర్ చేశారు. రక్షణ, సమాచార షేరింగ్‌తో పాటు, ఇండియా-యూఎస్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమావేశంలో ఉభయులూ చర్చించినట్టు చెప్పారు. ట్రంప్ రెండో విడత కార్యవర్గంలోని సీనియర్ స్థాయి అధికారి భారత్ పర్యటించడం ఇది మొదటిసారి. రెండున్నర రోజుల పర్యటనలో భాగంగా ఆదివారంనాడు న్యూఢిల్లీకి వచ్చిన ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌లూ కూడా పాల్గొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబల్‌తోనూ ఆదివారం సాయంత్రం గబ్బర్డ్ సమావేశమయ్యారు. భారత్, అమెరికా మధ్య భద్రతారంగంలో బంధాన్ని బలోపేతం చోసుకోవడంతో ఉభయులూ చర్చించారు. ఇండో-పసిఫిక్, ఖలిస్థానీ ఉగ్రవాదం వంటి అంశాలు కూడా చర్చించినట్టు సమాచారం.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కేబినెట్ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

ప్రస్తుతానికి నివేదికను యధాతధంగా ఆమోదిద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పుపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వైఎస్ఆర్ కడపగా జిల్లా పేరు మార్చాలని నిర్ణయించింది. సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్ఆర్ జిల్లాకు కడప పేరు కలుపుతూ కెబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇకపై వైఎస్ఆర్ జిల్లాను వైఎస్ఆర్ కడప జిల్లాగా పరిగణించనున్నారు. గతంలో వైఎస్ఆర్ కడప జిల్లా పేరు ఉండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం జిల్లా పేరులోని కడప తొలగించింది. దీంతో నాటి నుంచి వైఎస్ఆర్ జిల్లాగా వ్యవహరిస్తున్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పని చేశారు. అయితే రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2009,సెప్టెంబర్ 2వ తేదీన హెలికాప్టరు దుర్ఘటనలో ఆయన మరణించారు. ఈ నేపథ్యంలో నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం.. వైఎస్ రాజశేఖరరెడ్డి సొంత జిల్లా అయిన కడప జిల్లా పేరును వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధినేత, వైఎస్ఆర్ తనయుడు వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చారు.


దీంతో ప్రభుత్వం చేపట్టిన పథకాలకే కాదు.. పలు సంస్థలకు సైతం వైఎస్ఆర్ పేరు పెట్టారు. ఆ క్రమంలో వైఎస్ఆర్ కడప జిల్లా పేరును మార్చారు. అందులోని కడపను తీసి వేశారు. దీంతో వైఎస్ఆర్ జిల్లాగా మారింది. అయితే కూటమి ప్రభుత్వం సోమవారం జరిగిన కేబినెట్‌లో వైఎస్ఆర్ కడప జిల్లాగా మారుస్తూ నిర్ణయం తీసుకుంది. బ్రిటిష్ కాలం నాటి నుంచి కడప జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. ఎన్నో శతాబ్దాల పాటు కడప జిల్లా పేరు మనుగడలో ఉంది. అలాంటి పేరును తొలగించి.. కేవలం వైఎస్ఆర్ పేరు మాత్రమే ఉండడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి. అలాంటి వేళ.. చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల వరకు, మర మగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు ఆమోదం లభించింది. నంబూరులో వీవీఐటీయూ విద్యాసంస్థకు ప్రైవేట్ వర్సిటీ హోదా కల్పిస్తూ ఆమోదం తెలిపింది. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. పలు సంస్థలకు భూకేటాయింపులకు కూడా నేటి కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది.

అటు, ఎస్సీ వర్గీకరణపై రాజీవ్ రంజన్ మిశ్రా సమర్పించిన నివేదికకు కూడా కేబినెట్ ఆమోదించింది. రాష్ట్రాన్ని యూనిట్ గా వర్గీకరణ చేయాలని నివేదిక కమిషన్ ఇవ్వగా, జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేయాలన్న ఎమ్మెల్యేల ప్రతిపాదనపైనా కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాన్ని యూనిట్ గా తీసుకోవాలని నిర్ణయించారు. 2026 జనాభా లెక్కలు వచ్చాక జిల్లాను యూనిట్ గా తీసుకుని వర్గీకరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీలో తీర్మానం చేసి జాతీయ ఎస్సీ కమిషన్ కు పంపాలని నిర్ణయించారు. బుడగజంగాలు, మరో కులాన్ని ఎస్టీల్లో చేర్చేందుకు తీర్మానం చేయాలని నిర్ణయించారు. వైఎస్సార్ జిల్లాను వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చుతూ నేటి కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. పెనమలూరులోని తాడిగడప మున్సిపాలిటీకి వైఎస్సార్ పేరు తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు.

# అమరావతికి రీ లాంచ్

-మొదటిపేజీ తరువాయి




పనుల్ని రీలాంఛ్ చేయబోతోంది. ప్రధాని మోడీ చేతుల మీదుగా పనుల్ని అట్టహాసంగా మొదలు పెట్టబోతోంది చంద్రబాబు ప్రభుత్వం. ఆంధ్రుల ఆశల్ని సజీవంగా ఉంచుతూ సరికొత్త రాజధానిని ఆవిష్కరించేందుకు పెద్ద ముందడుగు పడబోతోంది. ఇక ఒక్కసారి పని మొదలైందంటే ఆగేదే లేదు. ఎక్కడా తగ్గేదే లేదు. 2028 దాకా నాన్ స్టాప్, అన్ స్టాపబుల్ అంతే.నిజానికి అమరావతి కాల పరీక్షకు తట్టుకుని నిలబడింది. గతంలో చేపట్టిన నిర్మాణాలు స్ట్రాంగ్ గానే ఉన్నాయని టెక్నికల్ కమిటీలు తేల్చాయి. అందుకే వాటి పనుల్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ముందుంది. అటు చంద్రబాబు సర్కార్ కూడా ఈసారి గట్టి సంకల్పమే తీసుకుంది. అటు చూస్తే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా పూర్తిగా ఉండడంతో కచ్చితంగా రాజధానిని నిర్మించి నిలబెట్టి జనం ముందు ఉంచేలా మాస్టర్ ప్లాన్ రెడీ చేసింది. అమరావతి అంటే తిరుగులేనిది. ఈ పేరుకు ఓ బ్రాండ్ ఉంది. స్టామినా ఉంది. అంతకు మించి హిస్టరీ ఉంది. ఎవరు వచ్చినా.. ఇంకెవరు పాలించినా.. రాజధానిగా అమరావతి చెరిగిపోని ముద్ర వేయబోతోంది. చరిత్ర సృష్టించబోతోంది. ఎన్ని కాలాలైనా సగర్వంగా చెప్పుకునేలా ఉండబోతోంది.రాజధాని ఈ ప్రాంతంలోనే ఏర్పాటవుతుందని చెప్పడమే తరువాయి. 58 రోజుల్లోనే 34 వేల ఎకరాలు ఇచ్చిన రైతుల త్యాగం వృధాగా పోలేదు. వారి పోరాటాలు వృధా అవలేదు. రాజధాని నిర్మాణం కోసం 64 వేల కోట్లు అవసరమవుతున్నాయ్. ఈ నిధులతో ఒక అడగు ముందుకు పడితే మిగితా పనులన్నీ వెంట వెంటనే జరగడం ఖాయమే. ఇది సస్టైనబుల్ ప్రాజెక్ట్. రాజధాని అన్నది అవకాశాలను సృష్టిస్తుంది. ఉపాధిని పెంచుతుంది. సౌకర్యాలు తీసుకొస్తుంది. సంపదను సృష్టిస్తుంది. అంటే పెట్టిన ఖర్చు తీరడమే కాదు.. అంతకు మించి ఎవరూ ఊహించని ప్రయోజనాలను రాజధాని అందించబోతోంది.పీపుల్స్ క్యాపిటల్ అని రాజధాని అమరావతికి క్యాప్షన్ ఇచ్చారు. అంటే అందరినీ అక్కున చేర్చుకునేలా ఉపాధి అవకాశాలు పెంచేలా, ప్రపంచంలోనే టాప్-5 నగరాల్లో ఒకటిగా ఉండేలా డిజైన్ చేశారు. మోస్ట్ అడ్వాన్స్ డ్ టెక్నాలజీతో పాటు మెరుగైన మౌలిక వసతులు రాబోతున్నాయి. నెక్ట్ జెనరేషన్ క్యాపిటల్ సిటీ ఎలా ఉంటుందో అమరావతి పూర్తయ్యాక చూస్తే తెలుస్తుంది. నిజానికి రాజధాని నిర్మాణం ఎవరికీ రాని, చాలా అరుదైన అవకాశం. దీన్ని సీఎం చంద్రబాబు సంపూర్ణంగా పూర్తి చేసేలా బాధ్యత భుజానికెత్తుకున్నారు. కలల రాజధానిని సాకారం చేసి చూపిస్తామన్నారు.అమరావతిలో 40 వేల కోట్ల రూపాయల విలువైన నిర్మాణ పనులకు సీఆర్‌డీఏ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సీఆర్డీయే సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. రాజధానిలో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టు ఏజెన్సీలకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు. లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ పూర్తికాగానే రాజధానిలో పనులు ప్రారంభం అయ్యే ఛాన్స్ ఉంది. 73 పనులకు సీఆర్‌డీఏ నుంచి అనుమతి వచ్చింది. 63 పనులకు టెండర్లు పూర్తి చేశారు. వాటి విలువ 39,678 కోట్లుగా ఉంది. అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ లో ఇళ్లు, భవన నిర్మాణాలు, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి కోసం మొత్తంగా 64 వేల 721 కోట్లు అవసరం కానున్నాయి. వివిధ రకాల ఆదాయ మార్గాల ద్వారా అమరావతి పనులు చేసేలా ప్రభుత్వం ప్రణాళికలు రెడీ చేసి పెట్టుకుంది.అమరావతికి వరల్డ్ బ్యాంకు, ఏడీబీ బ్యాంకు కలిపి 13 వేల 400 కోట్ల రూపాయల రుణం ఇస్తుండగా, ఐఈచి బ్యాంక్ 5 వేల కోట్ల రూపాయల రుణం ఇస్తోంది. అటు హడ్కో 11 వేల కోట్లు అప్పుగా ఇవ్వబోతోంది. అయితే ఈ అప్పులను ఎఫ్ఆర్బీఎం పరిధిలోకి తీసుకురాబోమని కేంద్రం తాజాగా పార్లమెంట్ సాక్షిగా ప్రకటించింది. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితిలో లెక్కించకూడదని నిర్ణయించినట్లు పార్లమెంట్‌కు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి చెప్పారు.2014-19లో 131 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రతిష్టాత్మక సంస్థలకు 1,277 ఎకరాలు ఇచ్చారు. అయితే గత ఐదేళ్లు రాజధాని నిర్మాణం జరగకపోవడంతో ఆ సంస్థల్లో కొన్ని వెనక్కు వెళ్లాయి. భవనాలు నిర్మించుకునేందుకు ఇంట్రెస్ట్ చూపలేకపోయాయి. ఇందులో ఆర్బీఐ, బిట్స్ పిలానీ సహా కీలక సంస్థలెన్నో ఉన్నాయి. ఇప్పుడు మళ్లీ కదలిక వస్తోంది. తాజాగా 31 సంస్థలకు 629 ఎకరాలు భూమి ఇచ్చారు. గత ప్రభుత్వం ఆర్-5 జోన్‌లో 50 వేల మందికి ఒక సెంటు భూమి అమరావతిలో ఇచ్చింది. అయితే వారికి వేరేచోట భూమి కేటాయిస్తామని కూటమి ప్రభుత్వం అంటోంది.కూటమి ప్రభుత్వం వచ్చాక 8 నెలల్లో సమస్యలు పరిష్కరించి టెండర్లు ఆహ్వానించిన పరిస్థితి ఉంది. దీన్ని ప్రయారిటీగా తీసుకోవడంతోనే ఇదంతా జరుగుతోంది. ఈనెల 17న జరిగే కేబినెట్‌లో వీటన్నింటికీ ఆమోదం పొంది వెంటనే పనులు ప్రారంభించబోతున్నారు. ఏప్రిల్ నెల నుంచి అమరావతి అభివృద్ధి పనుల్లో 20 వేల మంది పాల్గొనబోతున్నారు. ఎన్టీఆర్ విగ్రహం, ఐకానిక్ బిడ్జ్ సహా ఇంకెన్నో రాబోతున్నాయి. ఈ పనులన్నిటికీ ప్రధాని మోడీ రీలాంఛ్ చేయడం ద్వారా నాన్ స్టాప్ గా జరగబోతున్నాయి. అటు రాజధాని ప్రాంతంలో అభివృద్ధి చేసిన ప్లాట్లను మూడేళ్లలో రైతులకు అప్పగిస్తారు.

# వర్మ త్యాగంపై సోషల్ మీడియాలో ఫైట్



**కాకినాడ :** జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు పిఠాపురంలో జరిగిన సమావేశం తర్వాత రాష్ట్రంలో కూటమిలోని ప్రధాన పార్టీలైన టీడీపీ, జనసేన క్యాడర్ మధ్య గ్యాప్ పెరిగింది. పిఠాపురం వేదికగా చేసిన వ్యాఖ్యలు రెండుపార్టీల క్యాడర్ సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకునే పరిస్థితి ఏర్పడింది. పార్టీ అగ్రనేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య కెమెస్ట్రీ బాగానే ఉన్నప్పటికీ క్యాడర్ మాత్రం పూర్తిగా ఈ సభ తర్వాత విడిపోయినట్లే కనిపిస్తుందని సోషల్ మీడియాలో పోస్టింగ్ లు చూస్తుంటే అర్థమవుతుంది. ఇద్దరు ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఎవరి వల్ల గెలుపు అనే అంశంపై తమకు తోచినట్లు పెడుతున్న కామెంట్స్ కాక రేపుతున్నాయ్. జయకేతనం సభలో పవన్ కల్యాణ్ తో పాటు నాగబాబు చేసిన వ్యాఖ్యలు ఉష్ణోగ్రతల కంటే గరిష్టంగా హీట్ ను రెండు పార్టీలలో పుట్టించిందనే చెప్పాలి. నాలుగు దశాబ్దాల చరిత్ర ఉన్న తెలుగుదేశాన్ని తానే నిలబెట్టానని పవన్ కళ్యాణ్ అన్న కామెంట్లు, వర్మను ఉద్దేశించి నాగబాబు పరోక్షంగానే చేసిన కామెంట్ల పైనే ఇప్పుడు సోషల్ మీడియాలో తమ్ముళ్లు బాధపడిపోతున్నారు. తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నలభై ఏళ్ల చరిత్ర ఉన్న పార్టీని ఒకరు నిలబెట్టేదేంటని ప్రశ్నిస్తున్నారు. తమకు 175 నియోజకవర్గాల్లో ఓటు బ్యాంకు, క్యాడర్ బలంగా ఉందని, జనసేన ఎన్ని నియోజకవర్గాల్లో బలంగా ఉందో చెప్పాలంటూ నిలదీస్తున్నారు. ఈ విషయాలు తెలియకుండా మాట్లాడితే ఊరుకోబోమంటూ ఒకరకంగా వార్నింగ్ లు ఇచ్చినట్లే వారి కామెంట్స్ కనపడుతున్నాయి జనసేన క్యాడర్ కూడా ధీటుగానే సమాధానం ఇస్తుంది. నిజానికి జైల్లో ఉన్న చంద్రబాబును పవన్ కల్యాణ్ పరామర్శించడం దగ్గర నుంచి కూటమి ఏర్పాటు వరకూ ఆయన చేసిన కృషిని మరిచిపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో ఉన్న టీడీపీని పవన్ కల్యాణ్ ఆదుకున్న విషయాన్ని ఎవరైనా ఒప్పుకుని తీరాల్సిందేనని, ఆయన చేసిన వ్యాఖ్యల్లో తప్పేముందని నిలదీస్తున్నారు. తాము కష్టపడి పనిచేయడం, తక్కువ సీట్లకే పోటీ చేయడం, ఉభయ గోదావరి జిల్లాల్లో తమకు పట్టున్నా ఓటు చీలకుండా కూటమి గెలుపునకు కారణం ఎవరనివారు సోషల్ మీడియా వేదికగా అంటున్నారు. దీంతో .. కూటమి మధ్య అగాధం ఏర్పడుతుందనే ఆందోళన ఇరు పార్టీల నేతల్లో కనిపిస్తుంది. నాగబాబు విషయాన్ని పెద్దగా సీరియస్ గా తీసుకోకపోయినా.. వర్మ చేసిన త్యాగాన్ని ఆయన కించపర్చడం ఏంటని టీడీపీ క్యాడర్ గుర్రుగా ఉంది. గతంలో వర్మ స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన విషయాన్ని గుర్తు చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసినప్పుడు ఎవరికి ఎన్ని ఓట్ల శాతం వచ్చాయో తెలుసుకుంటే బాగుంటుందని కూడా సూచిస్తున్నారు. కూటమి అంటే కలసి పోటీ చేయడం, కలసి పనిచేయడమేనని, అంతే తప్ప ఏ ఒక్కరి వల్లో విజయం సాధ్యం కాదని, రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని భావించి జనం ఓట్లేశారని తెలుగు తమ్ముళ్లు అంటున్నారు. ఇదే సమయంలో జనసేన ను కించపరిస్తే నష్టపోయేదే మీరేనంటూ జనసైనికులు కూడా హెచ్చరిస్తున్నారు. మొత్తం మీద జయకేతనం సభ మాత్రం రెండు పార్టీల క్యాడర్ లో గ్యాప్ మాత్రం బాగానే కనిపిస్తుంది. ఇద్దరూ సంయమనం పాటిస్తేనే మంచిదని, లేకుంటే ఇరువురికి నష్టమన్న అభిప్రాయం కూడా వ్యక్తమవుతుంది.

## ప్రతి కుటుంబానికి ఇళ్లు



-మొదటిపేజీ తరువాయి

వార్డు సచివాలయం యూనిట్‌గా తీసుకుని అమలయ్యేలా చూస్తామన్నారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ రూపొందించి కలెక్టర్ల సదుస్సులో విడుదల చేస్తామని ప్రకటించారు. ప్రతి చివరి వ్యక్తిని కూడా విజన్‌లో భాగస్వామిని చేస్తామని చెప్పారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే ప్రస్తుతం నెలకొన్న సమస్యలు ప్రజలు అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వంలాగా పరిశ్రమలు తరిమేయడం కాకుండా... తీసుకురావడం నేర్చుకోవాలని ఎమ్మెల్యేలకు ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పరిశ్రమలు తేవడంలో మీరు కూడా భాగములు అవ్వాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండాలి...అలానే ఉపాధి కలగాలంటే పరిశ్రమలు రావాలి... సేవల రంగం వద్ధితో ఆదాయం పెరుగుతుందని చెప్పారు. ఒకప్పుడు అనంతపురం కరవు జిల్లా. ఉమ్మడి రాష్ట్రంలో సీఎంగా ఉన్నప్పుడు అనంతపురం, మహబూబ్ నగర్ జిల్లాలు సవాల్‌గా ఉండేవి. కష్ణానది పక్కనున్న మహబూబ్ నగర్‌కు నీళ్లుండేవి కాదు. ఆ రెండు జిల్లాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టేవాన్ని. విజయవాడ, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాలకు నీళ్లున్నా అభివద్ధిలేదు. కానీ ఇప్పుడు అనంతపురం జిల్లా 26 జిల్లాల్లో 5వ స్థానంలో ఉంది. మొదటి స్థానానికి వచ్చినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. వికసిత్ భారత్‌లో భాగంగా స్వర్ణాంధ్ర%-%2047 విజన్ డాక్యుమెంట్ రూపొందించుకున్నాం. దీనికి అనుగుణంగా ప్రతి ఏటా 15 శాతం వద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం. 2047 నాటికి రాష్ట్రాన్ని రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా ప్రభుత్వ ఆశయం. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తాం. ఇంగ్లీష్ మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ భాష కేవలం కమ్యునికేషన్‌కు మాత్రమే. మాతభాషలో చదువుకున్న వారే ప్రపంచ వ్యాప్తంగా రాణించారు. భాష అనేది ద్వేషించడంలో అర్థం లేదు. మాతభాష తెలుగు, హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళ్తున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు పెరుగుతాయి.

**స్వర్ణాంధ్రకు పది సూత్రాలు..**

స్వర్ణాంధ్ర విజన్ 2047 సాకారానికి 10 సూత్రాలు... స్వర్ణాంధ్రకు మార్గదర్శకాలు. పేదరికం లేని సమాజం, ఉద్యోగ, ఉపాధి కల్పన, నైపుణ్యం%-%మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, ఫార్మర్ అగ్రిటెక్, ప్రపంచ స్థాయి మౌలిక వసతులు, ఇంధన వనరుల సమర్థ వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం

-మొదటిపేజీ తరువాయి

మాత్రమే (ఆరుగురు భక్తులకు మించకుండా) స్వీకరించనున్నారు. ఈ విధానం మార్చి 24 నుంచి అమలు చేయనున్నట్లు తితిదే వెల్లడించింది.

# జగన్ తీరుపై నాయకులు అసంతృప్తి

**నెల్లూరు :** జగన్‌ను ఒకప్పుడు వైసీపీ నేతలు ఎంతో అభిమానించేవారు. జగన్ మాటకు కనీసం ఎదురు చెప్పేవారు కారు. కానీ ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. అధినేత తీరుపై నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ లబ్ధి చేకూరే విషయాల్లోనూ జగన్ నిర్లక్ష్యంగా ఉంటున్నారని.. ఇలాగైతే కష్టమే అని అంటున్నారువైసీపీ చీఫ్ జగన్ రాజకీయ వ్యూహాలు పక్కాగా ఉంటాయని.. ప్రత్యర్థులు పసిగట్టలేరని 2024 ఎన్నికలకు ముందు ఆ పార్టీ నేతలు ధీమాగా ఉండేవారు. కానీ.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. ఆ నమ్మకం పోయింది. దీంతో చాలామంది నేతలు తమదారి చూసుకున్నారు. ఇతర పార్టీల్లోకి వలస వెళ్లారు. అయినా జగన్ తీరులో మార్పు లేదని.. సొంత పార్టీ నేతలే చెబుతున్నారుఎల్లప్పుడూ జగన్ వెన్నంటే ఉండే నాయకులు వెళ్లిపోయినా.. జగన్ పెద్దగా పట్టించుకోలేదు. కనీసం వద్దని చెప్పినట్టు కూడా వార్తలు రాలేదు. పైగా వారిపై సోషల్ మీడియాలో దాడి పెరిగింది. దీనిపైనా వైసీపీలో చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో ఓడిపోవడం, లీడర్లు వెళ్లిపోవడం సంగతి ఎలా ఉన్నా.. రాజకీయంగా లబ్ధి చేకూరే విషయాల్లోనూ జగన్ తీరు మారడం లేదని ఆ పార్టీ సీనియర్ నేత ఒకరు చెప్పారు.ఇటీవల అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. ప్రతిపక్ష నేత హోదా కోసం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అసెంబ్లీకి వెళ్లకుండా మీడియా ద్వారా ప్రశ్నిస్తానని జగన్ స్పష్టం చేశారు. అయితే.. ఇది సరికాదని కొందరు నేతలు జగన్‌కు చెప్పే ప్రయత్నం చేసినట్టు తెలిసింది. ప్రజల తీర్పును గౌరవించి.. అసెంబ్లీకి వెళ్లి ప్రభుత్వాన్ని నిలదీయాలని, గత ప్రభుత్వంపై జరిగే దాడిని ఎదుర్కొవాలని నేతలు చెప్పినట్టు సమాచారం. అయినా జగన్ పెద్దగా పట్టించుకోలేదని తెలిసింది.గతంలో చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల దాడి తీవ్రంగా ఉండేది. అయినా చంద్రబాబు సభకు వచ్చి తన బాధ్యతను నిర్వర్తించారు. హద్దులు దాటి ప్రవర్తించిన కారణంగా శపథం చేసి బయటకొచ్చారు. మళ్లీ సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెట్టారు. చంద్రబాబును ఆ స్థాయిలో కించపరిచారు కాబట్టే.. ప్రజల్లో ఆయనపై సానుభూతి పెరిగింది. కానీ.. జగన్ ఆ అవకాశాన్ని వదులుకున్నారు' అని కృష్ణా జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత 'హిందుస్తాన్ టైమ్స్ తెలుగు'తో మాట్లాడుతూ చెప్పారు.ప్రస్తుతం జగన్ కేసీఆర్‌తో పోల్చుకుంటున్నారు. ఆయన కూడా అసెంబ్లీకి వెళ్లడం లేదు అని. కానీ.. తెలంగాణలో కేసీఆర్ పరిస్థితి వేరు. ఇక్కడ జగన్ పరిస్థితి వేరు. తెలంగాణలో కేసీఆర్‌పై ఈగ కూడా వాలకుండా.. హరీష్ రావు, కేటీఆర్ చూసుకుంటారు. ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఇక్కడ జగన్‌కు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం దాడిని ఒక్క జగన్ మాత్రమే ఎదుర్కొవాలి. కేసీఆర్ లాంటి సైన్యం జగన్‌కు లేదు' అని ఏలూరు జిల్లాకు చెందిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెప్పారు.'ప్రభుత్వం నుంచి ఎదురయ్యే అవమానాలు భరించినప్పుడే ప్రజల్లో సానుభూతి పెరుగుతుంది. జగన్ కేవలం సంక్షేమ పథకాలనే నమ్ముకున్నారు. అవతలి నుంచి వచ్చే దాడిని సరైన పద్ధతిలో ఎదుర్కోలేదు. అవాస్తవాలు ప్రచారం చేసినా.. జగన్ సరిగా తిప్పికొట్టలేదు. ఫలితంగానే ఎన్నికల్లో 11 సీట్లకు పరిమితం అయ్యాం. ప్రస్తుతం ప్రభుత్వంపై అంత వ్యతిరేకత లేదు. భవిష్యత్తులో చెప్పలేం. కానీ.. కొన్ని లోపాలు ఉన్నాయి. వాటిని వాడుకోవడంలో మా పార్టీ విఫలం అవుతోంది' అని ప్రకాశం జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత చెప్పారు'ఇప్పుడు ప్రభుత్వ వైఫల్యాలపై పోరాటాలు చేసే అవకాశాలు తక్కువ. కానీ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ జగన్‌కు మంచి ఆయుధం. బడ్జెట్‌పై మీడియాలో మాట్లాడటం కంటే.. అసెంబ్లీలో మాట్లాడటమే మంచిది. సభ లోపల అవకాశం లేకపోతే.. మీడియా పాయింట్ దగ్గర అయినా మాట్లాడొచ్చు. కానీ ఆయన ఆ పని చేయలేదు. సంక్రాంతి నుంచే ప్రజల్లోకి వస్తానన్నారు. ఇప్పటికీ రాలేదు. అటు మున్సిపాలిటీల్లో టీడీపీ ఆధిపత్యం పెరుగుతోంది. మా పార్టీ కేడర్‌లో నమ్మకం సన్నగిల్లుతోంది. కేవలం జగన్‌పై అభిమానం ఉన్నవారే పార్టీలో ఉన్నారు. ఇకనైనా వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత జగన్‌పై ఉంది' అని గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎంపీ చెప్పారు.


## సంపాదకీయం

# ఈ దారుణాలకు అంతం లేదా..

దేశంలో కశ్మీర్‌నుంచి కన్యాకుమారి వరకు ఎన్నో చారిత్రక పర్యాటక ప్రాంతాలున్నాయి. వీటిని సందర్శించడానికి విదేశాల నుంచి కొన్ని వేల మంది పర్యాటకులు వస్తుంటారు. భారత పర్యాటకరంగం ప్రస్తుతం 250 బిలియన్ డాలర్ల ఆదాయంతో వర్ధిల్లుతుండగా, మరో పదేళ్లకు 523 బిలియన్ డాలర్ల వరకు వృద్ధి చెందుతుందని అంచనా. 2023లో విదేశీ పర్యాటకులు 9.24 మిలియన్ల మంది వరకు అరుదెంచగా, 2028 నాటికి ఈ సంఖ్య 30.5 మిలియన్లకు చేరుతుందని అంచనా. 2034 నాటికి జిడిపికి రూ. 43,25, 000 వరకు ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు. ఈ అద్భుతమైన అంచనాలు సాకారం కావాలంటే స్వదేశీ, విదేశీ పర్యాటకులకు తగిన ఆతిథ్యం నుంచి భద్రత వరకు వివిధ సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వానిదే. ఎలాంటి భయాందోళనలకు, అఘాయిత్యాలకు గురికాకుండా పర్యాటకులు స్వేచ్ఛగా, నిర్భయంగా చారిత్రక, సుందర ప్రదేశాలను సందర్శించే ప్రశాంత వాతావరణం ఉన్నప్పుడే పర్యాటకులు తమ జీవితాంతం ఈ జ్ఞాపకాలను గుర్తు పెట్టుకోగలుగుతారు. కానీ గత రెండు మూడేళ్లుగా విదేశీ పర్యాటకులపై ముఖ్యంగా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతుండడం భారత పర్యాటక రంగాన్ని అప్రతిష్ఠపాలు చేస్తున్నాయి. దక్షిణాదిలోని హంపీ విజయనగర సామ్రాజ్య చారిత్రక ఆనవాళ్లు ప్రపంచ చరిత్రలో చెప్పుకోదగినవి. 14 వ శతాబ్దం నుంచి 16 వ శతాబ్దం వరకు విజయనగర వైభవం వర్ధిల్లింది. ఆ సామ్రాజ్య పరిపాలకుల్లో శ్రీకృష్ణదేవరాయలు కీర్తి చిరస్మరణీయం. ఆనాటి కట్టడాల శిథిలాలను సందర్శించడానికి విదేశాల నుంచి విశేష సంఖ్యలో టూరిస్టులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో మార్చి 6 వ తేదీ రాత్రి టూరిస్టులపై జరిగిన అఘాయిత్యం సంచలనం కలిగించింది. ఇజ్రాయెల్ నుంచి వచ్చిన టూరిస్టు యువతి, అమెరికా టూరిస్టు డేనియల్, నాసిక్‌కు చెందిన టూరిస్టు పంకజ్, ఒడిశాకు చెందిన బిబ్బాస్, స్థానిక హోమ్‌స్టే యజమానురాలు హంపీ సమీపంలో అనెగొంది ప్రాంతంలో మార్చి 6 వ తేదీ రాత్రి నక్షత్రాలను సందర్శించడానికి వెళ్లగా వీరిపై దుండగులు దాడి చేశారు. ఇజ్రాయెల్ టూరిస్టు యువతిపైన, హోమ్‌స్టే యజమానురాలిపైన ముగ్గురు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వారి వద్ద ఉన్న రూ. 9500 నగదు, రెండు మొబైల్ ఫోన్లను కాజేశారు. ఈ బృందంలో ఉన్న ముగ్గురు పురుషులపై దాడి చేసి వారిని తుంగభద్ర కాలువలోకి తోసేశారు.డేనియల్, పంకజ్ ప్రాణాలతో బయటపడగా బిబ్బాస్ మృతదేహం తరువాత బయటపడింది. కొప్పల్ ప్రాంతంలోని సనపుర సరస్సువద్దకు రాత్రి పూట నక్షత్రాలను సందర్శించడానికి సాధారణంగా ఎవరూ వెళ్లరని, అక్కడ చిరుత పులులు, ఎలుగుబంట్లు ఎక్కువగా సంచరిస్తుంటాయని స్థానికులు చెప్పారు. ఈ దుర్ఘటన హంపీ క్షేత్ర పర్యాటక చరిత్రలో విషాద ఘట్టంగా మిగిలింది. హంపీ సర్కిల్ ఆర్కియాలజీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 202425 డిసెంబర్ వరకు 5.8 లక్షల స్వదేశీ టూరిస్టులు, 9357 మంది విదేశీ టూరిస్టులు హంపీని సందర్శించడానికి రాగా, వీరిలో ఇజ్రాయెల్, ఐరోపాకు చెందిన వారే ఎక్కువగా ఉన్నారు. ఏటా హోలీ వేడుక జరుపుకోవడానికి హంపీకి టూరిస్టులు భారీ సంఖ్యలో వస్తుంటారు. కానీ ఈసారి టూరిస్టుల సంఖ్య బాగా తగ్గింది. అత్యాచార సంఘటన కూడా దీనికి కారణం కావచ్చు. హంపీ ప్రాంతంలో అనధికార అతిథి గృహాలు ఎక్కువగా నడుస్తున్నాయి. 2020 లో తుంగభద్ర నదిలోని విరుపాపుర గడ్డి ద్వీపంలో ఏర్పాటైన అక్రమ రిసార్టులను అధికారులు కూల్చివేశారు. ఇక్కడ విస్కీ పార్టీలు, డ్రగ్ వినియోగం భారీగా జరుగుతోందని స్థానికులనుంచి ఫిర్యాదులు కూడా పోలీసులకు అందుతున్నాయి. హంపీ ప్రాంతంలో టూరిస్టులపై అత్యాచార సంఘటన మరువక ముందే హంపీ ప్రాంతంలోనే మరో ఇజ్రాయెల్ టూరిస్టు మహిళపై అత్యాచారం జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఇదిలా ఉండగా, భారత పర్యటనకు వచ్చిన ఓ బ్రిటిష్ మహిళపై ఢిల్లీలోని హోటల్‌లో ఇద్దరు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన జరిగింది. మహారాష్ట్ర, గోవాలో పర్యటించడానికి బాధితురాలు గత నెలలో భారత్‌కు చేరుకున్నారు. కొద్ది రోజుల పాటు ముంబైలో పర్యటించారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో కైలాస్ అనే 24 ఏళ్ల వ్యక్తితో పరిచయం అయింది. తనను కలిసేందుకు ఢిల్లీ రావాలని కైలాస్ కోరడంతో ఆమె ఢిల్లీ చేరుకున్నారు. మహీపాల్ పుర్ ప్రాంతంలో ఓ హోటల్‌లో గది తీసుకున్నారు. తొలుత ఆ రాత్రి హోటల్‌లో పనిచేసే వ్యక్తి లిఫ్ట్‌లో తనపై లైంగికంగా దాడి చేశాడని, ఆ తర్వాత కైలాస్ అత్యాచారానికి పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2024 మార్చిలో జార?ండ్‌లోని దుమ్కా జిల్లా లో భారత్‌లో పర్యటించడానికి వచ్చిన స్పెయిన్ దంపతులపై దుండగులు దాడి చేయడమేకాక, స్పెయిన్ మహిళపై అత్యాచారం జరపడం దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. బీహార్ మీదుగా నేపాల్ బయలుదేరిన వీరు ప్రపంచ యాత్రకు సిద్ధం అయ్యారు. దారిలో ఓ ప్రాంతంలో తాత్కాలిక గుడారంలో ఉన్న ఆమెపై స్థానిక యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిపై ప్రపంచ దేశాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ఈ దారుణంపై జార?ండ్ అసెంబ్లీలో తీవ్ర దుమారం రేగింది. మొత్తం ఏడుగురు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ సంఘటనలను పరిశీలిస్తే దేశంలోని పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకులకు తగిన భద్రత ప్రశ్నార్థకంగా తయారైంది. దేశం మొత్తం మీద శిక్షణ పొందిన, రిజిస్టర్ అయిన టూరిస్టు గైడ్లు ఉన్నప్పటికీ, ప్రత్యేక పోలీస్ బలగాల రక్షణ మాత్రం లోటుగా కనిపిస్తోంది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్రం కూడా పర్యాటక ప్రదేశాలకు తగిన భద్రత కల్పించవలసిన అవసరం ఉంది.

# శత వసంతాల మాలపల్లి నవల






గాంధేయ వాదిగా, న్యాయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధుడుగా, ఉద్యమ నాయకునిగా, స్త్రీ విద్య ప్రోత్సాహికునిగా, కాంగ్రెస్ నేతగా, దళిత జనోద్ధారకునిగా, ప్రధానంగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా ఉన్నవ లక్ష్మీ నారాయణ తెలుగు వారికి సుపరిచితుడే. ముఖ్యంగా నాటి సాంఘిక దురాచారాలను ప్రతిబింబించే, మాలపల్లి నవల నాడు ఒక సంచలనమే. సాంఘిక, ఆర్థిక అసమానతలను తొలగించి, కుల వ్యవస్థను నిరసించి, అందరూ సమానులే అన్న భావనతో, అగ్రవర్ణాలు, హరిజనులు అందరూ కలసి మెలసి ఉండాలని కోరుకుంటూ, "మాలపల్లి" అనే విప్లవాత్మకమైన నవలను రచించడం, తన దృక్పథానికి మద్దతుగా, "సహ పంక్తి భోజనాలు" నిర్వహించడం ఆ రోజులలో సాహసమే. మాలపల్లి తెలుగు సాహితీ చరిత్రలోనూ, సామాజిక దృక్పధంలోనూ ఒక నూతన ఒరవడిని సృష్టికి, చర్చోప చర్చలకు కారణభూతమైంది. ఒక దళిత కుటుంబం సమా జంలో కలిసి మెలసి ఉండడానికి చేసే ప్రయత్నం, సదరు ప్రయత్నంలో ఎదురైన చేదు అనుభవాలు, ఆ అనుభవాలతో రాటుదేలిన వ్యక్తులు చైతన్యమై సంఘటి తమై సమాజంలో నిర్లక్ష్యం చేయబడ్డ తమ ఉనికి కోసం, మెరుగైన స్థానం కోసం చేసే పోరాటాలు వంటి అంశాలతో మాలపల్లి నవలలోని పాత్రలు ఉదాత్తంగా చిత్రీకరించ బడ్డాయి. సామాజిక మార్పు కోసం బలహీన దళిత, పీడిత వర్గాలు చైతన్యంతో సుసంఘ టితం కావాలని, పోరాటా లకు సిద్ధపడాలని మాలపల్లి ప్రబోధించింది. 1922లో పల్నాడు పుల్లరి సత్యాగ్రహంలో పాల్గొని అరెస్టయి రాయ వెల్లురు జైలుకు ఉన్నవ లక్ష్మీనారాయణ తరలించ బడిన సమయం లోనే అక్కడే తన లక్ష్య సాధనకై విప్లవాత్మకమైన తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయమైన 'మాలపల్లి' నవలను ఆయన రచించారు. మాలపల్లి నవల దళిత కుటుంబాన్ని ప్రధాన కథాశంగా రచించిన తొలి రాజకీయ నవల. 1922 లో మాలపల్లి నవలను బెల్లంకొండ రాఘవరావు ముద్రించగా, మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై నిషేధం విధించింది. రాజకీయ వాతావర ణాన్ని, గాంధీ మహాత్ముని ఆశయాల్ని, తెలుగువారి జీవన విధానాన్ని ప్రతిబింబించిన నవల మాల పల్లి. ఆ నవలలో సాంఘిక దురాచారాలు, జాతీయ సత్యాగ్రహ ఉద్యమాలు, వర్ణ , వర్గ వ్యత్యాసాలు తదితర ఆ నాటి పరిస్థితులను కల గలిపి, కళ్ళకు కట్టినట్లు ఉన్నవ చిత్రించడం విశేషం. ఆనాడు హరిజనుల కుటుంబ గాథను ఇతివృత్తంగా ఎన్నుకొని నవల వ్రాయడమే సాహసం. 1926 లో మద్రాసు శాసన మండలిలో మాలపల్లి నిషేధంపై చర్చలు జరగడం, 1928 లో కొన్ని మార్పులతో మాలపల్లి ప్రచురణకు తిరిగి అనుమతి లభించడం, మద్రాసు ప్రభుత్వం ఆంధ్ర విశ్వ విద్యాలయం మాలపల్లిని ప్రచురించి, ఆ నవలను పాఠ్య గ్రంథంగా ఎంపిక చేయడం, 1936 లో మద్రాసు ప్రభుత్వం మాలపల్లి నవలపై రెండోసారి నిషేధం తెలిపి ఆ నవలను పాఠ్య గ్రంథంగా తొలగించడం, 1937లో చక్రవర్తుల రాజగోపాలాచారి మద్రాసు ప్రధానిగా ఎన్నికైనప్పుడు తొలి కాంగ్రెసు మంత్రి వర్గంచే మాలపల్లి నవలపై నిషేధపు ఉత్తర్వులను రద్దు చేయించడం క్రమానుగతంగా జరిగి పోయాయి. సామాన్య ప్రజల సంక్షేమం, అభ్యుదయాన్ని కోరే కవిత్వం ప్రజలకు సులభంగా అర్థమయ్యే వాడుక భాషలో ఉండాలన్న లక్ష్యంతో మాలపల్లి నవలలో చరమ గీతం, సమతా ధర్మం అనే రెండు గేయ కవితల్ని సామాన్య ప్రజలకు అర్థమయ్యే నిత్య వాడుక భాషలో జానపద గేయ రీతుల్లో రచించాడు. ఆ నవలకు కాశీనాథుని నాగేశ్వర రావు పీఠిక వ్రాస్తూ, "ఆంధ్ర సాహిత్య హృదయ పరిణామా న్ని గ్రహించడానికి మాలపల్లి ఉత్తమ కావ్యం అని, తెనుగు మాటలు, తెనుగు దేశము, తెనుగు హృదయము, తెనుగు సంకల్పము, మాలపల్లి నవలకు అనిర్వచనీయ ప్రతిభను సమ కూర్చాయి" అని కొనియాడాడు. అందుకే తెలుగు సాహిత్యంలో వచ్చిన తొలి విప్లవ నవలగా గుర్తింపు పొందింది.ఆయన సాహిత్యం ద్వారా హరి జనోద్ధరణకు కృషి చేశాడు. గుంటూరులో శ్రీ శారదా నికేతన్ ను స్థాపించి, స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. కందుకూరి వీరేశలింగం పంతులు అధ్యక్షతలో తొలి వితంతు వివాహం జరిపించిన సంస్కర్తగా నిలిచాడు. రష్యాలో 1917లో జరిగిన బోల్షవిక్ విప్లవం వల్ల స్ఫూర్తి పొందిన మొదటి తెలుగు కవి ఉన్నవ. కూలీల పక్షం వహించి కవులు రచనలు చేయడానికి ప్రేరణ నిచ్చింది సదరు రష్యా విప్లవ ప్రభావమే. ఉన్నవ... మాల పల్లి, నాయకురాలు, బుడ బుక్కల జోస్యం, స్వరాజ్య సోది, భావ తరంగాలు తదితర రచనలు చేశాడు. గాంధేయ వాదిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధు నిగా తెలుగు నవలా సాహిత్య వైతాళికుడుగా కీర్తి పొందిన ఉన్నవ లక్ష్మీనారాయణ గుంటూరు జిల్లా అప్పటి సత్తెనపల్లి తాలూకా వేములూ రు పాడు గ్రామంలో 1877 డిసెంబరు 4న జన్మించి, 1958 సెప్టెంబరు 25 న మరణించాడు.

# ఆధ్యాత్మికతతో తరిస్తున్న ప్రభుత్వాలు



రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కూటమి లక్ష్యమైన 'హిందూ రాజ్య స్థాపన' ఎజెండా బహూముఖ పద్ధతుల్లో ప్రాచుర్యం పొందిన కథనాలపై నిర్మించబడుతుంది. దాని ఎజెండాను ముందుకు తీసుకెళ్లే అంశాల్లో పండుగలు ఒకటి. 'సామాజిక రాజకీయ సందేశం' లో భాగంగా కొద్దిమంది దేవతల్ని ముందుకు తీసుకొని రావడం కూడా రాజకీయ రంగంలో ప్రధానమైన మార్గంగా ఉంది. ఇటీవలి కాలంలో జరిగిన కుంభమేళా ఓ పెద్ద దృశ్యం. మతపరమైన సమ్మేళనం కంటే కూడా ఇది ఒక జాతీయ కార్యక్రమంగా మారింది. ఈ సంవత్సరం జరిగిన కుంభమేళాలో ఒక ప్రధానమైన మార్పు ఏమంటే, దాని భారీ మార్కెటింగ్ ఒక సాంస్కృతిక, అభివృద్ధి ప్రదర్శనగా మారింది. దాన్ని, హిందూ మతం కోసం ఏర్పాటు చేసిన 'భూమి పై మహా ప్రదర్శన' గా ముద్ర వేశారు. అలాంటి సందర్భాల్లో భక్తుల కోసం బస, పరిశుభ్రత, రవాణా ఏర్పాట్లు ప్రభుత్వం తప్పనిసరిగా నిర్వర్తించాల్సిన విధి. ఈ దఫా ఈ కార్యక్రమాన్ని నిర్వహించే ప్రక్రియలో ప్రభుత్వం పూర్తిగా నిమగ్నమైంది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్ పీ), ధర్మ సంసద్, లాంటి పాలక పార్టీ అనుబంధ సంస్థలు, వ్యక్తిగత సాధువుల లాంటి వారు కూడా హిందూ జాతీయవాద ఎజెండాలోని అంశాల్ని, 'ముస్లింల పట్ల ద్వేష భావాల్ని' ప్రచారం చెయ్యడంలో ముందు భాగంలో ఉన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి మతపరమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఒకవైపున భక్తులు ఎంతగానో అభినందిస్తుం డగా, ఈసారి కుంభ మేళాకు ఒక రాజకీయ రంగును ఇస్తుండడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కుంభమేళాను నిర్వహించడం ఇదే ప్రథమం కాదు. ఈసారి ఈ సందర్భం, హిందూత్వ ఎజెండా ప్రాధాన్యతను పెంచే వేదికగా మారింది. జన సమూహాల నిర్వహణ సాధ్యం కాదని గుర్తించినప్పటికీ కూడా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆహ్వానించేందుకు ప్రకటనల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. ఈ కార్యక్రమంలో ముస్లిం వ్యాపారస్తులు తమ దుకాణాలు ఏర్పాటు చేసే ప్రక్రియను బహిష్కరించారు. దీనికి అనేక కారణాలున్నాయి. ముస్లింలు ఆహారంలో ఉమ్మి వేశారు కాబట్టే వారిని దూరంగా ఉంచారనే విషయాన్ని స్వామీ అవిముక్తేశ్వరానంద్ ఒక అబద్ధం చెప్పాడు. అలాంటి తప్పుదారి పట్టించే చాలా వీడియోలు సామాజిక మాధ్యమంలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ సందర్భంగా తొక్కిసలాటలో బాధితులైన వారి కోసం ముస్లింలు మసీదుల్ని తెరిచి, వారి కోసం ఆహారాన్ని ఏర్పాటు చేయడం వేరే విషయం. మొగలుల పాలనా కాలంలో భక్తులకు కుంభమేళా మరింత సౌకర్యవంతంగా ఉంచడానికి అనేక ఘాట్‌లు (స్నానాల కోసం నదీ తీరాలు), మరుగుదొడ్లు నిర్మించిన విషయం గుర్తుకొస్తుంది. అక్బర్, కుంభమేళా ఏర్పాట్లను చూసేందుకు ఇద్దరు అధికారులను నియమించా డని హేరాంబ్ చతుర్వేది అనే చరిత్రకారుడు చెప్పారు. ఈ సంవత్సరం ఆ ప్రాంతమంతా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ హోర్డింగులతో నిండిపోయింది.ఈసారి వీఐపీల కోసం విశాలంగా ఎక్కువ ప్రాంతాన్ని కేటాయించడంతో తొక్కిసలాటలు జరిగాయి, దానిలో చాలా పెద్దసంఖ్యలో భక్తులు చనిపోయారు. రవాణా ఏర్పాట్లు చాలా ఘోరంగా ఉన్నాయి. న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో జరిగిన తొక్కిసలాటలో సంభవించిన మరణాల్లో ఈ రవాణా ఏర్పాట్లు ప్రతిబింబిస్తాయి. తొక్కిసలాటలో చనిపోయిన వారంతా మోక్షం (విముక్తి) పొందారని, మోడీ, తాను తమ్ముడని పిలుచుకునే ఉన్నత శ్రేణి స్వామి, ధీరేంద్ర శాస్త్రి చాలా సంతోషంగా చెప్పాడు. నీటి నాణ్యత అధిక మల మూత్రాలతో చాలా తక్కువ స్థాయిలో ఉంది. నీటి నాణ్యత, మరణాల గురించి వచ్చిన విమర్శలన్నింటికీ, "పందులు మురికిని చూస్తున్నాయి, స్వార్థపరులు చనిపోయిన వారిని లెక్కిస్తున్నారని" ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ వ్యాఖ్యానిం చాడు. వీహెచ్‌పీ, దాని మార్గదర్శక్ మండల్ సమావేశాల కోసం కుంభమేళాను ఒక సువర్ణావకాశంగా ఉపయోగిం చుకుంది. వారి ప్రసంగాలు మొత్తం ముస్లింలపై విషాన్ని చిమ్మాయి. జనాభా పెరుగుదల, బంగ్లాదేశ్ నుంచి చొరబాటు దారులు, గో రక్షణ లాంటి ముస్లింల గురించి సాధారణంగా చేసే ప్రచా రం వివిధ సమావేశాల్లో అదే పనిగా రోత పుట్టించే రీతిలో పునరావృతం అయ్యింది. సాధ్వి రితంభర, ప్రవీణ్ తొగాడియా, యతి నర్సింగ్ నానంద్ సరస్వతీ లాంటి ద్వేషాన్ని వ్యాపింపచేసే వారు ద్వేషపూరిత ప్రసంగాలతో సంబరాలు చేసుకున్నారు. ప్రేక్షకులు కూడా పెద్ద సంఖ్యలో హాజర య్యారు. పాలక భారతీయ జనతా పార్టీ దాని రాజకీయ ఎజెండా కోసం విజయవంతంగా సాధువులను ఉపయోగిం చుకొని, ప్రభుత్వ ఖర్చుతో ప్రచారాన్ని పొందింది. కాశీ, మధురల డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 1860 దేవాల యాలపై 'పరిశోధనలు' జరిపామనీ, వాటిని పునరుద్ధరిం చాల్సిన అవసరం ఉందని కాషాయ వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి పేర్కొన్నాడు. హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి మదర్సాలను మూసివేసి, ఇంగ్లీష్ పాఠశాలల్ని గురుకులాలుగా మార్చాలని కూడా డిమాండ్ చేశారు. 2024 లో ప్రచురితమైన ఒక పుస్తకంలో ఇర్ఫాన్ ఇంజనీర్, నేహా దభాడే, మత సంబంధమైన పండుగలను హింసను ప్రేరేపించే సందర్భాలుగా ఉపయోగించడంపై మన దృష్టిని ఆకర్షించారు. మన పండుగలు మతపరమైన హద్దులు దాటి ఆహ్లాదకరమైన సామాజిక సందర్భాలుగా ఉంటున్నాయి. ఇప్పుడేమో హిందూ పండుగల సందర్భంగా ఊరేగింపులు నిర్వహించడం, ముస్లింల నివాస ప్రాంతాల గుండా వెళ్ళడం, మసీదులపై ఉన్న ఆకుపచ్చ జెండాను కాషాయ జెండాగా మార్చడం, చేతుల్లో కత్తులు పట్టుకొని నృత్యం చెయ్యడం ఒక ధోరణిగా మారింది. అదే సమయంలో ముస్లింలకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా ద్వేషపూరిత నినాదాలు ఇస్తున్నారు. ఇదే పుస్తకంలో, 2022-2023లో శ్రీరామనవమి సందర్భంగా హౌరా, హుగ్లీ (పశ్చిమబెంగాల్-2023)లో, సంబాజీ నగర్ (మహారాష్ట్ర -2023)లో, వడోదరా (గుజరాత్ -2023)లో, బీహార్ షరీఫ్, ససారాం (బీహార్ -2023)లో, ఖర్గోన్ (మధ్యప్రదేశ్ -2022)లో, హిమ్మత్ నగర్, ఖంబాత్ (గుజరాత్ -2022) లో, లోహర్దగా (జార?ండ్-2022)లో హింసాత్మక సంఘటనలు జరిగాయనే విషయాన్ని ఇద్దరు రచయితలు లేవనెత్తారు. "మతపరమైన ప్రదర్శన"గా నమ్మించే హిందూ జాతీయవాదుల చిన్న సమూహం కూడా మైనార్టీల నివాస ప్రాంతం గుండా వెళ్లాలని పట్టుబట్టి, రాజకీయ దూషణలతో కూడిన నినాదాలిచ్చి కొందరు యువకుల్ని రెచ్చగొట్టడం, హింసాత్మక పాటలు, సంగీతాన్ని వినిపిస్తే, దానికి ప్రతిస్పందనగా వారిపై రాయి విసిరితే, మైనారిటీల్ని పెద్ద సంఖ్యలో అరెస్ట్ చెయ్యడం, ఎలాంటి న్యాయ సంబంధ ప్రక్రియ లేకుండా కొన్ని రోజుల్లోనే వారి ఇళ్ళు, ఆస్తులను ధ్వంసం చెయ్యడం ద్వారా ప్రభుత్వం మిగిలిన పని చేస్తుందని వారు ఆశిస్తున్నారని" ఇంజనీర్ ముగించాడు. మరొక స్థాయిలో మితవాద రాజకీయాలు ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతుని గురించి మాట్లాడుతూ, వారిని తెరపైకి తెచ్చే విధంగా ప్రోత్సహిస్తున్నారు. గడచిన మూడు దశాబ్దాల కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో క్రైస్తవ వ్యతిరేక హింస పెరగడంతో, వనవాసీ కళ్యాణ్ ఆశ్రమ్, వీహెచ్‌పీ (ఆరెస్సెస్ సంతానం)లు ఈ ప్రాంతాల్లో శబరిని తెరపైకి తెచే ప్రయత్నాలు చేశాయి. గుజరాత్‌లో డాంగ్స్ దగ్గరలో శబరి కుంభ్ నిర్వహించారు. ఈ ప్రాంతంలోనే ఒక శబరి దేవాలయాన్ని ఏర్పాటు చేశారు. ఆ సమయంలో వీహెచ్‌పీ కి చెందిన స్వామి అసీమానంద్ ఆ ప్రాంతంలోనే పని చేస్తున్నాడు. అతడే, తర్వాత కాలంలో మాలేగావ్, అజ్మీర్, మక్కా మసీదుల్లో జరిగిన బాంబు పేలుళ్ల కుట్ర కేసులో పాత్రదారునిగా ఉన్నాడని మహారాష్ట్ర యాంటీ టెర్రర్ స్క్వాడ్ అతనిపై ఆరోపణలు చేసింది.ఈ ప్రాంతాల్లో శబరి, హనుమంతుడ్ని తెరపైకి తేవడానికి ఎందుకు ఎంచుకున్నారు? శబరి (రామాయణంలో)ఒక పేద మహిళ. రామునికి పెట్టేందుకు ఆమె వద్ద తగినంత ఆహారం లేదు. ఆమె బెర్రీ పండ్ల రుచిని పరీక్షించిన తర్వాతే రామునికి ఇచ్చింది. ఇక్కడ తేడా స్పష్టంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మనకు పూజించడానికి దుర్గా, లక్ష్మీ, సరస్వతి ఉంటే, ఆదివాసీ ప్రాంతాల్లో శబరి ఉంటుంది. అదే విధంగా ఆదివాసీ ప్రాంతాల్లో హనుమం తునికి (రామ భక్తుడు) ప్రాచుర్యం ఎక్కువ. మన పండుగలపై హిందూత్వ రాజకీయాల ప్రభావం వారి రాజకీయాల్లో చాలా ప్రతిబింబిస్తుంది. వీటిలో కొన్నింటిని ఆయు ధంగా ఉపయోగిస్తున్న తీరు, లేక కుంభమేళాను ముస్లిం వ్యతిరేక వేదికగా మార్చిన తీరు, లేదా ఆదివాసీ ప్రాంతాల్లో శబరి, హనుమంతునికి బాగా ప్రాచుర్యం కల్పించిన విధానం ఆలోచించ దగిన విలువైన అంశాలు.

# తాడివలసలో పంచాయతీ సాధారణ సమావేశం

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం తాడివలస గ్రామపంచాయతీ లో సర్పంచ్ తమ్మినైన మణెమ్మ అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సభ్యులు సోమవారం నాడు సచివాలయం నందు సమావేశం నిర్వహించారు. .ఈ సమావేశంలో పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, తాగు నీరు,విద్యుత్ బల్బులు ఏర్పాటు వంటి అంశాలపైన చర్చించారు. వీటితో పాటు పంచాయతీ పరిధిలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మొదటి విడతలో పంచాయతీ లోని గంద్రేడు గ్రామంలో 33 లక్షలు,లచ్చయ్యపేట గ్రామంలో 38 లక్షలు, తాడివలస గ్రామంలో 47 లక్షలతో నిర్మించిన,నిర్మిస్తున్న సిమెంటు రోడ్లు,కాలువ పనులకు బిల్లులు చెల్లింపుల గురించి వివరించారు. ఆలాగే చిన్న నీటి పారుదల శాఖ, రోడ్లు, భవనాల శాఖ మరియు పంచాయతీ రాజ్ శాఖల క్రింద పంచాయతీ పరిధిలో సూచించిన పలు పనులకు ఆమోదం కోసం,గృహనిర్మాణం,వ్యవసాయ పరికరాలు కు లబ్దిదారుల ఎంపిక,పంచాయతీలోని తాడివలస గ్రామంలో బస్ స్టాండ్ వద్ద ముఖ ద్వారం, గ్రామ స్వర్గధామం నకు వెంకంపేట వద్ద ముఖ ద్వారం (ఆర్చ్ లు ) ఏర్పాటు చేయుటకు సమావేశంలో చర్చించారు. సంబధిత పనులకు తీర్మానం చేసి ఆ కాపీలను మండల జె.ఈ లకు పనులు అంచనాల తయారు చేయుట



కొరకు అందజేయాలని సభ్యులు నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా సచివాలయంలో పని చేస్తున్న సిబ్బంది పనితీరు పై పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ పంచాయతీలో ఇంటి పన్నులు వసూలు ప్రారంభించి అంతా ఆన్లైన్ ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం రెండవ విడతలో తాడివలస గ్రామంలో పలు పనులకు సుమారు 60 లక్షలు నిధులు మంజూరు జరిగినట్లు సర్పంచ్ తమ్మినైన మణెమ్మ తెలిపారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ఉపేక్షించం

జిల్లా కలెక్టర్ ప్రశాంతి..
పి జి ఆర్ ఎస్ కు హాజరు కాకపోవడం బాధ్యతారాహిత్యం..
కలెక్టరేట్ పీజీఆర్ఎస్ లో 181 అర్జీలు..
అర్జీదారుల సమస్య వినండి..కలెక్టర్..
పరిష్కారం దిశగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలను నిర్ధారించాలి..



**రాజమహేంద్రవరం, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడం, వాటిపై దృష్టి పెట్టడం, సహేతుకమైన ఆమోదయోగ్యం కలిగిన విధానంలో పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. సోమవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు తో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా స్థాయి అధికారులు తప్పకుండా హాజరై ప్రజల నుంచి అర్జీలను వ్యక్తిగతంగా స్వీకరించాలన్నారు. ద్వితీయ శ్రేణి అధికారులను , సిబ్బందిని పంపి అర్జీలను స్వీకరించడం వాటిపై సరైన అవగాహన లేకుండా పరిష్కారం చేసినట్లు పేర్కొనడం నేపథ్యంలో ఒకే అర్జి పై పలుమార్లు అదే అధికారి వద్దకు వస్తున్నట్లు తెలుస్తోందన్నారు. అర్జిదారుడు తరఫున ఇచ్చే ఫిర్యాదులో వాస్తవ వివరాలు అధికారి నిర్ధారణ చేసుకుని, మాత్రమే పరిష్కారం చూపే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కంప్యూటర్ ఆపరేటర్, గుమాస్తా స్థాయిలో పరిశీలన చేసి టేబుల్ వర్క్ చర్యలు ఉపేక్షించడం జరగదన్నారు. క్షేత్ర స్థాయిలో క్రాస్ చెక్ చేసుకుని మాత్రమే పరిష్కారం దిశగా అడుగులు వేయాలని పేర్కొన్నారు. కలక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ స్థాయి లో మాకు వచ్చే అర్జీలను క్షేత్ర స్థాయిలో తనిఖీలు నిర్వహించి అందుకు అనుగుణంగా ఉత్తర్వులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇదే రకమైన పనితీరు జిల్లా అధికారుల నుంచి ఆశిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పీజిఆర్ఎస్ కార్యక్రమాన్ని చేపట్టిందని, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించమని హెచ్చరించారు. ఇకపై ఖచ్చితంగా ఆయా శాఖలకు చెందిన అర్జీలు పరిష్కారం చేసి, వాటిపై ప్రజలతో మాట్లాడి సంతృప్తి స్థాయి తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. రీ సర్వే, భూ సర్వే కొలతలు, రేషన్ కార్డులు, పెన్షన్ మంజూరు చేయడం కోసం అర్జీలు ఇచ్చినట్లు చెప్పారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ లో 181 అర్జీలు వచ్చినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. వాటిలో రెవెన్యూ 104 , పోలీసు 26 , పంచాయితీ రాజ్ 23 , ఇతర శాఖలు 28 అర్జీలను స్వీకరించినట్లు చెప్పారు.

# ఆధునిక పద్ధతుల్లో వెదురు ఉత్పత్తులు సాధించాలి



ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్..
వెదురు సాగు పెంచడంపై వర్క్ షాప్..



**రాజమహేంద్రవరం, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** వెదురుని పురాతన పద్ధతిలో ఉపయోగించే దశ నుండి ఆధునిక కాలంకు అనుగుణంగా నూతనంగా అభివృద్ధి అయ్యే వివిధ ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రైతులు , వ్యాపారులు నైపుణ్యం పెంచుకోవలసిన ఆవశ్యకత ఉందని ఫారెస్ట్ చీఫ్ కన్సర్వేటరీ బిఎన్ఎన్ మూర్తి అన్నారు.సోమవారం లాలాచెరువు అటవీశాఖ కార్యాలయంలో వెదురుసాగు విస్తీర్ణం పెంచడం పై ఔత్సాహిక రైతులు, ట్రేడర్స్ లతో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఎన్ ఎన్ మూర్తి మాట్లాడుతూ, వెదురు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు అవగాహన పరుచుకుని వెదురు పంటను పెంచే విధంగా తయారు కావాలని పిలుపునిచ్చారు.వెదురు కర్రతో నూతన ఆవిష్కరణలు చేపట్టి చేతి వృత్తిదారులు నైపుణ్యం పెంచుకోవాలని, అందుకు అందుబాటులో ఉన్న సాంకేతికత పరిజ్ఞానం పెంచుకోవాలని తెలిపారు. వెదురు బద్దలతో తయారు చేసే ఉత్పత్తుల ఆవిష్కరణ దిశగా రానున్న రోజుల్లో గ్రామస్థాయిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. వెదురులో మేలైన రకాలు, సాగుకు వాటిని తగిన మార్కెటింగ్, విక్రయించే మార్గం పై రైతుల అవగాహన కల్పించుకోవాలని తెలిపారు. అకాడమీ డైరెక్టర్ విజయకుమార్ మాట్లాడుతూ వెదురు ఒక చెట్టు జాతి క్రింద పరిగణించడం వల్ల రైతులు చాలా ఇబ్బందులు పడేవారని , అటవీ చట్టాన్ని సవరణ చేసి వెదురు చెట్టు జాతులు నుండి గడ్డి జాతి గా కేంద్ర ప్రభుత్వం చట్ట సవరణ చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం నేషనల్ బాంబో మిషన్ ను ఏర్పాటు చేసి, రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ లో కూడా బాంబో మిషన్ ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రైతులకు రానున్న రోజుల్లో వెదురు పంట మంచి ఆదాయ వనరుగా, దిక్సూచిగా నిలుస్తుందన్నారు. పాత పద్ధతుల్లో బుట్టలు , తట్టలు , నిచ్చెనలు చేసే దగ్గర నుండి ప్రస్తుతం ప్రత్యామ్నాయ మార్గంగా భవనాల నిర్మాణాలు, బాంబో హోటల్స్, రిసార్ట్స్ వెదురు కర్రలతో ఏర్పాటు చేయొచ్చని తెలిపారు. వెదురు సాగు విస్తీర్ణం పెంచడం కోసం రైతులని ప్రోత్సహించి, శిక్షణ తరగతులు నిర్వహించ నున్నట్లు తెలిపారు. అటవీ సంరక్షణ కోసం పర్యావరణ పరిరక్షణ కోసం వెదురు కర్రతో నిర్మాణాలు చేపట్టే దిశగా అడుగులు వేయాలని కోరారు. మహారాష్ట్ర సింధూర్ జిల్లాకు చెందిన కాన్ బేక్ కంపెనీ చైర్మన్, కో ఫౌండర్,సంజీవ్ శశికాంత్ కార్పే, మాట్లాడుతూ గడిచిన 21 సంవత్సరాలు నుండి వెదురుపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పిస్తే మొదట్లో 22 మందితో ప్రారంభించిన కంపెనీ సుమారు పది వేల మంది కార్మికులతో అభివృద్ధి చెందినట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారం ఎం తో ఉందని తెలిపారు. వెదు రుతో హొటల్, రిసార్ట్స్ నిర్మిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్, రవీంద్ర ధామ, ఆర్. శ్రీనివాస్, ఉద్యానవన శాఖ అధికారి, డి.సుధీర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు తమ్మినేని పరామర్శ

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం గార పేటలో లుకలాపు కన్నయ్య సోదరుడు , మారి శేఖర్ వాళ్ళ అమ్మమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలిసిన వైకాపా జిల్లా పార్లమెంట్ పరిశీకులకులు , మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆ కుటుంబాలను సోమవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో జడ్పిటిసి లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్ , మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షులు బాడాన సునీల్, స్థానిక నాయకుడు గార రమణ, వైయస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



## శ్రీ మద్ది అంజనను దర్శించుకున్న సినీ హీరో నితిన్..



**జంగారెడ్డిగూడెం, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు క్రింద స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారిని ప్రముఖ సినీ హీరో నితిన్, మైత్రి మూవీస్ అధినేత రవిశంకర్, దర్శకుడు వెంకి కుడుముల విచ్చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపం వద్ద వేద ఆశీర్వచనం అందజేసి ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ శ్రీ స్వామి వారి శేషవస్త్రములతో సత్కరించి, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి. చందన తదితరులు పాల్గొన్నారు.

## తూర్పుగోదావరి జిల్లా పిజిఆర్ఎస్‌కు 26 ఫిర్యాదులు..



**రాజమండ్రి, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తూర్పుగోదావరి జిల్లా పోలీస్ కార్యాలయంలో "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం"(పి.జి.ఆర్.ఎస్) కార్యక్రమాన్ని సోమవారం జిల్లా అడిషనల్ ఎస్పీ( అడ్మిన్) ఎన్.బి.ఎం మురళీకృష్ణ అడిషనల్ ఎస్పీ( లా అండ్ ఆర్డర్)ఏ.వీ సుబ్బరాజు సంయుక్తంగా నిర్వహించారు. నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం" కార్యక్రమానికి 26 ఫిర్యాదులు అందాయి. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం", (పి జి ఆర్ ఎస్ కు) జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ ప్రజలు అందజేసిన అర్జీల పై సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు.

## ఈనెల 20న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు..

సదస్సు జయప్రదం చేయాలి.. కరపత్రాలు విడుదల..
ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్..




**ఏలూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఈనెల 20వ తేదీన ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో జరుగుతున్న కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్ సీతారామ కళ్యాణమండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సదస్సుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులను, ఏలూరు జిల్లాతో పాటు కోకో సాగు జరుగుతున్న తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి,శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుండి కోకో రైతులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. అన్ని ప్రాంతాల నుండి కోకో రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కోకో గింజల కొనుగోలు సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజలు కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు రైతులను ఇబ్బందులకు గురి చేయడం తగదని అన్నారు. కోకో రైతులను ఆదుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు పానుగంటి అచ్యుతరామయ్య, పి.నరేష్, జాస్తి కాశీ బాబు,టి. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## రొళ్ళ మండలంలో పది పరీక్షలకు 377 మంది హాజరు.




**మటకశిర,మార్చి17,ప్రజా జ్యోతి :** రోళ్ళ మండలంలో జరిగిన పదో తరగతి పరీక్షలలో మొదటి రోజు సోమవారం జరిగిన పరీక్షలో 382 మందికి గాను 5 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి శ్రీధర్ తెలిపారు.మండలంలోని కేజీబీవీలో నిర్వహించిన పరీక్ష కేంద్రాల్లో185 మందికి గాను183,గురుకులలో నిర్వహించిన పరీక్ష కేంద్రంలో 197 మందికి గాను 194 రెండు కేంద్రాలలో జరిగిన పరీక్షలకు 382 మంది విద్యార్థులకు గాను 377 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు అయినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు.పరీక్ష కేంద్రాలను స్థానిక తహసిల్దార్ షేక్షావలి, సెంటర్ చీఫ్ వరదరాజ్, ప్రభురాజ్, ఎస్ఐ బాలాజీ, కానిస్టేబుల్ జగదీష్ పరిశీలించారు.

# పిఎస్ఈ ట్రైనింగ్ పిల్లలకు పునాది వంటిది







**యూత్ క్లబ్ బెజ్జి పురం డైరెక్టర్ ప్రసాద రావు , కోశాధికారి జి అప్పలనాయుడు**

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండియా లిటరసీ ప్రాజెక్టు బెంగుళూరు వారి సహకారముతో నిర్వహిస్తున్న స్కూల్ రెడీనెస్ %ఱ% బాలవికాస్ ప్రోగ్రాం లో భాగంగా శనివారం లోలుగు ఉపహర ఎన్.జి.ఓ. కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.సిగడం, పొందూరు, ఎచ్చర్ల మండలాలలో పూర్వ ప్రాథమిక తరగుతులకు బోధిస్తున్న 75 అంగన్వాడి కార్యకర్తలకు సి.డి.ఎఫ్ మోడల్, కృత్యాధార బోధన పద్ధతులు లను ఆట పాట లతో, అభినయ గేయలతో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి గా యూత్ క్లబ్ బెజ్జిపురం డైరెక్టర్ యం.ప్రసాద రావు పాల్గొని ప్రాజెక్ట్ కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా సంస్థ కోశాధికారి జి. అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ పి.ఎస్.ఈ శిక్షణ అనేది పిల్లలకు పునాది లాంటిది దీనిని సెంటర్ వరకు తీసుకొని వెళ్లాలని తెలియజేశారు.ఎచ్చెర్ల ఐ .సి.డి.ఎస్ ప్రాజెక్టు సి.డి.పి. ఓ డి. పాపి నాయుడు మాట్లాడుతూ పి.ఎస్.ఈ ట్రైనింగ్ లో నేర్చుకున్న ప్రతీ ఒక్క అంశాన్ని అంగన్వాడీ కేంద్రాలలో అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్ట్ సిబ్బంది సీడీఎఫ్ మోడల్ 5 ఫేజ్ పైన అంగన్వాడి కార్యకర్తలకు ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పి.మాధవి ప్రాజెక్టు వివరాలను తెలియజేస్తూ పూర్వ ప్రాథమిక పాటశాలలో చదువుతున్న విద్యార్థులకు కృత్యాధర బోధన , అభినయ గేయాల బోధన చేయడం వలన విద్యార్థులు బాగా అభ్యాసించగలరని పేర్కొన్నారు. విద్యా వ్యవస్థ విద్యార్థి కేంద్రీకృతంగా ప్రయాణం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లక్ష్యం కోసమే యూత్ క్లబ్ పనిచేస్తుందని తెలిపారు.ప్రాజెక్ట్ చేస్తున్న సంగతి కార్యక్రమాలు ప్రాజెక్ట్ అభివృద్ధి పథంలో పిల్లలతో చేస్తున్న అన్ని కార్యక్రమాలు గురించి వివరించారు. ఉపహార ఎన్.జి.ఓ. కమ్యూనిటి ఫెసిలిటేటర్ ఎల్.అప్పారావు మాట్లాడుతూ ఈ శిక్షణ ను సక్రమంగా వినియోగించుకొని ఫీల్డ్ లో అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్స్ వై. శంకరరావు, కె.శ్రావణి , ఏ. రమణమూర్తి, పి.ఉమామహేశ్వ రరావు, యు.మెహెర్ వాణి,మరియు ఎం.డి.ఎల్.ఎస్ ఫెసిలిటేటర్, యన్. సంతోషి, పి.అప్పలనా యుడు, ఐ. రాధ వై. వాసంతి,ఏ. అప్పలనాయుడు మరియు సంస్థ సిబ్బంది, ఇంటర్న్షిప్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ యంత్రాంగానికి డ్రోన్ అందజేత..

**డ్రోన్ అందజేసిన కోకో కోలా యాజమాన్యాన్ని అభినందించిన ఎస్పీ..**



**ఏలూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ఏలూరు జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తున్న నేపథ్యంలో కోకో కోల బాటిలింగ్ యూనిట్ యాజమాన్యం డ్రోన్ ని ఏలూరు జిల్లా ఎస్పీ కే ప్రతాప్ శివ కిషోర్ కు అందజేశారు. ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఛాంబర్ లో ఈ డ్రోన్ ను కోకో కోల బాటిలింగ్ యూనిట్ సిబ్బంది జిల్లా పోలీస్ యంత్రాంగానికి అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజల శాంతి, భద్రత పరిరక్షణ కోసం పోలీసులు అహర్నిశలు సేవలందిస్తుందగా, ప్రభుత్వ సహాయంతో పాటు ప్రజల మద్దతు కూడా లభించడం ఎంతో ప్రోత్సాహకరమైన అంశం అని పేర్కొన్నారు. పోలీస్ శాఖకు ప్రజల సహకారం లభించడం ఆనందించదగిన విషయం అని, డ్రోన్ ను పోలీస్ శాఖకు అందజేయడానికి కృషి చేసిన ఏలూరు డిఎస్పీ డి శ్రావణ్ కుమార్, భీమడోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ మరియు సహకరించిన అధికారులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.ఈ డ్రోన్ ఆధునిక ట్రాఫిక్ పర్యవేక్షణ, గస్తీ, మరియు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడుతుందని, భద్రతా చర్యలను మరింత సమర్థంగా అమలు చేయడానికి ఇది పోలీస్ శాఖకు సహాయపడుతుందని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలోఏలూరు డిఎస్పీ డి శ్రావణ్ కుమార్,భీమడోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ యు.జే. విల్సన్, ఎస్ఐ సుధీర్ బాబు, కోకో కోలా బాటిలింగ్ యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాస్థాయిలో ప్రధాన పనితీరు సూచికలను సిద్ధం చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రశాంతి..**
**కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో శాఖపరంగా సమగ్ర నివేదిక అందజేయాలి..**
**స్పష్టంగా సమగ్రంగా నివేదిక ప్రణాళికలతో సిద్ధం చేయాలి..**
**కలెక్టర్ పి ప్రశాంతి అధికారులకు దిశ నిర్దేశం..**



**రాజమహేంద్రవరం, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలోని 38 ప్రాధాన్యత శాఖలకు నిర్దేశించిన లక్ష్యాలు, ఆయా శాఖల కార్యకలాపాల్లో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిర్దేశించిన ప్రధాన పనితీరు సూచికలను అనుసరించి నివేదికలు సిద్ధం చెయ్యాలని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి ఆదేశించారు. కలెక్టర్ల కాన్ఫరెన్స్ నేపథ్యంలో స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా అధికారులకి, కలెక్టర్ సమావేశమై పలు సూచనలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి శాఖకు సంబంధించి రాష్ట్ర జిల్లా స్థాయిలో నిర్దేశించిన ప్రధాన పనితీరు సూచికల ఆధారంగా సమగ్ర నివేదికలను సిద్ధం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి నిర్దిష్ట పట్టికలను ఆయా శాఖాధిపతులకు పంపడం జరిగిందని వాటిలో నివేదికలు సిద్ధం చేసి మంగళవారం సమీక్ష చేసే సమయానికి అందజేయాలని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నిర్వహించే కలెక్టర్ల సమావేశంలో విశ్లేషించే అంశాల ఆధారంగా జిల్లా శాఖల అధికారులకు నిర్దేశించిన సంక్షేమ అభివృద్ధి పథకాలు సంబంధించి సమగ్ర నివేదికను సిద్ధం చేయాలన్నారు. నివేదికలను సమర్పించే క్రమంలో ప్రాధాన్యత అంశాలు వాటిని అమలుపరిచే విధానం సంబంధించి నివేదికల సమకలియక తప్పనిసరి అని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్యత కార్యక్రమాల అమలు తీరు, అందుకు క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన ప్రణాళికల ఆధారంగా నివేదిక సిద్ధం చేయాలన్నారు. జిల్లా స్థాయిలో వివిధ శాఖల పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్ ఉన్న అంశాలపై కూడా నివేదికను పిపిటి లో పొందు పరచడం ముఖ్యం అన్నారు. సంక్షిప్తంగా, సమగ్రంగా, స్పష్టత కలిగి నివేదికల రూపకల్పన చెయ్యాలని కలెక్టర్ ప్రశాంతి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పాలసీ నిర్ణయం తీసుకోవలసిన అంశాలు, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయవలసిన నిధులు అనుమతులు తదితర అంశాల తో కూడి సమగ్ర నివేదిక రూపొందించాల్సి ఉంటున్నారు.ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలు సంక్షేమ పథకాల అమలు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రధాన పనితీరు సూచికలు ఆధారంగానే నివేదిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొంటూ, చెప్పవలసిన విషయం ఖచ్చితత్వం కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, డిఆర్ఓ టి సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ( గెయిల్ )ఎం రాజా రమేష్ (ప్రేమ్ కుమార్, ఎస్ డి సి (ఓ ఎన్ జీ సీ) పి భాగ్యవతి, సిపిఓ ఎ అప్పలకొండ, డి ఎస్ డి ఓ లు పి. వీణా దేవి, ఏ. స్లీవా రెడ్డి , ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ అర్జీదారులకు భోజన సౌకర్యం కల్పించిన కలెక్టర్..

**బాపట్ల, మార్చి 17 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా పేద ప్రజల సమస్యలు తీర్చడమే కాకుండా వారి ఆకలిని తీర్చే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి చేపట్టారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ%శీ%లో సమస్యలు విన్నవించు కోవడానికి వచ్చే అర్జీదారులకు జిల్లా కలెక్టర్ భోజన సౌకర్యాలను కల్పించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి దాదాపు రెండు మూడు వందల మంది ప్రతి సోమవారం వస్తూ ఉంటారు. ప్రజా సమస్యలపై సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల సమస్యలను చూసి చలించిన జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ కు వచ్చే అర్జీదారులకు భోజన సౌకర్యాలు కల్పించాలనే ఆలోచనకు రూపకల్పన చేశారు. అందులో భాగంగా సోమవారం జిల్లా కలెక్టరేట్లో దాదాపు 200 మందికి అర్జీదారులకు భోజన సౌకర్యాలను అక్షయ పాత్ర ద్వారా భోజనం తయారు చేయించి అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## హోంగార్డుల సంక్షేమానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కట్టుబడి ఉంది..

**జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్..**
**చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలు..**



**ఏలూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఏలూరు జిల్లా లో పనిచేస్తూ అనారోగ్య కారణాలతో చనిపోయిన హోంగార్డు కుటుంబాలకు కారుణ్య నియామక పత్రాలను ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివ కిషోర్ అందజేశారు. ఏలూరు జిల్లా హోంగార్డు ఆర్గనైజేషన్లో సేవలందిస్తూ పరమపదించిన హోంగార్డుల కుటుంబాలను ఆదుకునేలా, వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలను ఎస్పీ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం అందజేశారు. హోంగార్డులు సేలం దుర్గాప్రసాద్ సతీమణి సేలం దుర్గకు, పెదపాటి సత్యనారాయణ భార్య పి. అనితకు, వి.ఐ.ఎం. కిషోర్ బాబు కుమారుడు నిఖిల్ సాయికుమార్ లకు హోంగార్డ్ నియామక పత్రాలను ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి జిల్లా పోలీస్ యంత్రాంగం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, వారి కుటుంబ సభ్యులకు అన్ని లభ్యమయ్యే ప్రయోజనాలను ఇప్పటికే అంద చేశామని తెలిపారు.నియామక పత్రాలను అందుకున్న వారి భర్తలు పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేసిన సేవలను కొనియాడుతూ, నియామక పత్రాలు పొందిన వారు ప్రజలకు మరింత సేవలందించాలని ఎస్పీ సూచించారు. హోంగార్డు డిపార్ట్మెంట్లో పనిచేసే ప్రతి ఒక్కరు భవిష్యత్తులో మరింత ఉత్సాహంతో సేవలు అందించాలని, వారి సంక్షేమానికి పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని ఎస్పీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

## పాయకరావుపేటలో 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద డ్రోన్లతో నిఘా..



**పాయకరావుపేట, మార్చ్ 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** అనకాపల్లి జిల్లాలో సోమవారం ప్రారంభమైన 10వ తరగతి పరీక్షల నేపథ్యంలో, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు పాయకరావుపేట పోలీసులు డ్రోన్ల సహాయంతో నిఘా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు చేపట్టడంతో పాటు 144 సెక్షన్ను అమలు చేశారు. పాయకరావుపేట ఎస్.హెచ్.ఓ జి.అప్పన్న ఆధ్వర్యంలో శ్రీ ప్రకాశ్, కనోస, పాయకరావుపేట జెడ్పీహెచ్ గర్ల్స్, జెడ్పీహెచ్ హైస్కూల్ వంటి ప్రధాన పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్లను వినియోగించి నిఘా ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ కఠినంగా అమలు చేశారు. అనుమతి లేని వ్యక్తుల పరీక్ష కేంద్రాల వద్దకు రాకుండా గట్టి చర్యలు చేపట్టారు. ప్రత్యేక బృందాలు పరీక్ష కేంద్రాల పరిసరాల్లో నిఘా ఉంచారు. పరీక్ష కేంద్రాలు వద్ద జిరాక్స్,ప్రింటింగ్ సెంటర్లను మూసి వేయించారు.

## ఏలూరు పిజిఆర్ఎస్ కు 54 ఫిర్యాదులు..



**ఏలూరు, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ అడ్మిన్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ "ప్రజలు తమ సమస్యలను పోలీస్ శాఖకు స్వేచ్ఛగా తెలియజేయడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని అన్నారు. ఫిర్యాదులపై వేగంగా విచారణ జరిపి, చట్టపరంగా న్యాయం అందించేందుకు జిల్లా పోలీసు శాఖ కట్టుబడి ఉన్నారన్నారు. ఏలూరు పోలీస్ పి జి ఆర్ ఎస్ కు 54 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదారులతో ఏ ఎస్ పి ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదారులు అందజేసిన అర్జీలపై సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజల కోసం ఏలూరు శ్రీ సత్య సాయి సేవా సంస్థ సహకారంతో ఉచిత భోజన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ఏర్పాటు చేశారు.

## కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పరామర్శించిన చాట్రాతి ప్రసాద్

**"జీలుగుమిల్లి బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు.**



**ప్రజాజ్యోతి న్యూస్, జీలుగుమిల్లి** కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మను భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ ఆదివారం భీమవరం లోని ఆయన స్వగృహంలో పరామర్శించారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఇటీవల ఢిల్లీలో జరిగిన కారు ప్రమాదంలో స్వల్పంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో మండల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబుతో కలిసి చాట్రాతి కేంద్ర మంత్రి వర్మని పరామర్శించి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బిజెపీ ప్రాంతపు ప్రజలకు అందదండలు అందించాలని, పార్టీని బలోపేతం చేయడం కోసం మీ వంతు సహకారం చేయాలని కోరారు.

# గ్రామ సచివాలయాల ద్వారా జరిగే సర్వే లు వేగవంతం చేయాలి..



జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాలు..

**బాపట్ల, మార్చి 17 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహించే సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ లను జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నుండి అన్ని మండల ఎంపీడీఓ లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. గ్రామ సచివాలయాల ద్వారా నిర్వహించే పలు సర్వేలపై ఎంపీడీఓ లను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. సర్వేలను పూర్తిస్థాయిలో పారదర్శకంగా, అంకితభావంతో పూర్తిచేసే విధంగా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆయన అన్నారు. సర్వేలను 100 శాతం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అంగన్ వాడి సిబ్బంది, ఏఎన్ఎం ల సమన్వయంతో ఆరు సంవత్సరంలోపు ఉన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని అన్నారు. సచివాలయ సిబ్బంది సెక్రటరీలతో సమన్వయంతో పని చేసే విధంగా చూడాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉన్నా కూడా ఆధార్ చేయించకపోవడం గల కారణాలపై కలెక్టర్ ఆరా తీశారు. వెంటనే ఆధార్ నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ లను ఆదేశించారు. పాఠశాలల తనిఖీల సర్వేలో ఎక్కువ మండలాలు తనిఖీ చేయుటలో వెనుకబడి ఉన్నాయని, ఆ సర్వేను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీలో ఐ వి ఆర్ ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై ఎంపిడిఓ లకు జిల్లా కలెక్టర్ సూచనలు చేశారు. పింఛన్ పంపిణీలో ఐవీఆర్ఎస్ ద్వారా ఒక వెయ్యి 125 మంది లబ్ధిదారుల నుండి ప్రతికూలంగా ప్రజాభిప్రాయం వచ్చిందని ఆయన అన్నారు. ఈ ఫిర్యాదులను మండలాల వారీగా విభజించడం జరిగిందని అన్నారు. ఈ ఫిర్యాదులపై పర్యవేక్షణకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించినట్లు చెప్పారు. అధికారులు ఇచ్చే నివేదికలను ఎంపీడీఓ లు ఈనెల 20వ తేదీలోపు అందజేయాలని అన్నారు. వాటి ఆధారంగా సిబ్బందికి కౌన్సిలింగ్ ఇవ్వనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. పింఛన్ పంపిణీలో సిబ్బంది అవినీతికి పాల్పడ్డారని తెలిస్తే అలాంటి వారిపై నిబంధన మేరకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. మండలాలలో సచివాలయ సిబ్బంది బయో మెట్రిక్ ద్వారా హాజరు వేయడం లేదని జిల్లా కలెక్టర్ తెలిపారు. సిబ్బంది అందరూ బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని అన్నారు. హాజరు నమోదులో జిల్లా వెనుకబడి ఉందని ఆయన తెలిపారు. ఏప్రిల్ నెల నుండి జీతభత్యాలు బయోమెట్రిక్ హాజరు ఆధారంగా చెల్లించబడతాయని ఆయన తెలిపారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఉదయం మరియు సాయంత్రం రెండు పూటలా బయోమెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఉన్న విభిన్న ప్రతిభావంతులకు కావలసిన ఉపకరణాల పై సర్వే చేయాలని ఎంపీడీవో లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ సిబ్బందిని ఇంటింటికి పంపి సర్వే చేయాలని తెలిపారు. ఈ సర్వే ను సోమవారం మొదలుపెట్టి శుక్రవారం నాటికి పూర్తి చేసి నివేదిక అందజేయాలని తెలిపారు. ఆ నివేదికల ప్రకారంగా వారికి కావలసిన ఉపకరణాలు అందజేసి వారి ముఖంలో చిరునవ్వును చూడాలని ఆయన అన్నారు.గ్రామ సచివాలయము మరియు వార్డు సచివాలయం సిబ్బంది చేసే సర్వేలు రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. సర్వే నివేదికలను రాష్ట్ర ముఖ్య మంత్రి పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. సిబ్బంది సర్వేలను పూర్తిస్థాయిలో చేసే విషయంలో ఎంపిడిఓలు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు.కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి పద్మ, బాపట్ల డి.ఎల్.డి.ఓ విజయలక్ష్మి, చీరాల డి ఎల్ డి ఓ పద్మావతి, వీక్షణ సమావేశం ద్వారా అన్ని మండలాల ఎంపిడిఓలు పాల్గొన్నారు.

# ఘనంగా కొల్లూరి దుర్గ ప్రసాద్ మూడవ వర్ధంతి వేడుకలు





178 యువకులకు ఉచిత వస్త్రాలు పంపిణీ.

**ప్రజాజ్యోతి న్యూస్, జీలుగుమిల్లి** కొల్లూరి దుర్గ ప్రసాద్ మూడవ వర్ధంతి సందర్భంగా ఆయనకు కుటుంబ సభ్యులు కొల్లూరి అబిమానులు జీలుగుమిల్లి టీ నర్సాపురం జంగారెడ్డిగూడెం మండలాలకు చెందిన యువకులు ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సోమవారం కొల్లూరి దుర్గ ప్రసాద్ మూడో వర్ధంతిని పురస్కరించుకొని జీలుగుమిల్లి మండలం లక్ష్మీపురం కొల్లూరు గెస్ట్ హౌస్ నందు వర్ధంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గ్రామ ఉపసర్పంచ్ కేతిరెడ్డి రాఘవరెడ్డి మాట్లాడుతూ మరణం అనేది మనిషికి ఏదో ఒక రోజు ఉంటుంది అని ఆ మరణం మంచి మనుషులకు ఒక రోజు ముందుగా వస్తుందని ప్రసాద్ మరణం కుటుంబానికి తీరని లోటని తండ్రి కొల్లూరి రాంబాబు తన జీవితంలో అనేకమందికి సహాయం చేయడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి, అనే భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలకు సహాయం చేయడం కుటుంబ ఆర్థిక పరిస్థితులను గమనించి ఆర్థికంగా ఆదుకోవడం ఇవే కాకుండా అనేక సేవా కార్యక్రమాలు చేసి ప్రజలకు అభిమానులకు పిలిస్తే పలికే వ్యక్తిగా ముందుకు నడవడం నడిపించడం కొల్లూరి రాంబాబు కున్న మంచి లక్షణం అని ఈరోజు తన కుమారుడు వర్ధంతి వేడుకలలో ఈ మూడు మండలాలలో ఉన్న యువకులకు వస్త్ర దానం చేయడం చాలా గొప్ప కార్యక్రమమని ప్రసాద్ మరణించడం చాలా బాధాకరమని అన్నారు. అనంతరం కొల్లూరి రాంబాబు కుటుంబ సభ్యులు సహచర నాయకుల సమక్షంలో వారి చేతుల మీదుగా టీ నర్సాపురం, జీలుగుమిల్లి జంగారెడ్డిగూడెం, మండలాలకు చెందిన పెండ్లి కానీ 150 మంది యువకులకు వస్త్ర దానం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల చౌదర్ రెడ్డి, పైడిమర్ల జగన్ మోహన్ రెడ్డి, దుర్గా రెడ్డి, కుమ్మరపల్లి ప్రకాశం, పిల్ల గొల్ల శ్రీను, డాక్టర్ చక్రవర్తి, నవాబ్ ఖాన్, గుర్రాల సురేష్, కొండపల్లి రామారావు, కొండపల్లి రమేష్, పోలవరం వైసీపీ నాయకులు నాగరాజు కొల్లూరు కుటుంబ సభ్యులు అభిమానులు యువకులు తదితరులు పాల్గొని కొల్లూరు ప్రసాద్ కు ఘనంగా నివాళు లర్పించారు.

# మార్క్ఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు కు చర్యలు..





జిల్లా కలెక్టర్ వెంకట్ మురళి..

రైతుల సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం..

కలెక్టరేట్ కొచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలి..

**బాపట్ల, మార్చ్ 17 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** జిల్లాలో మిర్చి పంటను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు పండించిన మిర్చి పంటను కొనుగోలు చేయాలని రైతులు అర్జీ ఇచ్చారన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ప్రజల నుండి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించ డానికి తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను గడువులోగా పరిశీలించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిష్కరించిన అర్జీలను అప్లోడ్ చేయాలని ఆయన అన్నారు. గ్రామ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పరిష్క రించిన అర్జీలను అర్జీదారులు సంతృప్తి చెందారలేదని విషయాలను తెలుసుకొని వాటిని ప్రభుత్వానికి ఫీడ్ బాక్ రూపంలో ఇవ్వాలని అన్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న మిస్సింగ్ ఎంప్లాయ్ డేటాలో ఉద్యోగుల వారి కుటుంబాల వివరాలను వెంటనే అప్లోడ్ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలులో వచ్చిన అర్జీలు అన్నిటిని కూడా పంచాయతీ కార్యదర్శి లాగిన్ లో చెక్ చేసుకోవాలని ఆయన చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పదవి విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులు తమ సమస్యలు తమకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలను ఇప్పించ వలసిందిగా కోరుచు అర్జీ ఇచ్చారన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ ప్రభుత్వానికి రిటైర్ ఉద్యోగుల సమస్యలపై నివేదికను ఇస్తామని ఆయన చెప్పారు. జిల్లాలో జర్నలిస్ట్ యూనియన్ పాత్రికేయులకు ఇంటి స్థలాలు కేటాయించా లని జిల్లా కలెక్టర్ అర్జీ ఇచ్చారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ రెవెన్యూ అధికారులకుభూములు పరిశీలించ వలసిందిగా ఆదేశాలు ఇచ్చామన్నారు. ఈ సందర్భంగా 8మందివిభిన్న ప్రతి భావంతులకు35 వేల రూపాయల విలువైన ల్యాప్ టాప్ లను జిల్లా కలెక్టర్ పంపిణీ చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా అధికారులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేశారు. నాటు సారా నిర్మూలన కార్యక్రమంలో భాగంగా నాటు సారా సేవించడం ఆరోగ్యాని కి హానికరం నాటు సారా రహిత ఆంధ్ర ప్రదేశ్ అని వాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్ ,బాపట్ల రెవిన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, జిల్లా ఎక్సైజ్ శాఖ సూపర్ంటెంట్ దేవదత్తు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ పద్మజ, జిల్లా మహిళాశిశు సంక్షేమ శాఖ అధికారి రాధా మాధవి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా,గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై. వెంకటేశ్వరరావు, జిల్లా పౌర సరఫరాల అధికారి విలియమ్స్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హై కోర్టు తీర్పు ప్రకారం పంచాయతీలకు పనులను కేటాయించాలి

- కొనుగోలు చేయని ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి
- తానేం పంచాయతీలో అక్రమ రోడ్డు నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి
- పలు సమస్యలపై గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ కు చింతాడ రవి పిర్యాదు



**శ్రీకాకుళం ( ఆమదాలవలస ), ప్రజా జ్యోతి న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శ్రీకాకుళం జిల్లాలో జరుగుచున్న వివిధ రకాల పనులు గ్రామ పంచాయతీలకు కనీసం 50 శాతం కు తక్కువ కాకుండా కేటాయించాలని ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ అన్నారు. పలు సమస్యలపై సోమవారం నాడు జిల్లా కలెక్టర్ కు గ్రీవెన్స్ లో ఆయన పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ హై కోర్ట్ వారు పిటిషన్ నెం 28172/2024లో ఇచ్చిన తీర్పు ప్రకారం శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ పథకంలో పనులు 50 శాతానికి తక్కువ కాకుండా వెంటనే అమలు చేయవలసిందిగా కోరారు.ఆమదాలవలస నియోజకవర్గ పరిధిలో నాలుగు మండలాల్లో ఇంకా కొనుగోలు చేయని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. అలాగే ధాన్యం కొనుగోలు లో దళారుల ప్రమేయం ఎక్కువగా ఉన్నందున రైతాంగం నష్టపోతున్నారని, అందువలన దళారుల పై చర్యలు తీసుకోవాలన్నారు.వీటితో పాటు పొందూరు మండలం తానేం పంచాయతీ లో వైసీపీ అనుచరుల జిరాయితీ పొలంలో టీడీపీ వాళ్ళు దౌర్జన్యంగా ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ రోడ్డు వేస్తున్నారని, అది అడిగినందుకు వైసీపీ అనుచరులపై దాడి చేస్తున్నారని, ఆ రోడ్డు పనిని వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా జిల్లాల అధికార ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ , బొడ్డేపల్లి సర్పంచ్ ప్రతినిధి బొడ్డేపల్లి రమణా రావు, పైడి నాగ భూషణ్ , పెద్దింటి రవిబాబు , బొడ్డేపల్లి ప్రసాద్ , పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని ఇసుక రీచ్ లను అడ్డుకోవాలి

- అక్రమంగా ఇసుక తరలించడం పై సమగ్ర విచారణ చేపట్టాలి
- ఎస్పీ గ్రీవెన్స్ లో పిర్యాదు చేసిన నియోజకవర్గ సమన్వయ కర్త చింతాడ రవికుమార్



**శ్రీకాకుళం ( ఆమదాలవలస ),ప్రజా జ్యోతి న్యూస్ :** ఆమదాలవలస నియోజకవర్గంలో అనుమతులు లేకుండా నడుపుతున్న అక్రమ ఇసుక రీచ్ లను అడ్డుకోవాలని వైకాపా ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయ కర్త చింతాడ రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా వందలాది లారీల్లో ఇసుక తరలిస్తున్న విషయం పై ఆయన జిల్లా ఎస్పీ గ్రీవెన్స్ లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా చింతాడ రవికుమార్ మాట్లాడుతూ ఆమదాలవలస మండలం ముద్దాడపేట, సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం వంటి అధికారిక అనుమతులు ఉన్న ఇసుక రీచ్ ల నుండి వీటితో పాటు తోటాడ, పొందూరు మండలం బొడ్డేపల్లి, సింగూరు, నెల్లిమెట్ట వంటి అనుమతులు లేని ఇసుక రీచ్ ల నుండి ప్రతి రోజూ వందలాది లారీల ఇసుక తరలిస్తున్నారని తెలిపారు.వీటిపై సమగ్రమైన విచారణ జరిపి, అక్రమార్కులపై తగు చర్యలు తీసుకుని, పైన తెలిపిన ఇసుక రీచ్ లు తక్షణమే నిలుపుదల చేయాలని ఫిర్యాదులో పేర్కొనడం జరిగిందని తెలియజేశారు. పొందూరు మండలం తానేం పంచాయతీ లో వైసీపీ అనుచరుల జిరాయితీ పొలంలో టీడీపీ వాళ్ళు దౌర్జన్యంగా ఎన్.ఆర్.ఈ.జి.ఎస్ రోడ్డు వేస్తున్నారని, అది అడిగినందుకు వైసీపీ అనుచరులపై దాడి చేస్తున్నారని, ఆ రోడ్డు పనిని వెంటనే నిలుపుదల చేయమని పిర్యాదు చేశారు.

## పట్టణ ప్రజలకు ప్రతిరోజు త్రాగునీరు అందిస్తాం

మున్సిపల్ కమిషనర్: నరసింహారెడ్డి




**బద్వేల్ మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్)** జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ప్రతిరోజు తాగునీరు అందించే లక్ష్యంతో ఈరోజు 33 వ వార్డు కోటవీధి మరియు ఒకటో వార్డ్ మిద్దెలపాలెం నందు ప్రయోగాత్మకంగా నీరు వదలడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు ప్రజా ప్రతినిధులు ఉన్నతాధికారులు సహకరిస్తే ప్రతి రోజు పట్టణ ప్రజలకు త్రాగునీరు సరఫరా చేస్తామన్నారు. పైలెట్ ప్రాజెక్టుగా మొత్తం 11 వార్డ్ లు సెలెక్ట్ చేసుకుని అందులో రెండు వార్డులలో ప్రతిరోజు త్రాగునీరు అందించామన్నారు. మిగతా వార్డ్ లలో అమలు చేయడానికి మునిసిపల్ సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారన్నారు. మునిసిపల్ కమీషనర్ మరియు మునిసిపల్ సిబ్బంది నీటిని అవసరం మేరకు పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. తరచుగా మునిసిపల్ సిబ్బంది క్లోరిన్ టెస్ట్ చేస్తూ సురక్షిత తాగునీరు అందించడం జరుగుతుందన్నారు. నీటిని అవసరం మేరకు పొదుపుగా వాడుకో వాలిని ఎవరైనా నీటిని వృధా చేస్తే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. తరచుగా నీటిని వృధా చేయడం మునిసిపల్ సిబ్బంది గమనిస్తే కుళాయి కనెక్షన్ తొలగించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి






జిల్లా కలెక్టర్ వెంకట మురళి..
అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలి..
ప్రభుత్వ ప్రామాణికాలను పరిగణలోకి తీసుకోవాలి..
పలు శాఖల పనితీరుపై కలెక్టర్ అసహనం..
అధికారులు పనితీరు మార్చుకోవాలి..
వచ్చే ఏడాది 200ఎకరాల మాడ అడవుల అభివృద్ధి లక్ష్యం..
సూర్య ఘర్ యూనిట్లు వెంటనే నెలకొల్పాలి..
అధికారులకు కలెక్టర్ దిశ నిర్దేశం..

**బాపట్ల, మార్చి 17 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** ప్రగతిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. సీఎంతో జిల్లా కలెక్టర్ల రెండో సమీక్షలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలపై జిల్లా అధికారులతో సోమవారం ఆయన సమావేశం అయ్యారు.

ప్రభుత్వ ప్రామాణికలను పరిగణనలోకి తీసుకుని అధికారులు పనిచేయాలని కలెక్టర్ చెప్పారు. అభివృద్ధి, ప్రజల సంక్షేమం ప్రామాణికంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో, చురుకుగా పనిచేస్తుందని, ఆ దిశగా అధికారులు నిబద్ధతతో పనిచేయాలన్నారు. విద్యాశాఖ, రోడ్లు భవనాలు, ఐటిఐ, మహిళా శిశు, సంక్షేమ శాఖ, మునిసిపాలిటీలలో చెత్త నిర్వహణ, వైద్య విధాన పరిషత్ శాఖలు పనితీరు సరిగా లేదని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడంలో సంబంధిత శాఖలు వెనుకబాటుపై ఆయన ఆరా తీశారు. అధికారుల పనితీరు మార్చుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నిర్లిక్తంగా ఉంటే సహించేది లేదని హెచ్చరించారు. గడువు లోగా సాధించాల్సిన ప్రగతి నివేదికలను పట్టించుకోకపోవడం సరికాదన్నారు. లోపాలను సవరించుకుంటూ అధికారులు ముందుకు సాగాలని మార్గ నిర్దేశం చేశారు. వ్యవసాయం, ఉద్యాన పంటలు, ఆక్వా అనుబంధ రంగాలలో ఉత్పత్తులు, ఆదాయం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. ప్రధానంగా సేంద్రియ వ్యవసాయం లో లక్ష్యాలు చేరుకోవడానికి రైతులను మరింత ప్రోత్సహించాలన్నారు. పంటల విస్తీర్ణం మరింత పెరగాలన్నారు. 42,864 మంది రైతుల అభ్యున్నతికి జిల్లాకు కేటాయించిన 75.80 కోట్లు నిధులు సమర్థంగా వినియోగించాలన్నారు. రైతుల వివరాల నమోదులో 72 శాతం ఉండడం ఏమిటని ప్రశ్నించారు. సూక్ష్మ బిందు సేద్యంలో 71 శాతం పురోగతిని అధిగమించాలన్నారు. ఆక్వా పార్క్ నిర్మాణంపై ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. హ్యాచరీలు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్ల నుంచి రసాయనాల ఉద్ధారాలు, వ్యర్థాలు, వృధానీటి విడుదలలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఇందుకోసం వివిధ శాఖల అధికారులను కమిటీగా నియమిస్తామన్నారు. రానున్న ఏడాదిలో 200 ఎకరాలలో మడ అడవులు అభివృద్ధి లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉచిత ఇసుక విధానంలో అక్రమాలు, అవినీతికి తావు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సూర్య ఘర్ పథకం కింద 53,105 దరఖాస్తులు రాగా తక్షణమే యూనిట్లను స్థాపించాలన్నారు. కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థుల ఆధార్ నవీకరణ ప్రక్రియ జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. ఆధార్ నవీకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏరియా వైద్యశాలల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో చెత్త సంపద కేంద్రాల నిర్వహణ సరిగా లేదన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు మెరుగుపరచాలన్నారు. చెత్త సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. ప్రతి ఇంటి నుంచే తడి పొడి చెత్త వేరు పరచడంపై ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. కుక్కల ఉత్పత్తిని నియంత్రించేలా వ్యాక్సినేషన్ ప్రక్రియ సమర్థంగా చేపట్టాలన్నారు. కుక్కలను హింసించడం వంటివి చేస్తే సహించేది లేదన్నారు. మంచం పట్టిన వ్యాధిగ్రస్తుల పింఛన్ లబ్ధిదారుల విచారణ త్వరగా పూర్తి చేయాలన్నారు. మాదకద్రవ్యాల ఉత్పత్తి, విక్రయాలపై ఉక్కు పాదం వేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాపట్ల జిల్లాలో మాదకద్రవ్యాల విక్రయాలు జరుగుతున్నట్లు ఆరోపణ వస్తున్నాయని, సమగ్ర విచారణ చేసి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అఖిలేష్ యాదవ్ డిమాండ్ ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ ప్రవేశ పెట్టాలి...

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, బాపట్లలో గ్రీవెన్స్ దాఖలు...
మేధ శ్రీనివాసరావు...



**బాపట్ల జిల్లా మార్చి 17 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** సోమవారం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో సమాజవాది పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు మేధ శ్రీనివాసరావు సహచర పార్టీ నాయకులతో కలిసి రాబోయే ఎన్నికలలో భారతదేశంలో ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ ప్రవేశపెట్టాలని గ్రీవెన్స్ దాఖ లు చేయడం జరిగింది ఈ సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో జరిగిన విలేకరులతో మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ
ప్రస్తుత లోక్ సభ సభ్యుల సంఖ్యకు సంబంధించి భారతీయ జనతా పార్టీ కాంగ్రెస్ పార్టీ తరువాత మూడవ అతిపెద్ద పార్టీ అయినటువంటి సమాజవాది పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఇటీవల లోక్ సభలో మాట్లాడుతూ తమ పార్టీ ఉత్తర్ ప్రదేశ్ లోని 80 కి 80 లోక్ సభ స్థానాలు గెలిచి నప్పటికీ ఈవీఎంల కంటే తాను బ్యాలెట్ సిస్టం మాత్రమే ఉండాలని కోరుకుంటానని లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇతర ఇండియా అలయన్స్ కూటమి సభ్యుల హర్ష ద్వాన ల మధ్య ప్రకటించడం జరిగింది మేధ శ్రీనివాసరావు మాట్లాడుతూ నాడు బిజెపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈవీఎంలు వ్యతిరేకించిన విషయాన్ని గుర్తు చేస్తూ రాజ్యసభ ప్రోత్సహిత సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఈవీఎంల సామర్థ్యానికి సంబంధించి పుస్తకం కూడా రాసిన విషయాన్ని ఉదహరించారు
అభివృద్ధి చెందిన అమెరికా ఇంగ్లాండ్ ఫ్రాన్స్ జర్మనీ తదితర దేశాలు ఈవీఎంలు ఎందుకు వాడటం లేదని ప్రశ్నించారు ఎలాన్ మస్క్ టెస్లా కంపెనీ సీఈఓ ఈవీఎంల వాడకము హై రిస్క్ తో కూడుకున్నది అని %శ% లో పోస్ట్ చేశారు
ఇన్ని అనుమానాలు మరియు హ్యాకింగ్ సంబంధించి ఆరోపణలు మొదలైనవి ఉన్న దృష్ట్యా రాబోయే ఎన్నికలలో ఈవీఎంలు రద్దుచేసి బ్యాలెట్ తో ఎన్నికలు జరిపించాలని సమాజవాది పార్టీ డిమాండ్ చేస్తున్నట్టు తెలియజేశారు
ఈ కార్యక్రమంలో సమాజవాది పార్టీ నాయకులు మోర్ల చిన్న వెంకటేశ్వరరావు కాంద్రు శరత్ కుమార్ జయ రావు జిల్లా పేగుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

# బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు..

జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరిక..
బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన 283 మందిపై కేసులు నమోదు..





**విజయనగరం, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగుపై పోలీసులు సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై 283 కేసులు నమోదు చేశారు. పట్టుబడిన మందుబాబులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. విజయనగరం జిల్లాలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఈ సందర్భంగా హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మందుబాబులపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టేందుకుగాను జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లుగా ఎస్పీ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, న్యూసెన్సు చేస్తూ, ప్రజలకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై దాడులు చేయాలని, వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించిన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా లే-అవుట్లు, గ్రామశివారు ప్రాంతాల్లోను, నగర శివారు ప్రాంతాల్లోను, బహిరంగంగా మద్యం సేవించిన వారిపై పోలీసు అధికారులు, సిబ్బంది దాడులు నిర్వహించి 283మంది పై కేసులు నమోదు చేసారు. వాహన తనిఖీలు చేపట్టిన పోలీసు అధికారులు, సిబ్బంది రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు ఈ-చలానాలను విధించారని జిల్లా ఎస్పీ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి, పట్టుబడినమందుబాబులకు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, ప్రజాశాంతికి భంగం కలిగించవద్దని సంబంధిత పోలీసు అధికారులు కౌన్సిలింగు నిర్వహించారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## నిర్వాసితుల సమస్యలు పోరాటం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు.

“ నియోజకవర్గ కన్వీనర్ - బండి విజయ్ మాట్లాడుతూ.



**(ప్రజాజ్యోతి న్యూస్) పోలవరం/జీలుగుమిల్లి** నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు పోలవరం నియోజవర్గ కోఆర్డినేటర్ బండి విజయ్ చెప్పారు. ఏపీసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి యొక్క ఆదేశాలు మేరకు పోలవరం అధ్యయన కమిటీ కొద్ది రోజులుగా ముంపు గ్రామాలలో పర్యటించటం జరిగిందని అన్నారు. అక్కడి ప్రజలు పడుతున్నటువంటి ఇబ్బందులు చాలా బాధాకరం వర్ణనాతీతం అక్కడి ప్రజలను మన రాష్ట్ర భవిష్యత్తుకు త్యాగమూర్తులుగా భావించవచ్చు వారి భూములను వారి జీవన ఉపాధిని వారు ఉన్నటువంటి ఊరిని ఉన్న ఇంటిని వదులుకొని రావడం అనేది సామాన్యమైన విషయం కాదు అటువంటి త్యాగమూర్తులను 2013లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆయన ఉదార స్వభావముతో మండలాన్ని మొత్తం ఒకే యూనిట్ గా తీసుకునేలా కేంద్రం మెడలు వంచి జీవోని పాస్ చేయడం జరిగింది. అయితే తర్వాత వచ్చినటువంటి టిడిపి ప్రభుత్వం వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం కూటమి ప్రభుత్వాలు నిబంధనలను తుంగలో తొక్కుతూ నియంత పరిపాలనతో అడ్డదిడ్డమైనటువంటి సర్వేలను మొదలుపెట్టి 41,45 గా విభజనలు చేసి పోలవరం అనేది రాష్ట్రానికి వరమైతే మనకి శాపం అనుకునేలా అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వీటి అన్నిటి మీద కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు కూటమి ప్రభుత్వ%శీ% యొక్క వైఫల్యాలను ఎండగడుతూ ముంపు గ్రామాల సమస్యలను దేశ ప్రజలకు వెల్లడించటం జరుగుతుంది. దీనిని కప్పిపూచేందుకు కూటమి ప్రభుత్వం నామకర్థపు గ్రామసభలను ఏర్పాటు చేసి కొన్ని గ్రామాలను 41 లో చేర్చుతాం అంటూ పత్రిక ప్రకటనలు చేసుకుంటున్నారు. అయితే ఏ సర్వే ఆధారంగా ఈ గ్రామాలను 41 లోకి తీసుకుంటున్నారు,మిగిలిన గ్రామాలను కూడా ఎప్పుడు తీసుకుంటారు అనేది వారికి ఇవ్వవలసినటువంటి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీని ఏ డేట్ కి ఇస్తారనేది ముంపుగ్రామ ప్రజలకు కూటమి ప్రభుత్వం వివరణ ఇవ్వవలసి ఉంది. ముంపు గ్రామ ప్రజలకు పూర్తి న్యాయం జరిగే వరకూ కాంగ్రెస్ పార్టీ పోలవరం అధ్యయన కమిటీ పోరాటం చేస్తుందని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. త్వరలోనే రాష్ట్రంలో ఏఐసీసీ అధ్యక్షురాలు పర్యటన ఉంటుందని అన్నారు.

## జిల్లా పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో 71 ఫిర్యాదులు..



**కాకినాడ, మార్చి 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుంచి జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమమునకు 71 మంది ఫిర్యాదుదారులు హాజరై తమ సమస్యలను జిల్లా ఎస్పీకి స్వయంగా తెలియజేసుకున్నారు. ప్రజల నుండి జిల్లా ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీస్ అధికారులతో నేరుగా మాట్లాడి, సకాలంలో సమస్యలు పరిష్కరించవలసిందిగా ఆదేశాలు ఇచ్చారు. జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు జిల్లాలోని పోలీస్ స్టేషన్లలోను, సర్కిల్ కార్యాలయాలలోను, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చునని, ఆ ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో సత్వర న్యాయం చేస్తామని ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం జె వి భాస్కరరావు (పరిపాలన)పాల్గొన్నారు.

## అసెంబ్లీలలో గళం విప్పిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు.

’వంద పడకల హాస్పిటల్స్ నిర్మాణం పున ప్రారంభించాలీ ఏజెన్సీ ప్రాంతాలలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు డిమాండ్ చేశారు.

**ప్రజాజ్యోతి న్యూస్, జీలుగుమిల్లి**



ఏజెన్సీ ప్రాంతపు ప్రజల ప్రాణాలను నిలబెట్టండి వారిపై గతిన హాస్పిటల్ నిర్మాణం చేపట్టాలని పోలవరం శాసనసభ్యులు బాలరాజు అసెంబ్లీలో డిమాండ్ చేశారు. ఈరోజు జరిగిన అసెంబ్లీ సమావేశాలలో పోలవరం నియోజకవర్గం లో వంద పడకల హాస్పిటల్స్ నిర్మాణం చేపట్టాలని మరియు మంచి డాక్టర్లను నియమించాలని గౌరవ స్పీకర్ వారి నుండి గవర్నమెంట్ ను కోరిన పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు డిమాండ్ చేశారు. అమరావతి అసెంబ్లీ సమావేశాలలో పోలవరం నియోజకవర్గం ఏజెన్సీ ప్రాంతాలలో సరైన వైద్య సదుపాయం లేక అనేక ఇక్కట్లు పడుతున్నారని, వారికి అందుబాటులలో గత ప్రభుత్వంలో అనగా కొయ్యలగూడెం మండలం, బుట్టాయిగూడెం మండలం, టీ నర్సాపురం మండలలో నిర్మాణం ప్రారంభించి బేస్మెంట్ వరకే అయిన పరిస్థితి, కొన్నిటికి అవి కూడా లేని పరిస్థితి. ఏదేమైనాప్పటికీ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు నలిగిపోతున్నారు, ఆ ఇబ్బందిని గుర్తించి త్వరితగతిన వంద పడకల హాస్పిటల్స్ నిర్మాణం పున ప్రారంభించాలని, అలాగే సరైన వైద్యనిపులను నియమించాలని అసెంబ్లీలలో గళం విప్పిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు .

# బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి..

**జిల్లా ఎస్పీ వకుల్ జిందల్..**

**విజయనగరం, మార్చ్ 17 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో బాధితులు అందజేసిన ఫిర్యాదులపై తక్షణమే చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం నిర్వహించారు. సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుండి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ 32 ఫిర్యాదులను స్వీకరించారు. స్వీకరించిన ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 10, కుటుంబ కలహాలకు సంబంధించినవి 7, మోసాలకు పాల్పడినట్లు 8, ఇతర అంశాలకు సంబంధించినవి 7 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. నంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవమైనట్లయితే చట్ట పరిధిలో చర్యలుచేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, విచారణ చేపట్టి, 7దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదించాలని అధికారులను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, డిసిఆర్బి ఎస్ఐ రాజేష్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.




# డాక్టర్ కృష్ణంరాజుకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డ్

**కాకినాడ జిల్లా ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ ఏలేశ్వరం :** ప్రాచీన వైద్యనిపుణులు, మినియేచర్ ఆవుల సృష్టికర్త కాకినాడకి చెందిన డా?పి.కృష్ణంరాజుని మరో ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించింది.ఫెడరేషన్ ఆఫ్ తెలుగు ఆసోషియేషన్ ఆఫ్ మహారాష్ట్రవారు కృష్ణంరాజుని పుంగనూరు గో రక్షక్ అవార్డుతో సత్కరించారు.విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మార్చి 16 ఆదివారం జరిగిన సభలో సినీ కథానాయకుడు సుమన్ చేతుల మీదుగా కృష్ణంరాజు ఈ పురస్కారాన్ని అందుకున్నారు.ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధనకోసం ఆమరణ నిరాహారదీక్షచేసి అసువులు బాసిన అమరజీవి పొట్టిశ్రీరాములు జన్మదిన సందర్భంగా నిర్వహించిన ఈ సభకి ఆంధ్రప్రదేశ్ ఉపసభాపతి కనుమూరి రఘురామకృష్ణంరాజు అధ్యక్షత వహించగా హీరో సుమన్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.తెలంగాణ,ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలలో తెలుగు కమ్యూనిటీ,కల్చర్,కామర్స్ రంగాల అభివృద్ధికోసం టి.ఏ.ఎం.సి.సి.ఐ. వారధి చేస్తున్న కృషిని రఘురామ ప్రస్తుతించారు.దేశంలోనే పుంగనూరు ఆవుల పోషణ, అభివృద్ధి కోసం దశాబ్దకాలంగా పని చేస్తున్న డాక్టర్ కృష్ణంరాజుని ఉపసభాపతి అభినందించారు.నాడీపతి రీసెర్చ్ ఫౌండేషన్ స్థాపించిన డాక్టర్ కృష్ణంరాజు ఆవులపై పరిశోధన చేసి ప్రతిపాదించిన ఆవుతో ఆలింగనం 'కౌ హగ్గింగ్' విధానం ప్రస్తుతం ప్రపంచమంతటా వైరల్ గా మారింది.ఆవు హగ్గింగ్ వెనుక చాలా సైన్స్ ఉంది. మనం ఆవులను కౌగిలించుకున్నప్పుడు, మన మెదడు ఆక్సిటోసిన్, డోపమైన్ మరియు సెరోటోనిన్ అనే హ్యాపీ హార్మోన్లను విడుదల చేస్తుంది.తద్వారా మానసిక స్థిరత్వం,ఆనందం, ఆత్మవిశ్వాసం మనలో మెరుగుపడతాయి.ప్రస్తుతం భారతదేశంలో అంతరించిపోయే దశలో ఉన్న, పుంగనూరు జాతి ఆవులని తమ నాడీపతి గోశాలలో డాక్టర్ కృష్ణంరాజు అభివృద్ధి చేసి రైతులకి అందించి వారికి మేలు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన స్వంత జాతి ఈ పుంగనూరు ఆవు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం లింగపర్తిలో డాక్టర్ కృష్ణంరాజు స్థాపించిన నాడీపతి గోశాలలో,ఏప్రాంతంలోనూ, ఎవరిదగ్గరా లేనన్ని మూడువేలకి పైగా పుంగనూరు ఆవులని పోషిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు.ఇంటికి దూరమై, మనిషికి భారమైన ఆవుమీదకి జనం మనస్సు మళ్లీ మళ్లేలా కృష్ణంరాజు పుంగనూరు ఆవులనుంచి మినియేచర్ ఆవు జాతిని అభివృద్ధిచేసి, ప్రధానమంత్రి నరేంద్రమోడీ మొదలుకుని దేశంలోని అన్నిరంగాల ప్రముఖుల నుంచీ అభినందనలని అందుకున్నారు.ఈ సభలో ఎన్.టి. ఆర్. జిల్లా కలక్టర్ లక్ష్మీషా,ఎఫ్.టి.ఎ.ఎమ్. అధ్యక్ష,కార్యదర్శులు గంజి జగన్ బాబు, కంటే అశోక్,పలువురు కవులు కళాకారులూ, నగరప్రముఖులూ ,మూడు రాష్ట్రాలకి చెందిన ఫెడరేషన్ సభులూ పాల్గొన్నారు.





# సూపర్ సిక్స్ పథకాల అమలులో ఘోరంగా విఫలమైన కూటమి ప్రభుత్వం-

**సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ విమర్శ**

**బద్వేల్ మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్)** ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలులో ఘోరంగా విపలమైందని, గత ప్రభుత్వ విధానాలనే కొనసాగిస్తూ పథకాల విషయంలో నిధుల కొరత ఉందని సాకులు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నదని, తక్షణమే ఎటువంటి ఆంక్షలు లేకుండా ప్రభుత్వ పథకాలను రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి వర్తింపజేసి ప్రజల పట్ల తమకున్న నిబద్ధతను నిజాయితీని నిరూపించుకోవాలని లేని పక్షంలో ప్రజాగ్రహం చవిచూడాల్సిన దుస్థితి కూటమి ప్రభుత్వానికి ఏర్పడుతుందని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు సంగటి చంద్రశేఖర్, చంద్రమోహన్ రాజులు డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం వారి పార్టీ కార్యాలయంలో జకరయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం జనసేన బిజెపి లతో కూడిన కూటమి ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా అనేక హామీలు ఇచ్చిందని వాటిలో ప్రధానంగా సూపర్ సిక్స్ పథకాలు పింఛన్ పెంపు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచితం బస్సు ప్రయానం, తల్లికి వందనం, 18 సంవత్సరాల పైబడిన వారికి నెలకు 1500 చొప్పున ఇస్తామని ఇలాంటి పథకాలు ప్రకటించి పేద మధ్యతరగతి ఓట్లను గుంజుకొని నేడు నిధులు లేవు రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదు ప్రజలు అర్థం చేసుకోవాలి అనే మోసపూరిత మాటలు చెప్పడం కూటమి ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని వారు విమర్శించారు. నేడు ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా నూతన రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తూ తమకేమీ పట్టనట్లు జాప్యం చేస్తూ నేడు లబ్ధిదారులు అందరికీ ఎన్టీఆర్ గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించడం హాస్యాస్పదమని వారు విమర్శించారు. అలాగే ఇచ్చిన ఉచిత సిలిండర్ల పథకంలో ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తాం సిలిండర్ బుక్ చేసుకున్న వెంటనే సబ్సిడీ మీ అకౌంట్లో పడుతుందని మాయమాటలు చెప్పి గత ప్రభుత్వం ఇష్టారాజ్యంగా నమోదు చేసిన ఆంక్షలు యధాతిధిగా కొనసాగించడం ఎంతవరకు సమంజసమని, కూటమి ప్రభుత్వం చెప్పే విధానం చెప్పేది శ్రీరంగనీతులు దూరేది ఇంకో గుడిసెలు అనే రీతిలో ఉందని వారు ఘాటుగా విమర్శించారు. అలాగే గత ప్రభుత్వం ఇచ్చిన పథకంలో అనేకమంది మేము ఈ కొండ ప్రాంతాలకు ఎక్కలేము మాకు ఈ స్థలం అక్కర్లేదు ఇంకోచోట ఎక్కడైనా ఇవ్వండి అంటూ బద్వేల్ నియోజకవర్గంలో వేలాదిమంది ప్రజలు ప్రభుత్వం తమకు ఇచ్చిన పట్టాలను తిరిగి ఇవ్వడం జరిగిందని వారి యొక్క వివరాలను ఆన్లైన్లో తొలగించకపోవడంతో వారందరూ నేటి ప్రభుత్వ పథకమైన ఎన్టీఆర్ గృహాలు లబ్ధిదారులకు దూరమయ్యారని ఇది ప్రభుత్వ తప్పిదం కాదా? రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కాదా అని వారు ప్రశ్నించారు. తక్షణమే రకరకాల పేరుతో మాయ మాటలు చెబుతూ ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో జాప్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి నీటి మీద రాతలు రాయడం మాని తక్షణమే ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని లేని పక్షంలో క్షేత్రస్థాయిలో ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు చంద్రమోహన్రాజు, జకరయ్య. నియోజకవర్గ నాయకులు రామరాజు. బాబు. విజయరావు. విద్యార్థి సంఘ నాయకులు అనిల్. శివరాం. పట్టణ నాయకులు బాబు, మెరుగు చెన్నయ్య. జయపాల్ చంద్రపాల్ నారాయణ శాంసన్ గాయాల చెన్నయ్య. లక్ష్మయ్య. అబ్రహం. గుర్రప్ప. తదితరులు పాల్గొన్నారు.



## చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే వేగేశన..



**బాపట్ల, మార్చ్ 17 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** వేసవికాలంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలు ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోపాత బస్టాండ్ వద్ద చంద్రపాటి సత్యనారాయణ రంగనాయకమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు చంద్రపాటి వెంకట రామమోహన్ రావు (రాంబాబు) ఉదయలక్ష్మిలు ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రుల పేరుట వారి జ్ఞాపకార్థం చంద్రపాటి రామ్మోహన్రావు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం పట్ల అభినందించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు బూర్లె రామసుబ్బారావు,జిట్టా శ్రీనివాసరావు,ఆర్.టి.సి డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ,ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు కొత్తమాసు సత్యనారాయణ,వక్కల గడ్డ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సహృదయ భావనతో వ్యవహరించిన ఎస్పీ



**బాపట్ల జిల్లా మార్చి 17 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** నిర్దేశించిన గడువులోపు సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పిజిఆర్యస్ కార్యక్రమాన్ని ఎస్పి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా నలబల నుండి ప్రజలు విచ్చేసి 54 మంది అర్జీ దారులు తమ సమస్యలను ఎస్పీకి విన్నవించుకున్నారు. బాపట్ల జిల్లా అమర్తలూరు మండలంకు చెందిన 60 సంవత్సరాల వయస్సు కలిగిన శంకర్ కుమార్ అను వ్యక్తి కాలికి ఇన్ఫెక్షన్ వల్ల గాయాలు ఏర్పడి నడవడానికి ఇబ్బంది పడుతు తన సమస్యను చెప్పుకోవడానికి జిల్లా ఎస్పీ కార్యాలయానికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఎస్పీ స్వయంగా అతడి వద్దకే వెళ్ళి అతడి సమస్యను అడిగి తెలుసుకొని త్వరితగతిన సమస్య పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎంతో భాదతో వారి సమస్యల పరిస్కారం కోసం పోలీస్ కార్యాలయాలకు వస్తుంటారని, వారితో మర్యాద పూర్వకంగా వ్యవహరించి సహృదయ భావంతో మాట్లాడి వారి సమస్యలను విని వాటిని పరిష్కారం చేస్తామనే భరోసా వారికి కల్పించాలని పోలీస్ అధికారులకు తెలిపారు. అర్జీలను చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణిత గడువులోపు సమస్యలను పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, పిజిఆర్ఎస్ సెల్ ఎస్ఐ శ్రీనివాసరావు ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**బద్వేల్ మార్చి 17 (ప్రజా జ్యోతి న్యూస్)**




కడప జిల్లా %ఙా జు. +%. అశోక్ కుమార్ ఐపీఎస్ గారి ఉత్తర్వుల మేరకు మైదుకూరు డి.ఎస్.పి జి. రాజేంద్రప్రసాద్ గారి ఆధ్వర్యంలో బద్వేల్ అర్బన్ ఇన్స్పెక్టర్ %వీ%.రాజగోపాల్, %ూ×% లు %వీ%. సత్యనారాయణ, %జీ%.రవికుమార్ మరియు సిబ్బంది కలిసి బద్వేల్ టౌన్ లోని చెన్నంపల్లె ఎస్టి కాలనీ కాశి నాయన గుడి ముందర అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న బద్వేల్ టౌన్ రాజు గారి వీధికి చెందిన దండు మనోజ్ కుమార్, వల్లెల వారిపల్లి గ్రామానికి చెందిన రాజ్ కుమార్ లను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 1.5 కేజీల గంజాయి స్వాధీనం చేసుకొని రిమాండ్ కు పంపడమైనదన్నారు.నిషేధిత గంజాయి అక్రమ రవాణా గాని అమ్మకాలు గానీ వారికి సహకరించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రాజగోపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ ఎస్ఐలతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 10వ తరగతి పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు...



**బాపట్ల జిల్లా మార్చి 17 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** ప్రశాంత వాతావరణంలో జిల్లాలో పదవ తరగతి పరీక్షలు జరిగేందుకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాలతో పరీక్షా కేంద్రాల వద్ద సోమవారం జిల్లా పోలీస్ అధికారులు పట్టిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 17 నుండి 10వ తరగతి పరీక్షాలు ప్రారంభమైయ్యాయి. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ చోటు చేసుకోకుండా పరీక్షల ప్రక్రియ సజావుగా జరిగేందుకు పరీక్షా కేంద్రాలలోకి ప్రవేశించే విద్యార్థులు, విధులు నిర్వహించే ఇన్విజిలేటర్లు, సహాయ సిబ్బందిని పోలీస్ సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపించారు. సిబ్బందికి జారీ చేసిన గుర్తింపు కార్డులు, విద్యార్థుల హాల్ టికెట్ లను పరిశీలించిన తరువాతే అనుమతించడం జరిగింది. 144 సెక్షన్ అమలు చేసి పరీక్ష కేంద్రాల సమీపంలో ఎవరూ గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో చుట్టుపక్కల పరిసర ప్రాంతాల్లో పరీక్ష ముగిసేంత వరకు జిరాక్స్/ప్రింటింగ్/ఇంటర్నెట్ సెంటర్లు మూసివేశారు. కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు ముమ్మరంగా పెట్రోలింగ్ పెట్రోలింగ్ నిర్వహించారు.

# డయాబెటిస్‌కు బ్రహ్మాస్త్రం



ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం చాలామంచిది.. దీనికోసం జీవనశైలి, ఆహారంలో మార్పులు అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అలాంటి మంచి ఆహారంలో మెంతులు, మెంతి కూర ఒకటి.. దీనిలో ఎన్నో ఔషధ గుణాలు, పోషకాలు దాగున్నాయి. ప్రస్తుత కాలంలో ఎన్నో అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవడం చాలామంచిది.. దీనికోసం జీవనశైలి, ఆహారంలో మార్పులు అవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు.. అలాంటి మంచి ఆహారంలో మెంతులు, మెంతి కూర ఒకటి.. వాస్తవానికి మెంతి గింజల ప్రయోజనాల గురించి మీరు చాలాసార్లు వినే ఉంటారు.. కానీ మెంతి ఆకులు తీసుకోవడం కూడా చాలా ప్రయోజనాలు చేకూరుతాయని.. శరీరానికి చాలామంచిదని పేర్కొంటున్నారు ఆయుర్వేద నిపుణులు. మెంతికూర ఎటువంటి హాని కలిగించని ఆరోగ్యకరమైన ఆహార పదార్థం.. రోజూ మెంతి ఆకులు తినడం వల్ల శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి.. ఇవి డయాబెటిస్ ప్రమాదాన్ని కూడా తగ్గిస్తాయి.. మెంతికూర జీర్ణక్రియకు సహాయపడుతుంది.. గ్యాస్, అజీర్ణం, కడుపునొప్పు వంటి సమస్యలను తగ్గిస్తుంది.. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది.. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మెంతికూరలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. మెంతులలో మధుమేహ నిరోధక లక్షణాలు ఉన్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. సంవత్సరాలుగా, మెంతి గింజల ఔషధ లక్షణాలపై చాలా పరిశోధనలు జరిగాయి. మెంతులు యాంటీ డయాబెటిక్, యాంటీ క్యాన్సర్, యాంటీమైక్రోబయల్, యాంటీ ఫెర్టిలిటీ, యాంటీపరాసిటిక్, హైపోకొలెస్టెరోలెమిక్ లక్షణాలను కలిగి ఉన్నాయని తేలింది. మెంతులు ప్రోటీన్, ఫైబర్ గొప్ప మూలం.. దాని బయోయాక్టివ్ సమ్మేళనాల కారణంగా ఔషధంగా ఉపయోగించవచ్చు. మెంతులు అనేక ఆరోగ్య సమస్యలకు ఔషధంగా పనిచేస్తాయని పరిశోధనలో తేలింది. మధుమేహ చికిత్సకు మెంతులు – మెంతికూర: మధుమేహంలో మెంతుల ప్రయోజనాలపై కూడా పరిశోధనలు జరిగాయి. మెంతులు తినడం వల్ల టైప్ 1, టైప్ 2 డయాబెటిస్‌తో సంబంధం ఉన్న జీవక్రియ లక్షణాలను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుందని కనుగొనబడింది. దీన్ని తీసుకోవడం వల్ల రోగుల రక్తంలో చక్కెర స్థాయిలు కూడా తగ్గుతాయి. రోగి గ్లూకోజ్ స్థాయిలు గణనీయంగా మెరుగుపడతాయి.

# కళ్ళకు మేలు చేసే బెస్ట్ డ్రై ఫ్రూట్స్



కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సరైన ఆహారం తీసుకోవడం ఎంతో ముఖ్యం. రోజువారీ జీవితంలో ఎక్కువ సమయం ఫోన్లు, కంప్యూటర్ల ముందు గడిపే కారణంగా కంటి సమస్యలు పెరుగుతున్నాయి. అయితే కొన్ని ప్రత్యేకమైన డ్రై ఫ్రూట్స్, కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరిచే పోషకాలతో నిండి ఉంటాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడంలో సహాయపడతాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం, కంటి చూపును మెరుగుపరచడం చాలా ముఖ్యమైనవి. ప్రస్తుత రోజుల్లో కంప్యూటర్లు, ఫోన్లు వంటివి ఎక్కువగా ఉపయోగించడం వల్ల కంటి సమస్యలు అధికమవుతున్నాయి. కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి మనం తీసుకునే ఆహారానికి కూడా ఎంతో ప్రాధాన్యం ఉంది. కొన్ని ఎండిన పండ్లు, డ్రై ఫ్రూట్స్ ఈ విషయంలో ప్రత్యేకంగా సహాయపడతాయి. ఇవి కంటి చూపును మెరుగుపరచడానికి ఉపయోగపడే ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటాయి. జీడిపప్పు కంటి ఆరోగ్యానికి మేలు చేసే అద్భుతమైన ఆహారాలలో ఒకటి. ఇందులో జింక్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. జింక్ కంటి రెటీనా కణాలను రక్షించి వాటి క్షీణతను నివారించడంలో సహాయపడుతుంది. కంటి తేలికపాటి కాంతి గాయాలను నివారించడంలో కూడా జీడిపప్పు కీలక పాత్ర పోషిస్తుంది. రాత్రి సమయంలో కంటి చూపును మెరుగుపరచడంలో కూడా జీడిపప్పు దోహదం చేస్తుంది. ఖర్జూరాలు కంటి ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరమైనవి. ఇందులో విటమిన్ ఎ, కెరోటినాయిడ్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి చూపును పదునుపరచడంలో, రాత్రి అంధత్వాన్ని నివారించడంలో సహాయపడతాయి. ప్రతిరోజు 2–3 ఖర్జూరాలు తినడం వల్ల కంటి ఆరోగ్యం మెరుగుపడే అవకాశం ఉంది. వాల్‌నట్స్‌లో ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి చాలా అవసరమైనవి. శరీరంలో మంటను తగ్గించడం ద్వారా వాల్‌నట్స్ కళ్ళను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఇవి కంటి రక్తప్రసరణను మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. దీని వల్ల కళ్ళు శక్తివంతంగా ఉండటమే కాకుండా వయస్సుతో వచ్చే కంటి చూపు సమస్యలను కూడా తగ్గించవచ్చు. బాదం పప్పులో విటమిన్ ఇ అధికంగా ఉంటుంది. ఈ విటమిన్ కంటి కణాలను రక్షించడంలో సహాయపడుతుంది. బాదం తీసుకోవడం వల్ల వయస్సు కారణంగా వచ్చే ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. వయస్సు పెరుగుతున్నప్పుడు కంటి చూపు క్షీణించడం సహజం. అయితే బాదం వంటి పోషక ఆహారాలు ఈ సమస్యను నియంత్రించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ద్రాక్షలో ఉన్న అధిక పాలీఫెనాల్స్, రెస్వెరాట్రాల్ కంటి కణాలను రక్షించడంలో సహాయపడతాయి. ఈ పోషకాలు కంటి ఆరోగ్యానికి ఎంతో అవసరం. ముఖ్యంగా ఫ్రీ రాడికల్ నష్టం నుండి కళ్ళను రక్షించడంలో ప్రతి రోజు కొన్ని ద్రాక్షలు తినడం కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. పిస్తాపప్పులో లుటీన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కంటి ఆరోగ్యానికి అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉన్నవి. పిస్తాపప్పు తినడం వల్ల కళ్ళకు ప్రాణాంతకమైన కాంతి తరంగాల ప్రభావం తగ్గించవచ్చు.

# కర్భూజను వీరు తినకూడదు!



వేసవికాలం వచ్చినప్పుడల్లా శరీరానికి చల్లదనాన్ని అందించే పండ్లు తినడం అనివార్యం. అందులో ముఖ్యంగా కర్భూజ చాలా మందికి ఇష్టమైన పండు. ఇది తిన్న వెంటనే దాహాన్ని తీరుస్తుంది. ముఖ్యంగా ఇందులో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల వేసవి వేడిని తట్టుకునే శక్తిని అందిస్తుంది. పైగా ఇందులో విటమిన్ ఇ, జింక్, ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు, ఫైబర్ వంటి అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన పౌష్టికతను అందించడంతో పాటు, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరిచేలా సహాయపడతాయి. ఆరోగ్య సమస్యలు ఉన్న కొంతమంది వ్యక్తులు కర్భూజను తినకుండా దూరంగా ఉండటం మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో దీనిని అధికంగా తీసుకోవడం వల్ల రోగనిరోధక వ్యవస్థ మీద ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా డయాబెటిస్, కిడ్నీ సమస్యలు, చర్మ సంబంధిత అలర్జీలు, గ్యాస్ట్రిక్ సమస్యలతో బాధపడేవారు ఈ పండును మితంగా తీసుకోవడం లేదా వైద్యుల సలహా తీసుకుని మాత్రమే తినడం ఉత్తమం. డయాబెటిస్ ఉన్నవారు కర్భూజను ఎక్కువగా తినకూడదు. నిపుణుల మాట ప్రకారం ఈ పండులో గ్లైసెమిక్ ఇండెక్స్ 60–80 మధ్య ఉంటుంది. దీన్ని అధికంగా తీసుకున్నట్లయితే రక్తంలో షుగర్ లెవల్స్ పెరిగిపోవచ్చు. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు దీన్ని తినే ముందు వైద్యుని సలహా తీసుకోవడం ఉత్తమం. చర్మ సమస్యలు లేదా అలర్జీలతో బాధపడేవారు కర్భూజను తినకపోవడమే మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. కొందరికి ఇది తిన్న వెంటనే దద్దుర్లు, దురద, వాపు, మచ్చలు వంటి సమస్యలు రావొచ్చు. అలాంటి వారు వైద్యుల సూచన మేరకు మాత్రమే దీనిని తీసుకోవడం ఉత్తమం.పేగుల సమస్యలు, గ్యాస్, ఉబ్బరం, ఇరిటబుల్ బవల్ సిండ్రోమ్ ఉన్నవారు కర్భూజను తినకపోవడమే మంచిది. ఇందులో అధికంగా ఫైబర్ ఉండటం వల్ల జీర్ణక్రియపై ప్రభావం చూపించే అవకాశం ఉంది. దీనిని ఎక్కువగా తీసుకుంటే పేగుల్లో గ్యాస్ పెరిగి అసౌకర్యానికి గురికావొచ్చు. కిడ్నీ సమస్యలతో బాధపడేవారు కూడా కర్భూజను తినకూడదు. దీని పొటాషియం శాతం అధికంగా ఉండటం మూత్రపిండాల పనితీరును ప్రభావితం చేసే అవకాశం ఉంది. కిడ్నీలు సరిగ్గా పనిచేయకపోతే పొటాషియం శరీరంలో పేరుకుపోయి ఆరోగ్య సమస్యలు తీసుకురావచ్చు. కర్భూజలో 90 శాతం వరకు నీరు ఉంటుంది. దీనిని అధికంగా తీసుకున్నట్లయితే శరీరంలోని సోడియం స్థాయిలు తగ్గి హైపోనాట్రేమియా అనే సమస్య ఏర్పడే అవకాశం ఉంది. దీని వల్ల ఒంట్లో వాపు, నీరసం, మూత్రపిండాల సమస్యలు రావచ్చు.

# నిమ్మరసం తాగే ముందు జాగ్రత్త..!



మీ దంతాలను రక్షించుకోవడానికి, నిమ్మకాయ నీరు తాగేటప్పుడు స్ట్రా ఉపయోగించండి. ఇది ఆమ్ల ద్రవం దంతాలతో ప్రత్యక్ష సంబంధంలోకి రాకుండా నిరోధిస్తుంది. నిమ్మకాయలలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కడుపులో ఆమ్ల పరిమాణాన్ని పెంచుతుంది. కడుపు చికాకు, ఆమ్లత్వ సమస్యలు కూడా సంభవించే అవకాశం ఉంది. ఇది గుండెల్లో మంటకు కారణమవుతుంది. నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. కడుపుకు సంబంధించిన అనేక సమస్యలను తొలగిస్తుంది. వేసవిలో జనాలు ఎక్కువగా నిమ్మకాయలను వాడుతుంటారు. వారు రోజుకు ఎక్కువసార్లు నిమ్మరసం తాగుతారు. నిమ్మకాయలలో అధిక మొత్తంలో విటమిన్ సి ఉంటుంది. శరీరంలో విటమిన్ సి ఎక్కువగా ఉండటం వల్ల అనేక శారీరక సమస్యలు వస్తాయి. నిమ్మకాయలు ఎక్కువగా తీసుకోవడం వల్ల దంతాల నుండి మొత్తం ఆరోగ్యం వరకు అనేక సమస్యలు వస్తాయి. పెద్దలకు రోజుకు ఒకటి లేదా రెండు గ్లాసుల నిమ్మరసం సరిపోతుంది. కానీ అధిక వినియోగం అనేక శారీరక సమస్యలను కలిగిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. నిమ్మకాయను అధికంగా తీసుకోవడం వల్ల దంతాలు దెబ్బతింటాయి. దీనివల్ల దంతాలు సున్నితంగా మారవచ్చు. కావిటీస్ సమస్య పెరగవచ్చు. మీ దంతాలను రక్షించుకోవడానికి, నిమ్మకాయ నీరు తాగేటప్పుడు స్ట్రా ఉపయోగించండి. ఇది ఆమ్ల ద్రవం దంతాలతో ప్రత్యక్ష సంబంధంలోకి రాకుండా నిరోధిస్తుంది. నిమ్మకాయలలో సిట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది కడుపులో ఆమ్ల పరిమాణాన్ని పెంచుతుంది. కడుపు చికాకు, ఆమ్లత్వ సమస్యలు కూడా సంభవించే అవకాశం ఉంది. ఇది గుండెల్లో మంటకు కారణమవుతుంది. విటమిన్ సి ఎక్కువగా తీసుకోవడం కడుపుకు మంచిది కాదు. దీనివల్ల విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. నిమ్మకాయను అధికంగా తీసుకోవడం గొంతు ఆరోగ్యానికి మంచిది కాదు.

## బిజినెస్

### మూడేళ్లల్లో ఎఫ్‌డీలపై ముచ్చటైన రాబడి



ఫిక్స్‌డ్ డిపాజిట్ అనేది మీకు స్థిరమైన రాబడిని ఇచ్చే సురక్షితమైన పెట్టుబడి. ఎఫ్‌డీల్లో ఏడు రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు స్వల్ప లేదా దీర్ఘకాలిక కాలానికి పెట్టుబడి పెట్టవచ్చు. మీరు ఎంత పెట్టుబడి పెడతారు? ఎంతకాలం పెట్టుబడి పెడతారు? అనే దానిపై మీరు సంపాదించే వడ్డీ ఆధారపడి ఉంటుంది. ఎఫ్‌డీలపై వడ్డీ రాబడిని ప్రతి నెలా, ప్రతి 3 నెలలకు, ప్రతి 6 నెలలకు, ప్రతి సంవత్సరం, లేదా పెట్టుబడి ముగిసినప్పుడు ఒకేసారి ఎంచుకునే సదుపాయం ఉంది. సాధారణ, సీనియర్ సిటిజన్లు రూ. 8 లక్షలను మూడు ప్రధాన బ్యాంకుల్లో పెట్టుబడి పెడితే రాబడి ఎంత వస్తుంది? ఎస్‌బీఐ సాధారణ పౌరులకు వడ్డీ రేటు 6.75 శాతం ఇస్తుంటే సీనియర్ సిటిజన్లకు వడ్డీ రేటు 7.25 శాతం వడ్డీ ఇస్తుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు బ్యాంక్ ప్రస్తుతం తన 3 సంవత్సరాల ఎఫ్‌డీపైపై సాధారణ పౌరులకు 7 శాతం వడ్డీ రేటును అందిస్తోంది.సీనియర్ సిటిజన్లకు 7.50 శాతం వడ్డీ రేటును అందిస్తోంది. బ్యాంకు ఆఫ్ బరోడా సాధారణ పౌరులకు వడ్డీ రేటు 7.15 శాతం వడ్డీ ఇస్తుంటే సీనియర్ సిటిజన్లకు 7.65 శాతం వడ్డీ ఇస్తుంది. ఎస్‌బీఐ రూ. 8లక్షల పెట్టుబడిపై సాధారణ పౌరులకు 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,77,914గా ఉంది. అంటే రాబడి రూ. 1,77,914. సీనియర్ సిటిజన్లకు 3 సంవత్సరాల ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,92,438గా ఉంటుంది. అంటే రాబడి రూ. 1,92,438గా ఉంటుంది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.8 లక్షల పెట్టుబడిపై అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,85,151 ఉంది. అంటే మూడేళ్లల్లో రాబడి రూ. 1,85,151. సీనియర్ సిటిజన్లకు అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,99,773గా ఉంటే రాబడి రూ. 1,99,773గా ఉంది. బ్యాంకు ఆఫ్ బరోడాలో రూ.8లక్షల పెట్టుబడిపై అంచనా వేసిన మెచ్యూరిటీ మొత్తం రూ. 9,89,517గా ఉంది. అంటే రాబడి రూ. 1,89,517గా ఉంది. అలాగే సీనియర్ సిటిజన్లకు మెచ్యూరిటీ మొత్తం రూ. 10,04,198గా ఉంది. అంటే అంచనా వేసిన రాబడి రూ. 2,04,198గా ఉంది.

### వచ్చే నెల నుంచి పెరగనున్న ఈ వాహనాల ధరలు

దేశంలో ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి, వాహన కొనుగోలు దారులకు షాక్ ఇచ్చే వార్తను తెలిపింది. ఈ క్రమంలో ఏప్రిల్ 2025 నుంచి తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించింది. భారతదేశంలో అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సోమవారం కీలక ప్రకటన చేసింది. ఈ క్రమంలో తన వాహనాల ధరలను ఏప్రిల్ 2025 నుంచి పెంచుతున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో ధరల పెంపు తీసుకున్నామని, ఇది మోడళ్ల తీరును బట్టి మారుతుందని ఆటోమొబైల్ సంస్థ వెల్లడించింది. మారుతి సుజుకి ఇండియా మార్చి 17న రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని ప్రకటించింది. ధరల పెంపు ప్రకటన తర్వాత మారుతి సుజుకి షేర్ల ధర దాదాపు 2% పుంజుకుంది. మారుతి సుజుకి ఫిబ్రవరి 2025లో మొత్తం 199,400 యూనిట్ల వాహనాలను విక్రయించింది. గత సంవత్సరం ఇదే నెలలో అమ్ముడైన 197,471 యూనిట్ల నుంచి 0.97% స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరి 2025లో మొత్తం అమ్మకాలలో దేశీయ అమ్మకాలు 163,501 యూనిట్లు, ఇతర %ూజువీ%లవి 10,878 యూనిట్ల అమ్మకాలు, 25,021 యూనిట్ల ఎగుమతులు ఉన్నాయి. ఈ క్రమంలో ఎగుమతులు సంవత్సరానికి 13.5% తగ్గుదల ను నమోదు చేశాయి. మారుతి సుజుకి షేర్ ధర ఒక నెలలో 9% కంటే ఎక్కువ పడిపోయింది. మారుతి సుజుకి షేర్లు ఆరు నెలల్లో 5.2% పడిపోగా, ఒక సంవత్సరం కాలంలో 1% స్వల్పంగా పెరిగాయి. కానీ తాజాగా ఈ స్టాక్ ధర పుంజుకుంది. గత రెండు సంవత్సరాలలో మారుతి సుజుకి స్టాక్ ధర 40% ర్యాలీ చేసింది. ఇదే క్రమంలో ఈ కంపెనీ స్టాక్ ఐదు సంవత్సరాలలో 107% మల్టీబ్యాగర్ రాబడిని అందించడం విశేషం.

# ఎస్‌బీఐ స్కీమ్‌లో పెట్టుబడికి ముంచుకొస్తున్న గడువు




పొదుపు విషయంలో భారతీయులు ఎప్పుడూ ముందు ఉంటారు. భవిష్యత్‌ను ఆలోచించి పెట్టుబడి పెట్టే వారి సంఖ్య ఇటీవల కాలంలో కొంత తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ఇలాంటి వారిని ఆకర్షించేందుకు అన్ని బ్యాంకులు కొన్ని ప్రత్యేక స్కీమ్స్ ప్రకటిస్తున్నాయి. ఇటీవల ఎస్‌బీఐ ప్రకటించిన ఎస్‌బీఐ అమృత్ కలశ్ స్కీమ్ పెట్టుబడికి ఆఖరు తేదీ ముంచుకువస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్లు సురక్షితమైన, నమ్మదగిన పెట్టుబడి ఎంపికగా విస్తృతంగా పరిగణిస్తున్నారు. ముఖ్యంగా తక్కువ రిస్క్, అధిక-రిటర్న్ పథకాలను కోరుకునే సీనియర్ సిటిజన్లు పెట్టుబడిపై ఆసక్తి చూపుతున్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందించే అమృత్ కలాష్ ఎఫ్‌డీ స్కీమ్ నిర్ణీత కాలానికి ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను అందిస్తుంది. ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం అనేది మార్చి 31, 2025 వరకు అందుబాటులో ఉండే 400 రోజుల ప్రత్యేక డిపాజిట్ పథకంగా ఉంది.ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం సాధారణ పెట్టుబడిదారులకు సంవత్సరానికి 7.10 శాతం, సీనియర్ సిటిజన్లకు సంవత్సరానికి 7.60 శాతం వడ్డీ రేటును అందిస్తుంది. ఈ పథకం పదవీ విరమణ చేసిన వారికి, స్థిరమైన ఆదాయ మార్గాన్ని కోరుకునే వ్యక్తులకు ప్రత్యేకంగా ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ స్కీమ్‌లో రూ. లక్ష పెట్టుబడిపై, సాధారణ పెట్టుబడిదారులు 400 రోజుల వ్యవధిలో రూ. 7,100 వడ్డీని అందిస్తుంది. మరోవైపు సీనియర్ సిటిజన్లు రూ. 7,600 వరకు వస్తుంది. రూ. 10 లక్షల పెద్ద పెట్టుబడి సాధారణ పెట్టుబడిదారులకు రూ. 5,916, సీనియర్ సిటిజన్లకు రూ. 6,333 నెలవారీ వడ్డీ ఆదాయాన్ని ఇస్తుంది. ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం గడువును అనేకసార్లు పొడిగించింది. ప్రస్తుత గడువు, మార్చి 31 2025గా ఉంది. ఇకపై ఈ స్కీమ్‌పై ఎలాంటి పొడిగింపు ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకం సౌకర్యవంతమైన వడ్డీ చెల్లింపు ఎంపికలను అందిస్తుంది. నెలవారీ, త్రైమాసిక లేదా అర్ధ-వార్షిక లెక్కన వడ్డీ చెల్లిస్తారు. అలాగే రాబడిపై ఆదాయపు పన్ను చట్టం ప్రకారం టీడీఎస్ తగ్గించిన తర్వాత పెట్టుబడిదారుడి బ్యాంక్ ఖాతాకు జమ చేస్తారు. ఆసక్తి ఉన్న వ్యక్తులు ఎస్‌బీఐ యోనో బ్యాంకింగ్ యాప్ ద్వారా లేదా వారి సమీపంలోని %ాదీ×% శాఖను సందర్శించడం ద్వారా పెట్టుబడి పెట్టవచ్చు. ఎస్‌బీఐ అమృత్ కలశ్ పథకం ఆకర్షణీయమైన రాబడితో సురక్షితమైన పెట్టుబడి మార్గాన్ని అందిస్తున్నప్పటికీ పెట్టుబడి పెట్టే ముందు అన్ని స్కీమ్ సంబంధిత పత్రాలను జాగ్రత్తగా సమీక్షించడం చాలా అవసరం. ఏదైనా ఆర్థిక నిర్ణయాలు తీసుకునే ముందు ఆర్థిక సలహాదారుని లేదా సంబంధిత బ్యాంకును సంప్రదించడం చాలా మంచిది.

# టాటా నుంచి మరో అద్భుతమైన ఎలక్ట్రిక్ కారు




ఇప్పుడు టాటా మోటార్స్ కంపెనీ నుంచి మరో ఎలక్ట్రిక్ కారు మార్కెట్ లోకి విడుదల కావడానికి సిద్ధంగా ఉంది. కాగా టాటా కంపెనీ రాబోయే హారియర్ ఈవీ ప్రొడక్షన్ రెడీ వెర్షన్ ను ప్రవేశపెట్టింది. ఈ కారు త్వరలో ఇండియాలో అందుబాటులోకి రావచ్చుట. ఇంతకుముందు ఈ కారు జనవరి 2025లో జరిగిన ఇండియా మొబిలిటీ ఎక్స్‌పోలో ప్రదర్శించింది టాటా కంపెనీ. అయితే అప్పుడు ఇది కేవలం ఎగ్జిబిషన్ మోడల్ మాత్రమే. కానీ ఇప్పుడు టాటా ఈ కారును టెస్ట్ ట్రాక్ లో నడపడం ద్వారా దాని సామర్థ్యాలను ప్రదర్శించిందట. కాగా ఈ హరియర్ ఈవీ కారు అద్భుతమైన డిజైన్ తో రానుంది. దాని లుక్ పెట్రోల్ వెర్షన్ ని పోలి ఉంటుందట. అయితే దీనిలో కొన్ని ప్రత్యేక మార్పులు చేసిందట. అదేమిటంటే ఇది పెట్రోల్ వెర్షన్ నుండి భిన్నంగా ఉంటుందని తెలుస్తోంది. కాగా కారు డిజైన్ ను మరింత మెరుగుపరచడం కోసం దీనిలో కొత్త స్టైల్ అల్లాయ్ వీల్స్ ను ఏర్పాటు చేశారట. కారు వెనుక భాగం మునుపటిలాగే కనిపిస్తుందట. కానీ దీనికి కనెక్ట్ చేయబడిన ౠజుణ టెయిల్ లైట్లు ఉంటాయట. అలాగే ఇది కొద్దిగా భిన్నంగా ఉంటుందని, అలాగే వెనుక బంపర్ కూడా పునః రూపకల్పన చేయబడిందని చెబుతున్నారు. ఇప్పుడు ముందు బంపర్ లాగా నిలువు స్లాట్ లకు సరిపోతుందట. లోపలి భాగంలో టాటా హారియర్ ఈవీ లేఅవుట్ పెట్రోల్ వెర్షన్ ని పోలి ఉంటుందట. క్యాబిన్ ముఖ్యాంశాలు వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, ఆపిల్ కార్‌ప్లేకు మద్దతు ఇచ్చే 12.3 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ తో ఉందట. ఇందులో 10.25 అంగుళాల ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, పనోరమిక్ సన్‌రూఫ్, వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 10 స్పీకర్ జీదీూ సౌండ్ సిస్టమ్ ఉన్నాయట.

# బెంగళూర్ ప్రధాన కోచ్ దినేశ్ కార్తీక్

## స్పోర్ట్స్




ఐపిఎల్‌లో మెరుగైన ప్రదర్శన చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ప్రధాన కోచ్ దినేశ్ కార్తీక్ పేర్కొన్నాడు. కిందటి సీజన్‌లో బెంగళూరు టీమ్‌లో ఆటగాడిగా కొనసాగిన కార్తీక్ ఈసారి కోచ్ అవతారమెత్తాడు. ఈ క్రమంలో ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించాడు. ఐపిఎల్ ఆరంభం నుంచి ఆడుతున్నా తమకు ట్రోఫీ అందని ద్రాక్షగానే ఉందన్నాడు. ఈసారి ఆ లోటును పూడ్చుకోవాలని భావిస్తున్నట్టు వివరించాడు. దీని కోసం సమష్టిగా ముందుకు సాగుతామన్నాడు. ఆటగాడిగా పోల్చితే కోచ్ పదవి చాలా క్లిష్టమైందన్నాడు. అయితే తనపై ఎంతో నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చాడు. క్రికెటర్‌గా ఉంటే జట్టులో సేవ చేసేందుకు ఎంతో మంది సిద్ధంగా ఉంటారు. కానీ కోచ్‌గా బాధ్యతలను నిర్వర్తించేటప్పుడూ ప్రతిది తామే చేయాల్సి ఉంటుంది. ఒక మాటలో చెప్పాలంటే కోచ్ పదవి సెల్ఫ్ సర్వీస్ లాంటిది. ఇక్కడ మన బాధ్యత మనమే నిర్వర్తించాల్సి ఉంటుంది. ప్రస్తుతం తాను కూడా కోచ్ పదవిని చేపట్టా. దీని చాఅ కీలకమైన బాధ్యత. మెగా వేలం తర్వాత బెంగళూరు టీమ్‌పై పూర్తి దృష్టి సారించా. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో జట్టు కూర్పు ఎలా ఉండాలనే దానిపై ఇప్పటికే ఓ స్పష్టత వచ్చింది. ఐపిఎల్ వంటి మెగా టోర్నమెంట్‌లో ప్రతి జట్టు బలమైనదే. అన్ని జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. ఇలాంటి స్థితిలో జట్టును గెలుపు బాటలో నడిపించడం చాలా కష్టంతో కూడుకున్న అంశం. అయితే విరాట్ కోహ్లిలాంటి సీనియర్ ఆటగాడు జట్టులో ఉండడం తమకు సానుకూల పరిణామం. యువ కెప్టెన్ రజత్ పటిదార్‌లో అపార నాయకత్వ ప్రతిభ దాగివుంది. జట్టులో ప్రతిభావంతులైన ఆటగాళ్లకు కొదవలేదు. అందరిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే టోర్నమెంట్‌లో మెరుగైన చేయడం కష్టమేమీ కాదు. ఈసారి ఐపిఎల్‌లో హెూరాహెూరీ పోరు ఖాయంగా కనిపిస్తోంది. అన్ని జట్లు కూడా ట్రోఫీపై కన్నేశాయి. ప్రతి జట్టులోనూ అగ్రశ్రేణి ఆటగాళ్లు ఉన్నారు. స్వదేశీ, విదేశీ క్రికెటర్ల కలయికతో అన్ని జట్లు బలోపేతంగా మారాయి. దీనికి తోడు అన్ని జట్లలోనూ సీనియర్ కోచ్‌లు ఉన్నారు. దీంతో పోటీ నువ్వానేనా అన్నట్టు సాగడం తథ్యం. తాము మాత్రం కలిసికట్టుగా ఆడుతూ లక్ష్యం దిశగా అడుగులు వేస్తామని కార్తీక్ పేర్కొన్నాడు.

### తొలి రేసు నోరిస్‌దే!
### ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ ఫార్ములా వన్



ఫార్ములా వన్ సీజన్ తొలి రేసు నాటకీయ పరిణామాల నడుమ ఆద్యంతం ఉత్కంఠ రేపుతూ సాగింది. తొలి రెండు రోజులు విపరీత ఉష్ణోగ్రతలు డ్రైవర్లకు సవాల్ విసరగా.. ప్రధాన రేసుకు వరుణుడు రంగ ప్రవేశం చేశాడు. ఎడతెగని వర్షం, తడిసిన ట్రాక్‌పై పట్టు కోసం డ్రైవర్లు నానా తంటాలు పడ్డారు. ప్రమాదకర మలుపుల వద్ద నియంత్రణ కోల్పోయి డ్రైవర్లు ట్రాక్ తప్పారు. ఇన్ని అవాంతరాలను సమర్థవంతంగా దాటుకుంటూ మెక్‌లారెన్ డ్రైవర్ లాండో నోరిస్ (గ్రేట్ బ్రిటన్) టైటిల్‌ను ఎగరేసుకుపోయాడు. నాలుగు సార్లు వరల్డ్ ఛాంపియన్, రెడ్‌బుల్ డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ (బెల్జియం) రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. 58 ల్యాప్‌ల ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ రేసును గంటా 42 నిమిషాల 06.304 సెకండ్లలో లాండో నోరిస్ రేసును ముగించాడు. నోరిస్ కంటే 0.895 సెకండ్ల తర్వాత రేసును పూర్తి చేసిన వెర్‌స్టాపెన్‌కు నిరాశ తప్పలేదు. మెక్‌లారెన్ మరో డ్రైవర్, లోకల్ స్టార్ ఆస్కార్ పియాస్ట్రి తొమ్మిదో స్థానంతో రేసును ముగించాడు. తొలిసారి దిగ్గజ రేసింగ్ జట్టు ఫెరారీ తరపున బరిలో నిలిచిన లూయిస్ హామిల్టన్ పదో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానంలో నిలిచిన లాండో నోరిస్ 25 పాయింట్లను ఖాతాలో వేసుకుని డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌లో సైతం టాప్ ప్లేస్ సొంతం చేసుకున్నాడు. వెర్‌స్టాపెన్‌కు 18 పాయింట్లు, రస్సెల్ (మెర్సిడెస్) 15 పాయింట్లు దక్కాయి. ట్రాక్‌పై అవాంతరాలతో పలుమార్లు సేఫ్టీ కారు ట్రాక్‌పై చక్కర్లు కొట్టింది. నోరిస్ దూకుడు : ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ అర్హత రేసులో పోల్ పొజిషన్ సాధించిన లాండో నోరిస్.. రేసులోనూ అదే జోరు చూపించాడు. కాస్త ఆలస్యంగా ఆరంభమైన రేసులో ఆది నుంచి ముందంజలో కొనసాగాడు. 58 ల్యాప్‌ల (వలయాలు) రేసులో 44వ ల్యాప్ వద్ద కీలక పరిణామం చోటు చేసుకుంది. అప్పటివరకు నువ్వా నేనా అంటూ పోటీపడిన నోరిస్, ఆస్కార్ పియాస్ట్రి, వెర్‌స్టాపెన్‌లకు కీలక సవాల్ ఎదురైంది. 44వ ల్యాప్ 12వ మలుపు వద్ద నియంత్రణ కోల్పోయిన పియాస్ట్రి కారు పచ్చికపై చిక్కుకుంది. నోరిస్ కారు సైతం గులకరాళ్లపై నుంచి దూసుకెళ్లినా..గ్రేట్ బ్రిటన్ డ్రైవర్ ఎక్కువ సమయం వృథా కాకుండా చాకచక్యంగా ట్రాక్‌పైకి వచ్చాడు. ఈ సమయంలోనే వెర్‌స్టాపెన్ అగ్రస్థానంలోకి దూసుకెళ్లాడు. 46వ ల్యాప్ తర్వాత మళ్లీ వేగం పుంజుకున్న నోరిస్.. టాప్ గేర్‌లోకి దూసుకెళ్లాడు. చివరి రెండు ల్యాప్‌ల్లో వెర్‌స్టాపెన్ వెంబడించగా.. నోరిస్ గెలుపు గీతను ముందుగానే దాటాడు. 25 ఏళ్ల లాండో నోరిస్ డ్రైవర్ ఛాంపియన్‌షిప్‌లో ముందంజలో కొనసాగటం అతడి కెరీర్‌లోనే ఇది ప్రథమం. 'ఈ విజయం అద్భుతం. ఎంతో కఠిన రేసు. మాక్స్ వెర్‌స్టాపెన్ నా వెనకే ఉన్నాడు. చివరి రెండు ల్యాప్‌లకు ఒత్తిడికి లోనయ్యాను. సవాల్‌తో కూడిన పరిస్థితుల్లో అనూహ్య అవాంతరాలను ఎదుర్కొని రేసును ముగించటం సంతోషంగా ఉంది' అని లాండో నోరిస్ తెలిపాడు.

# మరో రికార్డుకు అడుగు దూరంలో కోహ్లీ



టీం ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ రికార్డులకు పెట్టింది పేరు. ఇప్పటికు ఎవరికి సాధ్యం కానీ రికార్డులను తన పేరిట రాసుకున్నాడు కోహ్లీ. అయితే ఇప్పుడు మరో రికార్డుకు అడుగు దూరంలో ఉన్నాడ్ను కోహ్లీ. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18వ సీజన్ ప్రారంభానికి సర్వం సిద్ధమైంది. మార్చి 22న కోల్‌కతా నైట్‌రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య తొలి మ్యాచ్ జరుగనుంది. ఈ టోర్నమెంట్ కోసం ఇప్పటికే అన్ని జట్లు కసరత్తులు చేస్తున్నాయి. అయితే ఈ సీజన్‌లో కోహ్లీ మరో అరుదైన రికార్డును అందుకొనే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో మరో సెంచరీ చేస్తే.. టి-20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసి భారత క్రికెటర్‌గా కోహ్లీ నిలుస్తాడు. ఈ జాబితాలో కోహ్లీ అగ్రస్థానంలోనే ఉన్నాడు. ఇప్పటికే కోహ్లీ 399 మ్యాచుల్లో 9 సెంచరీలు చేయగా.. రోహిత్ శర్మ 448 మ్యాచ్‌లు ఆడి 8 సెంచరీలు చేశాడు. కోహ్లీ ఎనిమిది సెంచరీలు ఐపీఎల్‌లో చేయగా.. 1 సెంచరీ అంతర్జాతీయ క్రికెట్‌లో చేశాడు. ఈ సీజన్‌లో ఒకటి లేదా ఎక్కువ సెంచరీలు చేస్తే.. కోహ్లీ తన రికార్డును తానే బ్రేక్ చేసే అవకాశం ఉంది.



# ఆ ఏడాదిలో పుష్ప 3 రిలీజ్ అని ప్రకటించేశారు

## కాని ఈ సినిమా ముందున్న సమస్యలు ఏంటంటే!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం పుష్ప. ఈ మూవీ బాక్సాఫీస్‌ని షేక్ చేసింది. . ఏ మాత్రం అంచనాలు లేకుండా వచ్చిన ఈ సినిమా భారీ వసూళ్లు రాబట్టింది. ఇందులోని పాటలు, డైలాగులు, యాక్షన్ సీక్వెన్స్ కి ప్రతి ఒక్కరు ఫిదా అయ్యారు. క్రికెటర్స్ సైతం ఈ సినిమాలోని బన్నీ మేనరిజమ్స్ ఇమిటేట్ చేశారు. ఇక పుష్ప చిత్రం భారీ హిట్ కావడంతో పుష్ప2ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించారు. గతేడాది రిలీజైన పుష్ప 2 ఏకంగా ఇండియన్ సినిమా బాక్సాఫీస్ రికార్డులు కొల్లగొట్టి ఏకంగా రూ. 1800 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అయితే పుష్ప 2 సినిమా ఎండింగ్ లో పుష్ప 3 కూడా ఉంటుందని మేకర్స్ హింట్ ఇచ్చారు. అయితే ఈ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందో అని అభిమానులు ఆలోచనలో పడ్డారు. ఈ క్రమంలో పుష్ప 3 సినిమా గురించి నిర్మాత రవిశంకర్ ఆసక్తికర కామెంట్స్ చేశాడు. 2028లో పుష్ప 3 సినిమాను విడుదల చేస్తామని వెల్లడించాడు.ఇంత వరకు బాగానే ఉంది కాని బన్నీ సినిమా 2028కి రావాలంటే దీని ముందు కొన్ని సమస్యలు ఉన్నాయి. ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ దర్శకత్వంలో ఒక సినిమా చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ సినిమా షూట్ పూర్తి చేసుకొని రిలీజ్ కావడానికి కనీసం ఏడాదైన పడుతుంది. అంటే అట్లీ బన్నీ సినిమా 2026 లోనే విడుదల అవుతుందని చెప్పాలి. ఇక త్రివిక్రమ్ కాంబినేషన్ లో చేసే భారీ మైథలాజికల్ సినిమా మేకింగ్ కు కనీసం రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉంది. అంటే 2028 లో ఆ సినిమా రావడానికి అవకాశం ఉంటుంది .ఒకవేళ త్రివిక్రమ్ శ్రీనివాస్ ఫాస్ట్‌గా లాగించిన కూడా 2027 చివరకు ఈ సినిమా వస్తుంది. ఈ సినిమా షూట్ అయిపోయాక పుష్ప 3 మొదలు పెట్టాలి. అంటే 2029 లో లేదంటే 2030లో పుష్ప 3 ని తెర మీద చూడాలి. అయితే అల్లు అర్జున్ మాత్రం ప్రస్తుతం మంచి జోష్ మీద ఉన్నారు. ముందు అయితే ఏదో ఒక సినిమాని ముందు రిలీజ్ చేయాలనే కసితో ఉన్నారు. ఆ తర్వాత త్రివిక్రమ్ సినిమా ముందు కానీ వెనుక కానీ వెళ్లే అవకాశం ఉంది. వేరే దర్శకులకి కూడా బన్నీ కమిటయ్యాడు. ఇవన్నీ దాటుకొని పుష్ప3 పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తెచ్చే ప్లాన్ అయితే బన్నీ రెడీ చేసుకోవాలి. సినీ విశ్లేషకుల ప్రకారం ఎలా చూసినా కూడా పుష్ప 3 సినిమా విడుదల కావడానికి 2030 అవుతుందని అంటున్నారు.



# ‘కోర్ట్’ను కూడా యూనివర్స్‌గా మారుస్తారా?


తెలుగులో ఫ్రాంఛైజీ చిత్రాలకు ఊపు తెచ్చిన చిత్రం.. హిట్. నాని నిర్మాణంలో శైలేష్ కొలను రూపొందించిన ‘హిట్: ది ఫస్ట్ కేస్’ సక్సెస్ కావడంతో తర్వాత ‘సెకండ్ కేస్’ వచ్చింది. ఇప్పుడు నానినే హీరోగా ‘హిట్–3’ చేస్తున్నాడు. ఇదే స్టయిల్లో ‘కోర్ట్’ సినిమాను కూడా ఫ్రాంఛైజీగా మార్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.‘కోర్ట్’ మూవీని కూడా నానినే నిర్మించిన సంగతి తెలిసిందే. రామ్ జగదీష్ అనే కొత్త దర్శకుడు రూపొందించిన ఈ చిత్రం.. ఈ శుక్రవారమే విడుదలైన సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. పేరుకున్న చిన్న సినిమానే కానీ దీనికి ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ వీకెండ్లో హౌస్ ఫుల్ కలెక్షన్లతో సినిమా రన్ అవుతోంది. ఈ నేపథ్యంలో నిర్వహించిన సక్సెస్ మీట్లో ‘కోర్ట్’ను ఫ్రాంఛైజీగా మార్చడంపై నాని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ‘కోర్ట్’ సినిమా బాక్సాఫీస్ ఫ్లో చూస్తుంటే.. దీనికి సీక్వెల్ తీయాల్సిన అవసరం ఉందేమో అనిపిస్తోందని నాని అన్నాడు. ‘కోర్ట్’ ఇప్పుడు చిన్న సనిమానే కానీ.. సీక్వెల్ అనౌన్స్ చేస్తే మాత్రం అది పాన్ ఇండియా మూవీ అయిపోతుందని, పెద్ద రేంజికి చేరుకుంటుందని నాని అన్నాడు. ‘కోర్ట్’ను కూడా ‘హిట్’ తరహాలోనే యూనివర్స్‌గా మారిస్తే బాగానే ఉంటుందని.. ఈ రెండు యూనివర్స్‌ల క్రాస్ ఓవర్ కూడా ప్లాన్ చేయొచ్చని.. దీన్ని తాను మైండ్‌లో పెట్టుకుంటానని నాని అన్నాడు.



# ఛావా మరో రికార్డు

విడుదలై నెలరోజులు దాటుతున్నా ఛావా పరుగులు ఆగడం లేదు. వీక్ డేస్ లో నెమ్మదించినప్పటికీ వారాంతం వస్తే చాలు విక్కీ కౌశల్ మళ్ళీ పేట్రేగిపోతున్నాడు. దీని తర్వాత చెప్పుకోదగ్గ బాలీవుడ్ మూవీ రాకపోవడం వసూళ్ల పరంగా కలిసి వస్తోంది. ఇటీవలే రిలీజైన జాన్ అబ్రహం ది డిప్లమాట్ కు మంచి టాక్ వచ్చినా కూడా అది కలెక్షన్లుగా మారలేకపోతోంది. ఆలస్యంగా రిలీజైనప్పటికీ ఛావా తెలుగు వెర్షన్ పదిహేను కోట్లను దాటేయడం చిన్న విషయం కాదు. ఒకవేళ కోర్ట్ కనక దూకుడుగా లేకపోయి ఉంటే మరాఠా వీరుడు పాతిక కోట్లను టార్గెట్ చేసేవాడే. కానీ మిస్సయ్యే సూచనలు ఎక్కువగా ఉన్నాయి.తాజాగా ఛావా మరో మెయిలు రాయి అందుకుంది. నెట్ కలెక్షన్ల పరంగా ఇండియన్ బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్స్ లో ఎనిమిదో స్థానానికి ఎగబాకింది. యానిమల్ (553 కోట్లు), జవాన్ (543 కోట్లు) ని దాటేసి ఛావా 555 కోట్లను అందుకుంది. ఇంకా ఫైనల్ రన్ కాలేదు కాబట్టి మరో వంద కోట్లకు పైగా అదనంగా తొడవ్వొచ్చని ఒక అంచనా. గ్రాస్ పరంగా చూసుకుంటే ఛావా 741 కోట్లతో చాలా స్ట్రాంగ్ గా ఉంది. ఓవర్సీస్ లోనూ 86 కోట్ల దాకా వసూలు చేయడం మరో రికార్డు. టాప్ 10లోకి ప్రవేశించిన ఛావా హీరో విక్కీ కౌశల్ కు తొలిసారి ఈ క్లబ్బులో చోటు సంపాదించి పెట్టింది. ఖాన్లు, కపూర్ల డామినేషన్ ని సవాల్ చేసే నెంబర్లు ఇచ్చింది. ఇక ఛావా ముందున్న నెక్స్ట్ టార్గెట్ వెయ్యి కోట్ల గ్రాస్. అదేమీ అసాధ్యం కాదు కానీ అలాని సులభము కాదు. ఇప్పటికే నెమ్మదించిన రన్ ని తిరిగి కొనసాగించాలంటే జనాన్ని మళ్ళీ థియేటర్లకు వచ్చేలా చేయాలి. ఒక వారం రోజులు అయ్యాక ఓటిటి స్ట్రీమింగ్ దగ్గర్లో ఉన్నప్పుడు ఆఫర్లు ప్రకటించాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారట.

# విజయ్ దేవరకొండ అన్నయ్యగా సత్యదేవ్ ?



రౌడీ బాయ్ విజయ్ దేవరకొండ కెరీర్ లో అత్యంత భారీ బడ్జెట్ తో రూపొందుతున్న ప్యాన్ ఇండియా మూవీ కింగ్ డమ్ షూటింగ్ చివరి దశకు వస్తోంది. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి దీన్ని తీర్చిదిద్దిన విధానం గురించి యూనిట్ చెబుతున్న లీకులు అంచనాలను అమాంతం పెంచేస్తున్నాయి. అవేంటనేది రిలీజ్ దగ్గర్లో ఉన్నప్పుడు చూసుకోవచ్చు కానీ ఒక ముఖ్యమైన అప్డేట్ ఆసక్తి రేపేలా ఉంది. ఇందులో సత్యదేవ్ ఓ కీలక పాత్ర చేస్తున్న సంగతి తెలిసిందే. ఇన్ సైడ్ టాక్ ప్రకారం తను విజయ్ దేవరకొండకు అన్నయ్యగా నటించాడట. శ్రీలంక తెగలో నాయకుడిగా ఆ క్యారెక్టర్ పవర్ ఫుల్ గా ఉంటుందని సమాచారం.సత్యదేవ్ మీద నడిచే ట్విస్టు ద్వారా విజయ్ దేవరకొండ ఆ సామ్రాజ్యానికి రావడమనే ఎపిసోడ్ చాలా హై ఇంటెన్స్ తో ఉంటుందని అంటున్నారు. టీజర్ లో చూపించిన విజువల్స్ లో తనవాళ్లు విలన్ల రక్తదాహానికి బలైతే మిగిలిన తెగను కాపాడేందుకు వచ్చిన లీడర్ గా విజయ్ ఇంటెన్స్ వేరియేషన్స్ చూపించడం గమనించాం. ఒక భాగమా లేక రెండు భాగాలు ఉంటుందానేది నిర్మాణ సంస్థ సితార ఇంకా రివీల్ చేయలేదు. గతంలో నాగవంశీ చెప్పిన ప్రకారం సీక్వెల్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంది. ప్రస్తుతం హైదరాబాద్ షెడ్యూల్ కి షిఫ్ట్ అయిపోయిన కింగ్ డంకు అనిరుద్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నాడు. మే 30 విడుదల కాబోతున్న కింగ్ డమ్ ప్రమోషన్లు వచ్చే నెల నుంచి ప్రారంభం కాబోతున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో వాయిదా లేకుండా అన్ని ప్లానింగ్ ప్రకారం జరిగిపోతున్నాయి. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్ గా నటిస్తున్న ఈ హిస్టారికల్ డ్రామాలో శ్రీలంక ఎపిసోడ్లు టెర్రిఫిక్ గా వచ్చాయట.



# హంస కూడా ఈ వయ్యారి సొగసుకి దాసోహం..

## ఫ్యాబులస్ కేతిక..

కేతిక శర్మ ఒక భారతీయ చలనచిత్ర నటి, ఆమె ప్రధానంగా తెలుగు చిత్రాలలో కనిపిస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలకు సోషల్ మీడియాలో తెగ లైక్స్ వస్తున్నయి. మీరు కూడా వీటిని ఒక్కసారి చుడండి. కేతిక శర్మ ఒక భారతీయ చలనచిత్ర నటి, ఆమె ప్రధానంగా తెలుగు చిత్రాలలో కనిపిస్తుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోలకు సోషల్ మీడియాలో తెగ లైక్స్ వస్తున్నయి. మీరు కూడా వీటిని ఒక్కసారి చుడండి. 24 డిసెంబర్ 1995న భారతదేశ రాజధాని ఢిల్లీ నగరంలో ఓ హిందూ కుటుంబంలో జన్మించింది వయ్యారి భామ కేతిక శర్మ. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని లా మార్టినియర్ బాలికల పాఠశాలలో స్కూలింగ్ విద్యను పూర్తిచేసింది ఈ ముద్దుగుమ్మ. ఢిల్లీ నగరంలో ఉన్న మిరాండా హౌస్, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తన గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది ఈ అందాల తార. చదువు పూర్తయ్యాక మోడలింగ్ లో తన కెరీర్ ను ప్రారంభించింది ఈ వయ్యారి. పలు బ్రాండ్ల ప్రకటనల్లో కనిపించింది. తన డబ్స్‌మాష్ వీడియో క్లిప్‌ల కారణంగా సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దింతో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ అయింది. 2021లో ఆకాష్ పూరికి జోడిగా రొమాంటిక్ అనే ఓ టాలీవుడ్ సినిమాతో చలనచిత్ర అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. తర్వాత లక్ష్య, రంగ రంగ వైభవంగా అనే చిత్రాల్లో హీరోయిన్ గా చేసింది. అయితే ఈ రెండు చిత్రాలు ఆకట్టుకోలేకపోయాయి. పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ ప్రధాన పాత్రల్లో వచ్చిన బ్రో సినిమాలో కథానాయకిగా కనిపించింది.దీనికి పాజిటివ్ టాక్ వచ్చింది. ప్రస్తుతం శ్రీవిష్ణుకి జోడిగా చసింగల్ సినిమాలో నటిస్తుంది. అలాగే నితిన్ రాబిన్?హుడ్?లో స్పెషల్ సాంగ్?లో అలరించనుంది.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com